# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 46 సంచిక : 2 విజయవాడ 20-5-2013 పేజీలు : 12 వెల : రు 5.00



లోపలి పేజీల్లో...

- కామ్రేడ్ ఖోఖన్ మజుందార్‌తో ముఖాముఖి
- జాతీయ దురహంకారాన్ని రెచ్చగొడ్తూ పబ్బం గడుపుకుంటున్న భారత, పాకిస్తాన్ పాలకవర్గాలు
- 'పెట్టుబడి' పాలనను అంతమొందించేందుకు పోరాడమనేదే మేడే పిలుపు
- విదేశీ పెట్టుబడిపరమౌతున్న చిన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు
- ఝార్ఖండ్ : ప్రజానుకూల అభివృద్ధి విధానానికై ప్రజా జాతా


## ఎరువుల సబ్సిడీకి మంగళం పాడుతున్న పాలకులు

**అంతర్జాతీయంగా** ఎరువుల ధరలు తగ్గాయని, అందువలన డి.ఏ.పీ. టన్ను ధర 1500రూ, మ్యూరియేట్ పొటాష్ (ఎంఓపీ) 1000 రూ. తగ్గుతుందని, ఆ మేరకు సబ్సిడీని తగ్గించటం ద్వారా ప్రభుత్వానికి 5 వేల కోట్ల భారం తగ్గుతుందని ఆర్థికమంత్రి చిదంబరం ప్రకటించారు. ఆ మేరకు కేంద్రమంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. ప్రపంచ మార్కెట్లో ధరలు తగ్గిన మేరకు, తానిచ్చే సబ్సిడీని ప్రభుత్వం తగ్గించుకుంటున్నది తప్ప సబ్సిడీని అలాగే వుంచి రైతాంగానికి ఎరువుల ధరలు తగ్గించేందుకు పూనుకోలేదు. ఇది కూడా ప్రపంచ మార్కెట్టు ధరలు తగ్గుతాయని ఆశిస్తూ సబ్సిడీని తగ్గించింది తప్ప నిజానికి ఇంకా ప్రభుత్వం చెప్పిన మేరకు ధరలు తగ్గలేదు. అంటే తగ్గించిన సబ్సిడీని మించి ఎరువుల ధరలు పెరుగుతాయన్నమాట.

ప్రపంచ బ్యాంక్ సూచనల మేరకు సస్యవిప్లవం పేరుతో హైబ్రిడ్ విత్తనాల దిగుమతి, అధిక దిగుబడులకోసం రసాయనిక ఎరువుల వాడకం సేద్యంలో ప్రారంభమైంది. సామ్రాజ్యవాదులు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల కంపెనీల ఎరువులు కొనుగోలు చేసేవిధంగా, ఎరువులపై సబ్సిడీ యిచ్చేందుకు భారతదేశానికి ఆర్థిక సహాయం అందించింది. మొదట సబ్సిడీలను ప్రోత్సహించిన ప్రపంచ బ్యాంక్ నేడు రైతులకు యిచ్చే సబ్సిడీని ఎత్తివేయమని భారత పాలకులపై ఒత్తిడి చేస్తున్నది. ప్రపంచ బ్యాంక్ షరతులకు, సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి దాసోహమంటున్న పాలకులు, సబ్సిడీలను ఎత్తివేసే విధానాలను అమలు జరుపుతున్నారు.

ఎరువులపై యిచ్చే సబ్సిడీని నేరుగా కంపెనీలకే ప్రభుత్వం అందజేస్తుంది. ఉత్పత్తికి అయ్యే ఖర్చులతో, రవాణా ఖర్చులు, డీలర్ మార్జిన్, వ్యయం కలిపి, వాణిజ్య ధరకు, రైతులు కొనుగోలు చేసే ధరలకు మధ్య వ్యత్యాసాన్ని రాయితీల రూపంలో ఎరువుల పరిశ్రమాధిపతులకు ప్రభుత్వం చెల్లిస్తుంది. సరళీకృత ఆర్థిక విధానాల్లో భాగంగా డీ.ఏ.పీ, కాంప్లెక్స్, ఎంఓసీ ఎరువులపై ప్రభుత్వం నియంత్రణ ఎత్తివేసి, ఎరువులపై సబ్సిడీని తగ్గించటం ప్రారంభించింది. జాతీయ స్థూల ఉత్పత్తిలో ఎరువుల సబ్సిడీ 1990-91లో 8.5 శాతం వుండగా, 2008-09లో 1.52%, 2012-13 బడ్జెట్‌లో 1.90%గాను వుంది. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో దాన్ని 2 % మించకుండా చూస్తామని ఆనాటి ఆర్థికమంత్రి ప్రణబ్‌ముఖర్జీ ప్రకటించాడు. ఎరువుల సబ్సిడీపై నియమించిన కేల్కర్ కమిటీ కూడా ఎరువు సబ్సిడీ విధానాన్ని త్వరగా సంస్కరించాలని, ఎరువుల సబ్సిడీని 2014-15 నాటికి 1.8% తగ్గించాలని పేర్కొంది.

ప్రతి సంవత్సరం పరిశ్రమాధిపతులకు లక్షల కోట్ల రూపాయల రాయితీ ఇస్తున్న పాలకులు, రైతులకిచ్చే ఎరువుల సబ్సిడీ 70వేల కోట్ల రూపాయలను భారంగా భావించటం రైతాంగం ఎడల ప్రభుత్వ విధానాలకు అద్దంపడుతున్నది. అమెరికా-యూరోపియన్ దేశాల్లో రైతాంగానికి(భూకామందులకు) యిస్తున్న సబ్సిడీని గమనిస్తే, మన రైతాంగానికి యిచ్చే సబ్సిడీ కంటి తుడుపు చర్యగా, రైతాంగపు ప్రయోజనాలను నెరవేర్చనిదిగా వుంది. దీనికి కూడా పాలకులు మంగళంపాడుతున్నారు. 2011-12 సం॥బడ్జెట్‌లో 67,197 కోట్లుగావున్న సబ్సిడీని 2012-13 సం॥ బడ్జెట్‌లో 60,974 కోట్లకు తగ్గించారు. ఇదే క్రమంలో ఎరువుల పరిశ్రమాధిపతులు నష్టాలపాలై యిబ్బందులు పడుతున్నారని చెప్పి 5వేల కోట్లు బ్యాంకులనుండి అప్పుయిప్పించి, తానే వడ్డీ కడతానని చెప్పిన ప్రభుత్వానికి రైతుల ఆత్మహత్యలు మాత్రం కన్పించలేదు.

ప్రస్తుతం అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గటం మూలంగా 5 వేల కోట్ల సబ్సిడీని తగ్గిస్తున్నానని, ఆ మేరకు ఎరువుల ధరలు తగ్గుతాయని చెప్పటం రైతాంగాన్ని భ్రమలకు గురిచేయటమే. సబ్సిడీ తగ్గింపు వలన ఎరువుల ధరలు తగ్గకపోగా ఇంకా పెరుగుతున్నాయి.

మూడు సంవత్సరాల క్రితం వరకు ఎరువుల తయారీకి అయ్యే ఖర్చులను లెక్కగట్టి దేశమంతటా ఒకేధర అమలయ్యే విధంగా గరిష్ట ధరను ప్రభుత్వమే నిర్ణయించేది. ఆ విధంగా ధరల నిర్ణయాధికారం ప్రభుత్వం చేతిలో ఉండేది. దాన్ని ప్రభుత్వం వదులుకొంది. ధర నిర్ణయాధికారాన్ని పరిశ్రమాధిపతులకే వదలివేసింది. అంతేకాకుండా పోషకాలను బట్టి ఎరువులకు సబ్సిడీని ప్రకటించింది. ఫలితంగా కొన్ని ఎరువులకు నామమాత్రపు సబ్సిడీ మాత్రమే లభించటంతో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. గత రెండు సంవత్సరాల కాలంలో పరిశ్రమాధిపతులు ఎరువుల ధరలను 12సార్లు పెంచారు. ఫలితంగా డీ.ఏ.పీ. ధర 517.40 రూపాయల నుండి 1315 రూ; కాంప్లెక్స్ ఎరువులు 472 నుండి 1298 రూ॥; మిశ్రమ ఎరువుల ధరలు 312 నుండి 885 రూ; యూరియా ధర 100 రూ॥పెరిగింది. ఎరువుల కంపెనీలు, తమకు లభిస్తున్న సబ్సిడీని బట్టే రైతులకు విక్రయించేందుకు ఎరువుల ధరను ప్రకటిస్తాయి. తాజాగా 5వేల కోట్ల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం తగ్గించింది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గటంవలన భారతదేశంలోనూ వాటి ధరలు తగ్గాలి. ఎరువులపై ప్రభుత్వం యిస్తున్న సబ్సిడీని తగ్గించనప్పుడే అది సాధ్యమౌతుంది. అందుకు విరుద్ధంగా ప్రభుత్వం 5వేల కోట్ల సబ్సిడీని తగ్గించితే, కంపెనీలకు అందే సబ్సిడీ తగ్గిందని, ఉత్పత్తి ఖర్చులు పెరిగాయని, ఎరువుల కంపెనీలు మరింతగా ధరలను పెంచే అవకాశం వుంది. ఆ విధంగా ప్రభుత్వ నిర్ణయం ఎరువుల ధరలు పెరగటానికి దోహదపడుతుందేతప్ప తగ్గే అవకాశమేలేదు.

ప్రస్తుతం మూడు కోట్ల టన్నులమేర డీ.ఏ.పీ., పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అవసరం. ప్రతి సంవత్సరం ఎరువుల వాడకం దేశంలో పదిశాతం పెరుగుతున్నది. అందుకు అనుగుణంగా దేశంలో మాత్రం ఎరువుల ఉత్పత్తి జరగటంలేదు. గత 15 సంవత్సరాలుగా కొత్తగా ఒక్క ఎరువుల ఫ్యాక్టరీ కూడా నిర్మాణం కాకపోవటమే అందుకు నిదర్శనం. దీన్ని గమనిస్తే ఎరువుల రంగంలో దేశ పరాధీనత స్పష్టమౌతున్నది. విదేశీ దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది. ప్రతి సంవత్సరం డై అమ్మోనియా ఫాస్ఫేట్ (డీ.ఏ.పీ.) 90%, మ్యూరేట్ పొటాష్ (ఎంఓసీ) 100%, యూరియా 70 లక్షల టన్నులు దిగుమతి చేసుకొంటున్నాము. ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యే రసాయనిక ఎరువుల్లో సగం భారతదేశంలోనే వినియోగించబడుతున్నాయి.

ప్రభుత్వం వ్యూహాత్మకంగానే ఎరువుల సబ్సిడీ భారాన్ని గణనీయంగా తగ్గించుకొనే విధానాలు అమలుపరుస్తున్నది. అందుకు అనుగుణంగానే-ఎరువుల ధరల నిర్ణయాధికారం పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టటం, పోషక విలువలనుబట్టి రాయితీని ప్రకటించటం, సబ్సిడీని ప్రతి సంవత్సరం తగ్గించుకొంటూ రావటం, ఇప్పుడు అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గాయని బడ్జెట్‌లో తగ్గించిన దానికన్నా మరో ఐదువేల కోట్లు తగ్గించటం... ఈవిధంగా ఎరువుల సబ్సిడీని నామమాత్రం చేయనున్నది. **(తరువాయి 2వ పేజీలో)**

ప్రకటన

## రైతాంగాన్ని బంధితపాలేర్లుగా దిగజార్చే, వ్యవసాయాన్ని పరాధీనంజేసే, కార్పొరేటు/కాంట్రాక్టు సేద్యానికి బడాకంపెనీలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలి

**వ్యవసాయ** ఉత్పాదకాల ఖర్చును గణనీయంగా పెంచి, సంస్థాగత రుణ సదుపాయాన్ని రైతులకు లభించనీయకుండా, ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడేట్లు జేసి; అవాంతరాల నెదుర్కొని చేతికొచ్చిన పంటకైనా గిట్టుబాటు ధర కల్పించకుండా, విపత్తులలో రైతాంగాన్ని ఆదుకోకుండా... రైతులను రుణభారంలో ముంచి లక్షలాది రైతుల బలవన్మరణాలకు కారణమైన పాలకులు, వారి ప్రణాళికాసంఘ నివేదిక...చిన్న కమతాల్లో సేద్యం గిట్టుబాటుకావటం లేదంటూ మొసలికన్నీరు కారుస్తున్నారు. ఆపై కేంద్రప్రభుత్వం సన్న,చిన్నకారు రైతులను ఆదుకొని, సమీకృత వ్యవసాయాభివృద్ధి సాధించటానికంటూ కుట్రపూరితంగా కార్పొరేటు సేద్యాన్ని పరిష్కారంగా ముందుకు తెచ్చింది. రైతుల నుండి నేరుగా వ్యవసాయ ఉత్పత్తులను పెద్దస్థాయిలో కంపెనీలు కొనుగోలు చేయటానికి 'ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ, పశుఉత్పత్తుల) మార్కెట్టు చట్టం - 1969' ఆటంకంగా ఉంది. కాగా రాష్ట్రప్రభుత్వ వ్యవసాయ సహకారశాఖ 2012 జూన్ 30న జీవోఎంఎస్ నెం 113 ద్వారా పై చట్టానికి సవరణలు చేసి, వ్యవసాయ ఉత్పత్తులలో ప్రైవేటు వాణిజ్యానికి వీలు కల్పిస్తూ కాంట్రాక్టు సేద్యానికి వున్న చట్టపర అడ్డంకులను కూడా తొలగించివేసింది. ఈ విధంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్పొరేటు/కాంట్రాక్టు సేద్యానికి గతంలోవున్న చిన్న, చితకా చట్టపర అడ్డంకులనన్నీ తొలగించివేశాయి.

కేంద్రప్రభుత్వం దేశవ్యాపితంగా 17 రాష్ట్రాల్లో రాష్ట్రీయకృషి వికాస్‌యోజన పేరుతో, సమీకృత వ్యవసాయాభివృద్ధి లక్ష్యమంటూ ప్రైవేటు-పబ్లిక్ భాగస్వామ్యం పేరిట, భారీ యంత్రాలనుపయోగించి వ్యవసాయంచేసే కార్పొరేటు/కాంట్రాక్టు సేద్యాన్ని ప్రజలపై రుద్దేందుకు పూనుకొంది. దీనికై 34 సంస్థలకు అనుమతినివ్వగా, మన రాష్ట్రంలోని 8 జిల్లాలలో ప్రయోగాత్మకంగా ఈ పథకం అమలుకు సన్నాహాలు మొదలయ్యాయి.

ఇప్పటికే దేశవ్యాపితంగా రిలయన్స్, జైన్, ఐటిసి, ర్యాలీస్, క్యాడ్‌బరీస్, పెప్సీకో, కోకోకోలా, గోద్రెజ్, తదితర అనేక బడా, బహుళజాతి కంపెనీలు పొగాకు, మిర్చి, పండ్లు, కూరగాయలు, బంగాళదుంపలు, బార్లీ, మామిడి, వేరుశనగ తదితర పంటలకు సంబంధించి కార్పొరేటు సేద్యం సాగిస్తూన్న దాని దుష్ఫలితాలు; పెద్దఎత్తున ప్రచారార్భాటాలతో సాగించిన ఇజ్రాయిల్ కంపెనీ కుప్పం కాంట్రాక్టు సేద్యపు దుర్మార్గాలు... మన ముందున్నాయి.

ఈ సేద్యంలో చట్టంప్రకారం రైతుభూమిపై కాంట్రాక్టు సేద్య కంపెనీకి ఎలాంటి యాజమాన్య హక్కూ 'కాగితం'పై వుండకున్నా, పరోక్షంగా ఆ సేద్య కంపెనీనే భూస్వామిలా వ్యవహరిస్తుంది. ఏ పంట వేయాలో, భూమి ఎలా దున్నాలో, ఎప్పుడు ఎంతనీరు పెట్టాలో, ఏ విత్తనాలు వాడాలో, ఏ ఏ ఎరువులు, క్రిమిసంహారకాలు వాడాలో, ఇవన్నీ సేద్య కంపెనీనే నిర్ణయిస్తుంది.

భూస్వామి నిర్ణయాలు చేసి పాలేర్లు, కూలీలతో పనులన్నీ చేయిస్తాడు. కాంట్రాక్టు/కార్పొరేటు సేద్యానికి అంగీకరించిన రైతు ఆచరణలో పాలేరుగా పనిచేయాలి. అయితే తేడా ఏమంటే, అక్కడ దిగుబడి భూస్వామికి చెంది, పాలేరు 'కూలీ' లేదా 'వేతనం' పొందుతాడు. కానీ, ఇక్కడ కాంట్రాక్టు సేద్యంలో రైతు, కంపెనీ దోపిడీ అవసరాలు తీర్చే బంధితుడిగా మారిపోతాడు. 3 నుండి 5 ఏళ్ళు చేసుకునే ఈ ఒప్పందంలో దేశవ్యాపితంగా ఈ బడా సేద్య కంపెనీలకు ప్రభుత్వం అందించే వేల కోట్ల రాయితీలు అనుభవించిన తర్వాత రైతులను ఈ కంపెనీలు గాలికొదిలినా అడిగే దిక్కులేదు. నాణ్యత పేరుతో గ్రేడింగుల పేరుతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ధరలు దిగకోసినా, వివాదాలు తలెత్తినా పట్టించుకునే నాధుడుండడు.

దేశంలో 9 నుండి 10 కోట్ల చిన్న కమతాలున్నాయి. 2005-06లో 83.29 శాతంగా వున్న ఈ కమతాలు 2010-11 కల్లా 84.97 శాతానికి పెరిగాయి. ఏటా 15-20 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులుగానూ, మరింతమంది వ్యవసాయకూలీలుగానూ దిగువస్థాయికి జారిపోతున్నారు. అయినప్పటికీ మార్కెట్టుకు వచ్చే వ్యవసాయ వుత్పత్తులలో 42శాతం చిన్న కమతాలనుండే వస్తోంది. కంపెనీల లాభాలే పరమావధికావటంతో చిన్నకమతాలలోని బహుళపంటల విధానం దెబ్బతింటుంది. ముఖ్యంగా ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి, ప్రజలకు ఆహార లభ్యత దుర్లభమౌతుంది. రైతు - పాలేరుగా సేద్యపు కంపెనీకి కట్టిపడవేయబడటంతోపాటు, వ్యవసాయరంగం సామ్రాజ్యవాద, గుత్తపెట్టుబడి గుప్పెటలోకి వెళ్ళిపోయి మరింత పరాధీనమౌతుంది.

ఈ నేపథ్యంలో, **కాంట్రాక్టు/కార్పొరేటు సేద్యానికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను తక్షణం రద్దుచేయాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది. వివిధ రైతు కూలీసంఘాలు, ప్రజాస్వామిక మేధావులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఐక్యంగా పాలకుల ఈ రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కలిసిరావాలని పిలుపునిస్తున్నది.**

విజయవాడ
10-3-13

విప్లవాభినందనలతో
**యస్.ఝాన్సి**
**రాష్ట్ర అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**

# కామ్రేడ్ ఖోఖన్ మజుందార్‌తో ముఖాముఖి

కా॥ఖోఖన్ మజుందార్‌తో కా॥శంభుమహాతో సంభాషణపై ఆధారపడి ఈ ముఖాముఖిని రూపొందించాము. మూడేళ్లక్రితం కా॥మజుందార్ పక్షవాత రోగగ్రస్తులవటంతో ఆయన మాట తొట్రుపడుతున్నది. ఆయన జీవితకాలమంతా కమ్యూనిస్టు పార్టీ చరిత్రతో ముడిపడివుంది. 1948లో ఉమ్మడి సిపిఐతో ప్రారంభమై, సిపిఐ(యం), తర్వాత సిపిఐ(యం-యల్) వరకూ ఆయన జీవితం సాగింది. ఆయనకుగానీ, ఆయన కుటుంబీకులకుగానీ ఎలాంటి ఆస్తులూ లేవు. పార్టీ, శ్రమజీవులే ఆయన కుటుంబం. నక్సల్బరీలో వున్న పార్టీ కార్యాలయంలోనే ఆయన నివాసం. 80ఏళ్ళ వయసులో కూడా కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆయనను దగ్గరగా చూస్తుంటే రెట్టించిన ఉత్సాహం కలుగుతుంది.

**– సంపాదకుడు**

**డార్జిలింగ్ కమిటీ సభ్యునిగా పార్టీ కార్యకలాపాలను ఎప్పటి నుండీ సాగించారు? ఆనాటి ఘటనల్లో ప్రముఖమైన వాటి గురించి చెప్పండి**

1953లో కా॥రతన్‌లాల్ బ్రాహ్మణ్ ఇంటికి చేరాను. అప్పటికి జిల్లా కమిటీలో నా సభ్యత్వం గురించి డార్జిలింగ్ కమిటీకి తెలియదు. ఎందుకంటే సిపిఐ పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటీ నన్ను జిల్లా కమిటీ సభ్యునిగా నియమించి పంపింది. 1953 నుండీ నేను పార్టీ నిర్మాణంలో భాగమయ్యాను.

ఆ సంవత్సరమే పార్టీ జిల్లా మహాసభ జరిగింది. నేను ప్రతినిధిగా పాల్గొన్నాను. ఆ సమయంలో పార్టీలోకి కొత్తసభ్యులను తీసుకొనే సమస్యమీద చర్చ జరిగింది. చర్చించిన తర్వాత ఎవరినైనా పార్టీ సభ్యునిగా తీసుకోవచ్చు నన్నది కా॥చారుమజుందార్ అభిప్రాయం. నేను దీనిని వ్యతిరేకించాను. కొంతకాలం ప్రజాసంఘాలలో పనిచేసిన తర్వాత పార్టీ సభ్యునిగా తీసుకోవాలన్నది నా అభిప్రాయం.

**మీరు జిల్లా కమిటీ సభ్యులేనా?**

అన్ని జిల్లా మహాసభల్లోనూ నేను జిల్లాకమిటీ సభ్యునిగా ఎన్నిక కాలేదు. కొన్నిసార్లే ఎన్నికయ్యాను. ఒకసారి నేను కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయాను. కా॥లీలా మజుందార్ (కా॥చారు జీవితసహచరి) గెలిచారు. ఆ సమయంలో నేను పూర్తికాలపు కార్యకర్తను, కా॥లీల పార్ట్‌టైమ్ కార్యకర్త.

**భారత–చైనా యుద్ధ సమయంలో డార్జిలింగ్ జిల్లాలో పార్టీ పరిస్థితి ఎలా వుండేది?**

1962లో భారత – చైనా యుద్ధం జరిగింది. కమ్యూనిస్టు పార్టీలో దీనిపై విబేధాలున్నాయి. ఆ సమయంలో కా॥ చారుమజుందార్, కా॥ రతన్‌లాల్ బ్రాహ్మణ్‌లు కలసి భారత్ దురాక్రమణదారని ప్రకటన ఇచ్చారు. పార్టీ నాయకులూ, కార్యకర్తల అరెస్టులు సాగుతున్నాయి. నన్నూ కా॥కానూసన్యాల్, కేశవ్ సర్కార్, సౌరేన్‌బోస్, బిరేన్ సర్కార్, శివేన్ చక్రవర్తి తదితరులను అరెస్టుచేసి బెహరన్‌పూర్ జైలుకు పంపారు.

1964లో దేశవ్యాపితంగా సిపిఐలో చీలిక వచ్చినా, 1965లో కూడా జైలులో పార్టీ విడిపోలేదు. జైలులోపల రాజకీయాల అధ్యయనం, క్లాసులు సాగుతుండేవి. మా ఆలోచనల్లో విప్లవానికి సంబంధించిన ఒక పటం తయారవుతోంది. ఆ సమయంలో భారత విప్లవానికి సంబంధించిన కా॥చారు మజుందార్ డాక్యుమెంట్‌పై కాలింపాంగ్ పట్టణంలోని పిటిఐ విలేఖరి వార్తాకథనాన్ని దినపత్రికలు ప్రచురించాయి. ఇది మాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. ఎందుకంటే జైలులో సాగుతున్న చర్చా, ఆ వార్తాకథనం ఒక దిశలో వున్నాయి. దీనితో భారత్‌లో విప్లవ యుద్ధవిధానాన్ని మేము నిర్ణయించుకున్నాము.

**నక్జల్బరీ, ఛటేర్‌హాట్‌లలో విభిన్న పోరాట పద్ధతులను ప్రయోగాత్మకంగా అమలుచేశారు. దీనిలో ఛటేర్‌హాట్ ప్రయోగం విఫలమైంది. దీని గురించి చెప్పండి.**

మేము జైలులో వున్నపుడు, జైలు బయటవున్న కా॥చారు మజుందార్, దీపక్‌బిశ్వాస్, కదంలాల్‌మల్లిక్, శాంతిపాల్, మరో కలకత్తా నుండి వచ్చిన కామ్రేడూ (పేరు గుర్తుకురావటంలేదు,) ఒక టీముగా పనిచేసేవారు. భూస్వాముల ఇళ్ళు తగలబెట్టమని ఈ ప్రాంతమంతటా ప్రజలలో ఈ టీము ప్రచారం చేసింది.

మేము జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత, కా॥మండల్ కర్మార్కర్ ఇంట్లో నక్సల్బరీలోని కార్యకర్తల సమావేశం జరిగింది. అక్కడ పోరాట పద్ధతులపై ఏకాభిప్రాయం కుదరలేదు. కా॥బాబూలాల్ విశ్వకర్మార్కర్ ఇంట్లో మరో సమావేశం ఏర్పాటుచెయ్యాలనీ, దానికి కా॥దీపక్ విశ్వాస్ టీమును పిలవకూడదనీ కా॥ కానూ సన్యాల్ నిర్ణయం తీసుకున్నారు. దీనితో కా॥కానూసన్యాల్ నాయకత్వంలో నక్సల్బరీలోనూ, కా॥దీపక్ బిశ్వాస్ నాయకత్వంలో ఛటేర్‌హట్‌లోనూ పోరాట పద్ధతుల్లో రెండు రకాల ప్రయోగం మొదలైంది. నక్సల్బరీ ప్రాంతంలో కామ్రేడ్లు కానూసన్యాల్, ఖోఖన్ మజుందార్, జంగల్ సంతాల్, కేశవ్ సర్కార్, రాధూనాథ్ విశ్వకర్మార్కర్, బాబూలాల్ విశ్వకర్మార్కర్, రోపన్ రాజ్‌గోండ్, ఖుదన్ మల్లిక్‌లు నాయకత్వ టీముగా వుండేవారు. కార్యకర్తల్లో అధికభాగం వీరితో వున్నారు. తర్వాతి రోజుల్లో కా॥కదంలాల్ మల్లిక్, కా॥బెనర్జీ కలిశారు. కా॥బెనర్జీ పూర్తిపేరు గుర్తుకు రావటంలేదు. ఛటేర్‌హట్ ప్రయోగం విఫలమైంది. ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు.

**చారిత్రక నక్సల్బరీ ప్రజాఉద్యమం గురించి చెప్పండి.**

ఆ రోజులో పెద్దయెత్తున రైతాంగం, భూస్వాముల భూములు స్వాధీనపర్చుకున్నారు. ధాన్యం పంచుకున్నారు. నక్సల్బరీ రైల్వేస్టేషన్‌లో పెద్దసంఖ్యలో పోలీసులను మోహరించారు. 1967 మే 24న విల్లంబులు, కొన్ని నాటు తుపాకులూ, కొన్ని పిస్తోళ్ళు పట్టుకొని వేటకి బయలుదేరినట్లు రైల్వేస్టేషన్ వైపు వెళ్లాం. రైలు పట్టాలపైకి చేరాం. ఎదురుగా పోలీసులు ముందుకొస్తున్నారు. మా వైపు నుండి కొన్ని బాణాలు వేశాము. తుపాకులూ పేలాయి. దీనితో ఒక పోలీసు అధికారి శీ.వాగది మృతిచెందగా, మరో ఏఎస్ఐకి బాణంవల్ల గాయమైంది. ఇతను నా కాళ్ళు పట్టుకుని రక్షించమని వేడుకున్నాడు. మేమతనికి 'క్రిందనే పడుకుని ఉండిపో నీకేమీ కాద'ని చెప్పాము. మిగిలిన పోలీసులు వెనక్కి పారిపోయారు. అయితే కొద్ది సేపట్లోనే పెద్దసంఖ్యలో తిరిగివచ్చి దాడిచేశారు. మేము రెండుగా చీలి రెండువైపులకూ తప్పుకుంటూ పెద్దగా కేకలు పెట్టడంతో పోలీసులు భయపడి వాళ్ళే వెనక్కు వెళ్ళారు.

దీనితో పోలీసుల బదులుగా అర్ధసైనిక బలగాన్ని దించారు. మేము కదలికలేని స్థితిలోపడ్డాము. 35 గంటలు తిండీతిప్పలు లేకుండా అడవిలోనే చిక్కుకుపోయాము. ఈ దిగ్బంధనం నుండి బయట పడేందుకు కా॥ కానూసన్యాల్ నాయకత్వంలో అర్ధసైనిక బలగంపై దాడిచేసి తప్పించుకొని అడవినుండి బయటపడే ప్రయత్నం చేశాము. అది విఫలమైంది. దీనిలో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు. తర్వాత ఒక ప్రభుత్వ జీపులో బంగ్లాదేశ్ సరిహద్దు దగ్గరకు చేరి ఒక ఇంట్లో రక్షణ తీసుకున్నాము. కా॥జంగల్ సంతాల్, బాబూలాల్ విశ్వకర్మ అడవిలోనే వుండిపోయారు. అడవిలో చెడిపోయి ఆగిపోయిందని చెప్పి జీపును పార్టీ ఏర్పాటుచేసింది.

1967జూలై5న అర్ధసైనిక దళం హధీఘీసా గ్రామాన్ని చుట్టుముట్టింది. ఇక్కడ ఇద్దరు లేక ముగ్గురు కామ్రేడ్స్‌ను చంపివేసి, మిగిలిన వారిని అరెస్టు చేశారు.

**నక్సల్బరీ ఉద్యమంసాగి 45ఏళ్ళయింది. దాని నుండి పుట్టిన పార్టీలు అనేక గ్రూపులయ్యాయి. ఈ పరిణామాన్ని మీరెలా చూస్తున్నారు?**

తెలంగాణా, తెభాగాల విప్లవ చింతన నుండి నక్సల్బరీ ముందుకు వచ్చింది. ఈనాటికీ నక్సల్బరీ రాజకీయాలు అంధకారంలో వెలుగుచూపుతున్నాయి. ఈ దేశంలో అర్ధభూస్వామ్య, అర్ధవలస వ్యవస్థను నక్సల్బరీ నుండి పుట్టిన రాజకీయాలే సవాలు చేస్తున్నాయి. ఈ స్రవంతిలోని ఒకటి రెండు గ్రూపులు పేరుకు మాత్రమే విప్లవ కమ్యూనిస్టు సంస్థలుగా వున్నాయి. వాస్తవానికి కమ్యూనిస్టు విప్లవకారుల చరిత్రలో వారు పతనమయ్యారు. అయినప్పటికీ వాటిలో విప్లవతత్వమున్న వారు పెద్ద సంఖ్యలో వున్నారు. పార్లమెంటరీ పంథా ద్వారానే లేక అడవి పంథా ద్వారానే విప్లవం రాదని మనం అర్ధం చేసుకోవాలి. ప్రజావిప్లవాచరణ మాత్రమే విప్లవ ద్వారాలను తెరవగలుగుతుంది. ఈ ప్రజాపంథా అంగీకరించే వారందరూ ఒకటిగా ఐక్యం కావాలి. ఇటీవలే జరిగిన సిపిఐ (ఎం–ఎల్), సిపిఐ (ఎం–ఎల్) సెంట్రల్ ఆర్గాన్ జనశక్తిల ఐక్యత ఈ దిశగా వెలుగును ప్రసరిస్తుందన్నది నిశ్చయం. ✡

# గిరిజన హక్కులను కాలరాచే ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ బహిరంగసభ



బహిరంగసభలో ప్రసంగిస్తున్న కా॥డి.వర్మ

**కుంతేసు, 24-4-13 :**

విజయనగరం జిల్లా, కొమరాడ మండలంలోని ఏజెన్సీ గ్రామం కుంతేసులో 24-4-13న అడవిమీద ఆదివాసుల హక్కులను కాలరాసే ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బహిరంగసభ జరిగింది. 30 ఏజన్సీ గ్రామాల నుండి 600 మంది ఆదివాసులు ఈ సభకు హాజరయ్యారు.

బహిరంగసభకు ముందు గిరిజనులు తమ సాంప్రదాయక వాయిద్యాలతో, కిందిరి డ్యాన్సుతో ఊరేగింపుగా బహిరంగసభా స్థలికి చేరుకున్నారు. ఈ సభకి అధ్యక్షులుగా హిమరక మిన్నారావు, చోడి కెంపయ్యలు వ్యవహరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు గ్రామమైన కుంతేసులో బహిరంగసభకి వచ్చిన వారందరికి విప్లవాభినందనలు తెలియచేస్తూ, గిరిజన పోరాటంలో అమరులైన కామ్రేడ్స్ జెన్నితిరుపతి, కేంద్రుక అర్జున, కోరన్న, మంగన్న, కారం పార్వతిలకు జోహార్లు చెప్పారు. ఇదే రోజు అమరులైన కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డికి నివాళులర్పించారు.

“ఆదిమ తెగల నుండి అడవినే నమ్ముకుని అడవినే కన్నతల్లిగా అడవిమీద హక్కుకోసం, స్వేచ్ఛకోసం, రాజుల కాలంలోను, బ్రిటీషు కాలంలోనూ స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా తమ సంస్కృతీ సాంప్రదాయాలను రక్షించుకుంటూ ఆదివాసులు ఎన్నో పోరాటాలు, తిరుగుబాట్లు చేసారు. అడవి సంపదపైన కన్నుపడిన బ్రిటీషువాడు 1865లో ఫారెస్టు చట్టాన్ని తెచ్చి గిరిజనులను ఆ పేరుతో ఆంక్షలు విధించి, అడవికి వెళితే పన్నులువేసి, కేసులు పెట్టి, గిరిజనులను అడవి నుండి దూరం చేశాడు. దీనికి వ్యతిరేకంగా గిరిజనులు కొమరం భీమ్, బిర్సా ముండా, లక్ష్మన్‌నాయక్, అల్లూరిల నాయకత్వంలో బ్రిటీషు వాడికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారు. వీటి ఫలితంగా పాలకులు గిరిజనులకు అనుకూలంగా కొన్ని చట్టాలు చేయక తప్పలేదు. ఈ చట్టాల అమలు కోసం, ఏజెన్సీలో భూమికోసం, భుక్తికోసం శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం జరగటంతో 1970లో 1/70 చట్టం చేశారు. ఈ చట్టం ద్వారా గిరిజనుల భూములు గిరిజనులకే దక్కుతాయని, ఏజెన్సీలో భూ బదలాయింపులు జరిగవని చెప్పారు. 1/70 చట్టం, పీసాచట్టం, అటవీహక్కుల చట్టం చేసినా ఈ రోజుకీ భూమి సమస్య పరిష్కరించబడలేదు. గిరిజనులకు భూమి దక్కలేదు. ఏజెన్సీలో భూమి బదలాయింపు జరుగుతూనే వుంది. కొండలపైన వీరికి కనీస అవసరాలైన మంచినీరు, రహదారి సౌకర్యంలేదు. వైద్యం అందుబాటులో లేక వందలసంఖ్యలో గిరిజనులు మరణిస్తున్నారు. సాగునీటి వనరులున్నా వాటిపై ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. ఈ రోజుకీ చాలా గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటించలేదు. గిరిజన అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కాని అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఏజెన్సీలో ఉన్న సహజ వనరులను బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు, సామ్రాజ్యవాదులకు అప్పచెప్పి గిరిజనులను అడవి నుండి దూరం చేయాలనే కుట్ర జరుగుతోంది. దీనికి వ్యతిరేకంగా గిరిజనులంతా మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కామ్రేడ్ వర్మ పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సభలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ పి.శ్రీనునాయుడు, కా॥ ఎమ్.భాస్కరరావు, కా॥ బొత్స నర్సింగరావు, కద్రక వెంకటస్వామి, ఒరిస్సా ఛాసీములియా ఆదివాసీ సంఘనాయకులు కా॥ కొండగొర్రి పెడమ్మ, కద్రక కిర్మ, హమరక సీతన్నలు మాట్లాడారు. ప్రజాకళాకారులు పాటలు పాడారు. ✡

**ఎరువుల ...** (మొదటి పేజీ తరువాయి)

పాలకులు అనుసరిస్తున్న విధానాల వలన వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో పడింది. ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారకమందుల ధరలు పెరుగుతూ వుండటం, సేద్యానికి సాగునీటి సమస్య ఏర్పడటం, ప్రకృతి వైపరీత్యాలవలన ప్రతి సంవత్సరం అపారంగా పంటలకు నష్టం వాటిల్లటంతోపాటు పండిన పంటకు కూడా న్యాయమైన ధర లభించటంలేదు. పెరిగిన పంటఖర్చులు, గిట్టుబాటుగాని ధరల మూలంగా రైతాంగం అప్పుల పాలై, దాన్నుండి బయటపడలేక సేద్యమంటేనే భయపడే పరిస్థితికి ప్రభుత్వం రైతాంగాన్ని తీసుకొచ్చింది. క్రమంగా రైతాంగం వ్యవసాయం నుండి తప్పుకొంటున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం రైతాంగం సంఖ్య 10కోట్ల 30 లక్షలు వుంటే, 2010 నాటికి 9 కోట్ల 58 లక్షలకు పడిపోయింది. అంటే 72 లక్షలమంది రైతులు సేద్యం నుండి తప్పుకొన్నారు. రోజుకి 2000మంది రైతులు వ్యవసాయానికి దూరమౌతున్నారని తాజా గణాంకాలు తెలియచేస్తున్నాయి. మరొక వైపున వ్యవసాయ కూలీల సంఖ్య 4 శాతం పెరిగింది. ఈ పెరుగుదల భూములు కోల్పోయిన రైతులు వ్యవసాయ కూలీలుగా మారటమే.

సేద్యం గిట్టుబాటుకాక అప్పులపాలైన రైతాంగం, వున్న ఆస్తులు తెగనమ్మినా అప్పుతీరే మార్గం కానరాక, అవమానాలు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశంలో ప్రతి 12 గంటలకు ఒకరైతు ఆత్మహత్య చేసుకొంటున్నాడు. ఈ విషయాన్ని ప్రభుత్వ గణాంకాలు తెలియచేస్తున్నాయి. 1995–2009 మధ్యకాలంలో 2.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, నేటికి వారి సంఖ్య 2లక్షల 74 వేల 346కి చేరుకొంది. 2009లో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 17వేల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. మన రాష్ట్రంలోనూ వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇవన్నీ జాతీయ క్రైమ్ నివేదిక లెక్కలే. వాస్తవ పరిశీలనలో ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా వుంటుంది.

రైతాంగానికి – ఎరువులు, విత్తనాలపై యిచ్చే రాయితీ తగ్గింపు విధానాలను విడనాడాలని, రాయితీ మొత్తాన్ని గణనీయంగా పెంచాలని, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల ధరలు తగ్గించాలని, ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించాలని, ఎరువుల ధరల నిర్ణయాధికారాన్ని ప్రభుత్వమే తిరిగి చేపట్టాలని, ఎరువుల సబ్సిడీ విధానాన్ని పోషక విలువలను బట్టికాక, పాత పద్ధతినే కొనసాగించాలని రైతాంగం డిమాండ్ చేస్తూ ఉద్యమించాలి. ✡


నాల్గవ ముద్రణ
రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద
(వ్యాససంకలనం)
సిపిఐ (ఎం–ఎల్) ప్రచురణ
వెల: 15/-
కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

# జాతీయదురహంకారాన్నీ, పొరుగుదేశంపై విద్వేషాన్నీ రెచ్చగొడుతూ పబ్బంగడుపుకొంటున్న భారత్, పాకిస్తాన్ పాలకవర్గాలు

**దేశప్రజల** ఆకాంక్షలను పట్టించుకోకుండా, తమ స్వార్ధపూరిత దోపిడీ ప్రయోజనాలను పరిరక్షించుకొని, పెంపొందించుకొనే ఏకైక లక్ష్యంతోనే నాటి భారత పాలకవర్గాలు, బ్రిటీష్ వలసవాదులతో చేసుకొన్న హేయమైన విద్రోహపూరిత ఒప్పందానికి పుట్టిన కవల పిల్లలే నేటి భారత్, పాకిస్తాన్ దేశాలు. ఈ రకంగా దేశాన్ని రెండుముక్కలుగా విభజించిన కుట్రలో అటు బ్రిటీష్ సామ్రాజ్యవాద వలస పాలకులు, ఇటు యిప్పటి రెండు దేశాలకు చెందిన నాటి పాలకవర్గాలే కారణం అన్నది నిరాకరించ వీలులేని సత్యం.

నేడు భారత, పాకిస్తాన్ దేశాలను ఏలుతున్న పాలకవర్గాలు, పాలకవర్గపార్టీలు నాడు ఈ విద్రోహానికి పాల్పడ్డ పాలకవర్గాల వారసులే! అయితే ఎవరిమట్టుకు వారు దేశవిభజన అన్నది తమకు సంబంధం, ప్రమేయం లేని ఘటన అన్నట్టుగా నటిస్తూ, నిరంతరం పొరుగు దేశంపై, తమ దేశ ప్రజల్లో అకారణ విద్వేషం రెచ్చగొడుతూ తమ పాలనలను సాగిస్తున్నారు. గత 66 సంవత్సరాలుగా యిరుదేశాలకు చెందిన పాలకులూ, పాలకవర్గపార్టీలూ, అధికారంలోనూ, విపక్షంలోనూ వున్న పాలకపార్టీలూ యిదే విధానాన్ని అనుసరించి అమలుజరుపుతూ, తమతోబాటు విడివడిన పొరుగు దేశాన్ని నిరంతరం ద్వేషించటమే, దేశభక్తి అన్నట్లుగా ప్రచారంచేస్తూ అటువంటి బూటకపు దేశభక్తికి తమ తమ దేశాల్లో ప్రజలను ప్రభావితం చేయటంలో చాలావరకు కృత కృత్యులయ్యారనే చెప్పాలి.

దేశంలో ఏ సమస్య తలెత్తినా, దాన్ని పరిష్కరించటానికి చిత్తశుద్ధితో పూనుకోవటానికి బదులు, పొరుగుదేశం ఏదో కూడని పని చేసిందనీ–చేస్తోందనీ అబద్ధపు ప్రచారం కావిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించడంలో సఫలీకృతం కాగల్గుతున్నారు. అంతేకాక పొరుగుదేశంపై విద్వేషాన్ని రెచ్చగొట్టటం ద్వారా తమ ఓటు బ్యాంకులు నిండుగా నిలబెట్టుకొనే పన్నాగాలను పన్నుతున్నారు. ఇందుకు మతవిద్వేషాన్ని ముమ్మరంగా రెచ్చగొడుతున్నారు. అయినదానికీ, కానిదానికీ ప్రజల్లో పొరుగుదేశం పట్ల – ప్రత్యేకించి భారత్‌దేశ ప్రజలకు పాకిస్తాన్‌పట్లా, పాకిస్తాన్ ప్రజలకు భారతదేశంపట్లా– విద్వేషం పెంచటానికవసరమైన కట్టుకథలను విస్తారంగా ప్రచారంచేస్తూ, నిరంతరం జాతీయ విద్వేషాగ్నిని ఎగదోస్తూ, యిరుదేశాల పాలకవర్గాలూ తమ పబ్బం గడుపుకొంటూ, ప్రభుత్వాధికారానికి రావటానికి దీన్నొక శక్తివంతమయిన ఆయుధంగా వాడుకొంటున్నారు.

మనదేశంలోని రెండు ప్రధాన పాలకపార్టీలయిన కాంగ్రెసు, బి.జె.పి.లు, ఈ రకంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా దేశంలో జాతీయ విద్వేషాన్ని రగులుస్తూ పోతున్నాయి. సెక్యులర్‌పార్టీగా చెప్పుకొనే కాంగ్రెసుపార్టీ, సూటిగా ఇస్లాంమతాన్నో, ముస్లింలనో నిందించకుండా, పరోక్షపద్ధతుల్లో పాకిస్తాన్ వ్యతిరేకతను–టెర్రరిస్టుల అణచివేత పేరిట–రెచ్చగొడ్తూవుంటే, ప్రస్తుతం మెజార్టీ ప్రతిపక్షపార్టీ అయిన బి.జె.పి. ఆదికాలం నుండీ–తన మాతృసంస్థ భారత జనసంఘ్ కాలనుండీ–హిందూ జాతీయవాదం పేరిట, ముస్లింలకు వ్యతిరేకంగానూ, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగానూ అనుక్షణం విద్వేషం రగుల్కొలుపుతూనే వుంది.

ఇటీవలికాలంలో పాకిస్థాన్‌పై మనదేశపు ప్రధాన పాలకపార్టీలు రెండూ, ఒంటికాలిపై లేవటాన్ని గమనిస్తూనే వున్నాం. 2008లో నాటి విదేశీమంత్రిగా వున్న ప్రణబ్‌ముఖర్జీ పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా కఠోరమైన వ్యాఖ్యలు చేస్తూ వుండటమే గాక, 26/11నాటి ముంబై ఘటన తర్వాత యించుమించు ప్రతిరోజూ పాకిస్తాన్‌ను బెదిరిస్తూనే వుండటం మనం ఎరిగున్నదే. ఈ రకంగా 'సెక్యులర్' యు.పి.ఎ పాలకులు పాకిస్తాన్ వ్యతిరేకతను, పాకిస్తాన్ పట్ల విద్వేషాన్నీ సజీవంగా నిలబెడుతూవుంటే, ప్రధాన ప్రతిపక్షమయిన బి.జె.పి, దాని మిత్రపార్టీలైన శివసేన తదితరులు పాకిస్తానీ క్రికెట్ ఆటగాళ్ళపైనా, పాకిస్థాన్ రచయితలు, కళాకారులపైనా, సల్మాన్ రష్దీ వంటి ప్రపంచ విఖ్యాత ముస్లిం రచయితలపైనా వివిధ రూపాల్లో తమ ప్రతాపాన్ని చూపిస్తూ, పాకిస్థాన్ విద్వేషాగ్నిని మరింత ఎగదోస్తున్నారు. ఎన్నికల ఎత్తుగడగా 'కాషాయ ఉగ్రవాదం' అని తన ప్రతిపక్షపార్టీ అయిన కాంగ్రెసు పార్టీ అన్నదాన్ని మైక్రోస్కోపులో చూపించి, కూడనిమాట ఏదో అన్నట్టుగా, రచ్చ రచ్చ చేసి, ఆ సందర్భాన్ని కూడా పాకిస్థాన్ పైనా, ముస్లింలపైనా విద్వేషాన్ని రెచ్చగొట్టడానికే బిజెపి నాయకులు వాడుకున్నారు. మాలెగావ్ ప్రేలుళ్ళ కేసులో దోషులైన సాధ్విప్రగ్యాసింగ్, కల్నల్ పురోహిత్ లాంటి కరుడుగట్టిన 'హిందుత్వ' తీవ్రవాదుల విషయాన్ని కప్పిపుచ్చుకోవటంకోసం, ముస్లింతీవ్రవాదులను కఠినంగా శిక్షించటంలో యు.పి.ఎ. పాలకులు వహించారని చెప్పబడే 'మెతక వైఖరి' గురించి బ్లాక్‌మెయిల్ చేసి, నోరేసుకుపడి, అసలు విషయాన్ని మరుగుపరచి, పాకిస్థాన్ వ్యతిరేక విద్వేషాన్ని మరింత రెచ్చగొట్టగలిగారు.

పాలకవర్గాల చేతనే నిర్వహింపబడుతున్న మీడియా (పత్రికలు, టీవీలు) కూడా మాటవరుసకు తాము 'తటస్థ వైఖరి వహించి కేవలం వాస్తవాలను వెల్లడించే' వార్తా వాహకులమేనన్నట్లు చెప్తూనే, తమదైన పద్ధతుల్లో – తమ సంపాదకీయాల ద్వారా, గెస్టులు వ్రాసిన వ్యాసాల ద్వారా, చర్చలు, ఇంటర్వ్యూలు అనబడేవాటి ద్వారా, 26/11 ఘటనను లేదా అలాంటి ఘటనలను పదే పదే చూపిస్తూ, నేర్పుతో డొంకతిరుగుడుగా పాకిస్థాన్‌పై విద్వేషాన్నీ, ముస్లింలపట్ల వ్యతిరేకతనూ రెచ్చగొడ్తున్నాయి.

అజ్మల్‌కసబ్, అఫ్జల్‌గురుల ఉరిశిక్షల అమలు సందర్భంలో భారీఎత్తున పాకిస్తాన్ వ్యతిరేక విద్వేషం, ముస్లింల పట్ల వ్యతిరేకతా, ముస్లింలే మూర్తీభవించిన టెర్రరిస్టులు అన్నట్టుగా ఒక విద్వేషోన్మాదం రెచ్చగొట్ట బడింది.

ఇటీవలి బెంగుళూరు, హైదరాబాద్ ప్రేలుళ్ళ ఘటనలు; పాకిస్థాన్–భారత్ సరిహద్దులలో జరిగిన సైనికుల ఘర్షణల ఘటనలు– ఈ పాకిస్థాన్ వ్యతిరేక విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి, జాతీయ విద్వేషాన్ని రెచ్చగొట్టడానికీ చక్కటి అవకాశాలుగా వినియోగించు కున్నారు. ఆఖరికి వామపక్షాలనబడే పార్టీలు కూడా అవసరమైన తటస్థ వైఖరి వహించక, పరోక్షంగా జాతీయదురహంకారాన్ని రెచ్చగొట్టే వైఖరినే తీసుకొన్నాయి – తీసుకొంటున్నాయి.

ఇదేవిధంగా పాకిస్థాన్‌లోని పాలకపార్టీలైన పిపిపి, జమాయత్–ఇ–ఇస్లామీ, జమాయిత్–ఉద్–దావా లాంటి కరుడుగట్టిన ముస్లిం మతోన్మాదపార్టీలూ, ముల్లాలు తదితరులు పాకిస్తానీ ప్రజలను నిరంతరం భారతదేశానికి వ్యతిరేకంగానూ, హిందువులకు వ్యతిరేకంగానూ, జాతీయోన్మాదాన్నీ, మతోన్మాదాన్నీ, విద్వేషాన్నీ రెచ్చగొడ్తున్నారు. ఇదంతా పాకిస్థానీ పాలకుల కనుసన్నల్లో జరుగుతున్నదేనన్నది నిర్వివాదమైన విషయం. పాకిస్థాను మీడియా కూడా అక్కడి పాలకుల, పాలకవర్గాలనే అనుసరిస్తూ, భారత వ్యతిరేక విద్వేషాన్ని ప్రజలలో రెచ్చగొట్టడంలో తనవంతు పాత్రను తానూ నిర్వహిస్తోంది.

ఇటువంటి నేపధ్యంలో అటు పాకిస్థాన్‌లో సాధారణ ఎన్నికలు జరిగే సందర్భంలో; యిటు భారతదేశంలోను, ఢిల్లీ రాష్ట్రంలోను వచ్చే సంవత్సరం జరగబోయే సాధారణ ఎన్నికల సందర్భంలో–యిరు దేశాల్లోనూ జరిగిన రెండు ఘటనలను–ఈ రెండు దేశాల్లోని పాలకవర్గాలూ, పాలకవర్గపార్టీలూ ఎంతగా పరస్పర విద్వేషాన్ని రెచ్చగొట్టి, తమ ఓట్ల బ్యాంకును పెంచుకోవటానికీ, ప్రజల్లో మసకబారిపోతున్న తమ పార్టీల ప్రతిష్టను పెంచు కొనేందుకూ–అడ్డంగా తెగబడుతున్నాయో స్పష్టం చేశాయి.

ఏప్రియల్ – 26వ తేదీన, పాకిస్థాన్‌లోని కోట్‌లోక్‌పట్ జైల్లో వున్న భారతదేశానికి చెందిన సరబ్‌జిత్‌సింగ్ అనే ఖైదీపై, తోటి ఖైదీలు దారుణంగా దాడిచేశారు. భయంకరమైన ఆ దాడికి గురైన సరబ్‌జిత్‌సింగ్, లాహోర్‌లోని జిన్నా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మే 2వ తేదీన మరణించాడు. పాక్‌దేశపు కోర్టు అతడు టెర్రరిస్టు అంటూ నిర్ధారించి, అతడికి మరణశిక్ష విధించింది. ఆపై పాకిస్తాన్ అధ్యక్షుడు అతడికి మరణశిక్షను రద్దుచేసి, యావజ్జీవ శిక్షగా దాన్ని మార్చాడు. ఇంచుమించు గత 25సంవత్సరాలుగా ఇతను పాకిస్తాన్ ఖైదులో మ్రగ్గుతున్నాడు. విదేశీ ఖైదీకి రక్షణలేకుండా, పాకిస్థాన్ జైలులో యిటువంటి హేయమైన దాడి జరగటానికి అనుమతించిన పరిస్థితులు ఖచ్చితంగా గర్హనీయమైనవే! జైలుదాడిలో సరబ్‌జిత్‌సింగ్ హత్య కావింపబడటాన్ని ముక్త కంఠంతో ఖండించాల్సిందే! విదేశీ ఖైదీలకు యితర ఖైదీల నుండి ప్రమాదాలు, దాడులు జరగకుండా రక్షించాల్సిన బాధ్యత పాకిస్తాన్ ప్రభుత్వానిదే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. కానీ యీ ఘటన ఓట్లు పెంచుకోవటానికి, పాలక పార్టీలకు ఒక చక్కటి అవకాశంగా చేతికి చిక్కింది.

1984లో సిక్కులపై జరిగిన దమనకాండకు బాధ్యులైన కాంగ్రెసుపార్టీ నాయకులు నేటికీ శిక్షింప బడకుండా వుండటం, ఆ సిక్కులపై జరిగిన మారణకాండలో పాల్గొన్న నిందితుడైన కాంగ్రెసు నాయకుడ్ని ఢిల్లీ కోర్టు నిరపరాధిగా వదిలివేయటం అన్నది, ఈ ఘటన జరిగే సమయానికి, సిక్కుల ఆగ్రహాన్ని జ్వలింపచేస్తూవుంది.

సరబ్‌జిత్‌సింగ్ హత్యఘటనను అకాలీదళ్–బి.జె.పిలు– కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సిక్కులను రెచ్చగొట్టేందుకు, రాబోయే ఎన్నికల్లో వారి ఓట్లను తమకే ఖాయపరచటానికీ వాడుకోజూస్తుంటే, యు.పి.ఎ. పాలకుల నాయకత్వ పార్టీ అయిన కాంగ్రెసు కూడా యీ ఘటన ఆధారంగా, తనపైవున్న వ్యతిరేకతను సిక్కు ప్రజల నుండి పోగొట్టి వాళ్ళను తన వైపు మళ్ళించుకోవాలన్న కుయుక్తిని ఎంచుకొంది.

ఫలితం సరబ్‌జిత్‌సింగ్ జాతీయ మృతవీరుడై పోయాడు. కాంగ్రెసు పార్టీ నాయకుడు, 'సిక్కు' ప్రధాని అయిన మన్మోహన్‌సింగ్ అయితే "చావుబతుకుల్లో వున్నప్పటికీ సరబ్‌పై పాక్ ప్రభుత్వం కనీస మానవత్వం చూపలేదంటూ" నిరసించాడు. సరబ్‌ను 'భారతమాత సాహస పుత్రుడు' అంటూ అభివర్ణించాడు. కాంగ్రెసు ప్రధాన నాయకుడు రాహుల్‌గాంధీ సరబ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, సరబ్‌జిత్‌సింగ్ సోదరి దల్బీర్‌తోబాటు తానూ కన్నీరు పెట్టాడు. కేంద్రప్రభుత్వం 25 లక్షల రూపాయలను సరబ్‌జిత్‌సింగ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అంతవరకూ అతీగతీలేని పాకిస్థాన్‌లోని భారత ఖైదీ సరబ్‌జిత్‌సింగ్ మృతదేహాన్ని తీసుకురావటానికి భారత ప్రభుత్వం ప్రత్యేక విమానాన్ని పంపించింది.

పంజాబ్‌రాష్ట్ర అకాలీపార్టీనేత, ముఖ్యమంత్రి ప్రకాశ్‌సింగ్ బాదల్ అయితే ఏకంగా ఒక కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాడు. 3 రోజుల పాటు రాష్ట్రంలో సంతాప దినాన్ని ప్రకటించాడు. సరబ్‌జిత్‌ను జాతీయ మృతవీరుడిగా గుర్తించాలని డిమాండుచేస్తూ, తాను అతడికి ఆ గుర్తింపు యిచ్చాడు. సరబ్‌జిత్‌కు రాష్ట్రప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాడు.

ఇక బి.జె.పి. అయితే, పాకిస్థాన్‌లో వున్న భారత్ హైకమీషనర్‌ను వెనక్కి పిలిపించాలనీ, ఇస్లామాబాద్‌తో వున్న దౌత్య సంబంధాలను తక్షణమే భారత ప్రభుత్వం తగ్గించాలని డిమాండు చేసింది. ముందుగా తమ పార్టీ నాయకురాలైన సుష్మాస్వరాజ్, సరబ్‌జిత్‌సింగ్ కుటుంబ సభ్యులను కల్సుకొని పరామర్శిస్తానని ప్రకటిస్తే, తమకన్నా ముందుగా రాహుల్‌గాంధీని పంపి, ఆ కుటుంబాన్ని పరామర్శింపజేసి, తమకన్నా ఎక్కువ రాజకీయ పాయింట్లు కొట్టేయటానికి కాంగ్రెసుపార్టీ ప్రయత్నించిందని బి.జె.పి విమర్శించింది. రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడైన బి.జె.పి.నేత అరుణ్‌జైట్లీ "ఈ ఘటన మన ప్రభుత్వం ఎంత పిరికి ప్రభుత్వంగా తయారైందో అన్నదానికి ఒక ఉదాహరణ" అంటూ విమర్శించాడు.

ముంబయిలోని శివసేన పార్టీ అయితే, భారత దేశంలోని సినిమాల్లోనూ, టి.వి. సీరియల్సులోనూ పనిచేస్తున్న పాకిస్తానీ నటులను వెంటనే, వెనక్కు పంపించివేయాలని తమ పార్లమెంటు సభ్యుడైన సంజైరావత్ చేత ప్రకటన చేయించింది.

'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' లాంటి, జాతీయ ఆంగ్ల దిన పత్రికలైతే, "ఇక ఆ పొగరుబోతు ఎద్దును (పాకిస్థాన్‌ను), కొమ్ములుపట్టుకు వంచాల్సిన సమయం ఆసన్నమైంది. పాకిస్థాన్‌ను ఒంటరి చేయటానికి, ప్రపంచమంతటా న్యూఢిల్లీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలి! ప్రస్తుతం పాకిస్తాన్‌ను ప్రసన్నం చేసుకోవటానికి అవలంబిస్తున్న విధానాన్ని ఎట్టి పరిస్థితిల్లో కొనసాగించరాదు. భారతదేశం పాకిస్థాన్‌తో వ్యాపార, వాణిజ్య సంబంధాలను తగ్గించేయాలి. పాకిస్థాన్ ఆటగాళ్ళకూ, కళాకారులకూ యిచ్చిన గ్రూపువీసాలను రద్దుచేయాలి. పాకిస్థాన్ తన పద్ధతులను మార్చుకొనేవరకూ, దానితో ఎటువంటి సంభాషణలనూ జరపరాదు" అంటూ జాతీయ దురహంకార పూరితమయిన, పాకిస్థాన్‌పై విద్వేషాన్ని రెచ్చగొట్టే సంపాదకీయాన్ని మే 3న ప్రచురించింది. ఇదే తరహాలో మీడియా అంతా స్పందించింది.

సరబ్‌జిత్ అంత్యక్రియలకు పంజాబ్ ముఖ్యమంత్రితోపాటు, అతడి మంత్రివర్గ సహచరు లందరూ హాజరయ్యారు. రాహుల్‌గాంధీ, విదేశాంగ సహాయమంత్రి ప్రణీత్‌కౌర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలు ఆగ్రహంతో పాకిస్తాన్‌కూ, ఆ దేశ నాయకులకూ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. త్రివర్ణ పతాకం కప్పిన సరబ్‌జిత్ మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. ఈరకంగా సరబ్‌జిత్ ఒక జాతీయ మృతవీరుడయిపోయాడు. నిరసన తెల్పిన ప్రజలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలివ్వటం తోపాటు, పాకిస్తాన్ దేశంయొక్క జెండాలను కూడా తగులబెట్టారు.

మనదేశంలోని జైళ్ళలో ప్రతీకారదాడులు జరుగకుండా కట్టుదిట్టంచేసినట్టు, కేంద్రప్రభుత్వమూ, వివిధ రాష్ట్రప్రభుత్వాలూ 'ఘనంగా' మీడియాలో ప్రకటించాయి.

తీరాచూస్తే, వారం తిరక్కుండానే జమ్ములాల్‌లోని కోట్ భర్వాల్ జైల్లోవున్న పాకిస్తానీ ఖైదీ అయిన సోనుల్లాఖాన్‌పై, తోటి ఖైదీ, సరిగ్గా పాకిస్థాన్ జైలులో సరబ్‌జిత్‌సింగ్ పైన జరిపినట్టుగానే అమానుషంగా దాడి జరిపాడు. చండీఘడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూండగా అతడూ మరణించాడు. అతడ్ని సరయిన వైద్యం కోసం మరో దేశానికి– గతంలో భారతప్రభుత్వం పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరినట్లుగానే – పంపించమని పాక్ ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని కోరింది. సరిగ్గా పాకిస్థాన్ చెప్పిన సాకులనూ, చట్టపరమైన నిబంధనలనూ ఉటంకిస్తూ, ఆ పాక్ ఖైదీని బయటకు పంపటానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. సోనుల్లాఖాన్ కూడా మరణించాడు. సరబ్‌జిత్‌సింగ్ కుటుంబ సభ్యులు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని నిందించినట్లుగానే, భారత ప్రభుత్వాన్ని మానవత్వం లేని ప్రభుత్వం, దేశం అంటూ, నిందించి సోనుల్లాఖాన్ కుటుంబసభ్యులు కన్నీరు కార్చారు. ఆక్రోశాన్ని వ్యక్తంచేశారు.

సోనుల్లాఖాన్‌పై జరిగినది ప్రతీకార దాడనేది నిర్వివాదం!

కనుక, ఇటు భారత పాలకులూ, అటు పాకిస్థాన్ పాలకులూ, యిరుదేశాలలోని పాలకవర్గ పార్టీలూ పరస్పరంగా రెచ్చగొట్టిన జాతీయ దురహంకారం, జాతీయ విద్వేషాల ఫలితాలయొక్క పరాకాష్టగా ఈ రెండు సంఘటనలూ ప్రపంచ చరిత్రలో నమోదవుతాయి. అంతేగాక యిరుదేశాల పాలకులూ, పాలకవర్గాలూ, ప్రభుత్వాలూ మానవత్వంలేని, దోపిడీ వర్గాలన్న విషయాన్ని ఈ ఘటనలు యిరుదేశాల ప్రజలకూ ప్రముఖంగా, స్పష్టంగా మరోమారు వెల్లడిచేశాయి.

కనుక, చిత్తశుద్ధి కలిగిన దేశభక్తులూ, చైతన్య వంతమయిన యిరుదేశాల ప్రజలూ–పాలకవర్గాలు, పాలకులూ ప్రేరేపించే జాతివిద్వేషాలకూ, జాతీయ దురహంకారాలకూ లోనుకాకుండా అప్రమత్తంగా వుంటూ, తమతమ ప్రజల ఆకాంక్షలకూ, ఉమ్మడి ప్రజాప్రయోజనాలకూ అనుగుణంగా ఐక్యంగా చైతన్యవంతులుకావాల్సిన తక్షణ కర్తవ్యం గురించి ఈ రెండు ఘటనలూ బోధపరుస్తున్నాయి. ✡




అణచబడ్డ దళితులంతా తిరగబడండి

పేజీలు : 144

వెల : రు. 50/-

కాపీలకు :

మైత్రీబుక్‌హౌస్

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# ‘పెట్టుబడి’ పాలనను అంతమొందించేందుకు పోరాడమనేదే మేడే పిలుపు

**అమెరికాలోని** చికాగో నగరంలో 1886 మే సంఘటనలతో స్ఫూర్తినొంది పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తమ డిమాండ్స్ సాధనకోసం పోరాడేందుకు ప్రపంచ వ్యాపితంగా కార్మికవర్గం అంతర్జాతీయ కార్మికవర్గ దీక్షాదినం ‘మేడే’ను నిర్వహిస్తూవస్తున్నారు. తమ పరిస్థితిని సమీక్షించుకోవటానికి వారికి ఇది ఒక సరైన సందర్భం. ప్రపంచవ్యాపితంగా ఆర్థికాభివృద్ధిని సాధించటంతోపాటు ప్రపంచ ప్రజల జీవన ప్రమాణం పెంచుతామని, పెట్టుబడిదారీ వ్యవస్థే అత్యంత మెరుగైన వ్యవస్థ అనీ, దీనికి ప్రత్యామ్నాయం లేదనీ బలంగా ప్రకటించుకుంటున్న, పెట్టుబడిదారీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు నిర్దేశిస్తున్న, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగపు ప్రస్తుత కాలంలో తమ పరిస్థితుల గరించిన ఈ సమీక్ష కార్మికవర్గానికి చాలా అవసరమైనది.

## అంతులేకుండా పెరుగుతోన్న పేదరికం, అసమానతలు

ప్రపంచబ్యాంకు ఇటీవలికాలంలో–2013 ఏప్రిల్‌లో –విడుదల చేసిన నివేదిక ప్రకారం, 120 కోట్ల మంది ప్రజానీకం నికృష్ట దారిద్ర్యంలో వున్నారు. ప్రపంచంలోని ఐదోవంతు జనాభా దారిద్ర్య రేఖకు దిగువన వున్నారు. మూడు దశాబ్దాలక్రితం, 20 కోట్ల 50 లక్షలమంది పేదలు ఆఫ్రికాలోని సబ్‌సహారా ప్రాంతంలో వుండగా, ఈనాటికి వారిసంఖ్య రెట్టింపుకంటే అధికంగా 41 కోట్ల 40 లక్షలకు పెరిగింది. ఈ విధంగా ప్రపంచ వ్యాపితంగా అభివృద్ధిచెందని, అభివృద్ధిచెందుతున్న దేశాల్లోనేగాక, అభివృద్ధిచెందిన దేశాలలోనూ పేదరికమనేది ఒక దావానలంలా విస్తరిస్తున్నది. ప్రజల జీవన ప్రమాణాలన్నీ క్రమంగా పడిపోతున్నాయి. 16 శాతం పైగా ప్రపంచ ప్రజానీకం పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోట్లాదిమంది ప్రజలు మురికివాడలో నివసిస్తున్నారు. ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల ధరల నిరంతరాయ పెరుగుదలతో ప్రజలకు ఆహారం లభించటమే దుర్లభమై ఆకలితో అల్లాడుతున్నారు. అసమానతలు తీవ్రస్థాయికి చేరాయి.

## పెరుగుతోన్న నిరుద్యోగం

ఐఎంఎఫ్ అంచనా ప్రకారం, ప్రపంచ వ్యాపితంగా ఇప్పటికే 20 కోట్లమంది పైగా ప్రజలు నిరుద్యోగులుగా వుండగా, ప్రతి సంవత్సరం కోట్లాదిమంది నిరుద్యోగులు ఈ సంఖ్యకు తోడవుతున్నారు. 90 కోట్లమంది ప్రజానీకం పేదరికంలోకి విసిరివేయబడటానికి సిద్ధంగా వున్నారు. నిరుద్యోగ యువత 7 కోట్ల 38 లక్షలుండగా, వారిలో నాలుగో వంతు నిరుద్యోగులు అభివృద్ధిచెందిన దేశాలకు చెందినవారే.

అమెరికా, జపాన్‌వంటి అభివృద్ధిచెందిన దేశాలలో కూడా నిరుద్యోగం రోజురోజుకీ పెరుగుతోంది. ప్రస్తుత కాలపు నిరుద్యోగం దాదాపు 8.2 శాతంగా వుందని అంచనా. గూగుల్, హెచ్.పి., సిటిగ్రూప్, ఎఎమ్ఆర్ కార్పోరేషన్, పెప్సీకో, మెట్‌లైఫ్, జె.సి.పెమి అండ్‌కో, పి అండ్ జి, మోర్గాన్ స్టాన్‌లీ మొదలైన కార్పొరేటు కంపెనీలు విచక్షణా రహితంగా ఇటీవల ప్రకటించిన లేఆఫ్‌లతో, ఉద్యోగాల కోతలతో అమెరికాలో నిరుద్యోగ శాతం స్థిరంగా పెరుగుతోంది. మరోవైపున బడ్జెట్‌లో కోతలతో, ప్రభుత్వ ఉద్యోగ కల్పనశాతం తగ్గిపోతోంది. అమెరికా ప్రభుత్వం ఒక పద్ధతిగా నిరుద్యోగభృతిని లేదా ఇతర సదుపాయాలను కుదిస్తూ రావటం పేదరికాన్ని మరింతగా పెంచుతోంది. యంత్ర తయారీ రంగంలోను, ప్రభుత్వ రంగంలోను ఉద్యోగాల కోతలు సర్వసాధారణ మయ్యాయి. అమెరికా నిరుద్యోగులలో అత్యధికులు 17–25 సం॥ల మధ్యవారే. యూరోపియన్ యూనియన్ దేశాలలో ముఖ్యంగా దక్షిణ ఐరోపా దేశాలలో నిరుద్యోగశాతం అసాధరణంగా పెరుగుతోంది. జర్మనీ, ఫ్రాన్సు మొదలైన దేశాలలో పరిశ్రమల మూసివేత, ఈ దేశాలలో పెరుగుతోన్న నిరుద్యోగానికి ఒక కారణంగా వుంది. స్పెయిన్‌లో నిరుద్యోగ శాతం 25 కు పెరిగింది. పోర్చుగల్, హంగేరి, గ్రీసులలో నిరుద్యోగం దాదాపు 26.8 శాతానికి చేరుకొంది. ప్రతి నెలా యూరోపియన్ యూనియన్ దేశాలలో 88వేల మంది నిరుద్యోగులుగా మారుతున్నారు. ఈ దేశాలలో కోటిమంది పైగా నిరుద్యోగులున్నారు. గత ఆరునెలలుగా ఈ దేశాలలో 10 లక్షలమందిని ఉద్యోగాలనుండి తొలగించారు. ఇంగ్లాండులో 35 లక్షలమంది నిరుద్యోగులుగా వుండగా, జర్మనీ, ఫ్రాన్సులలో పరిస్థితీ అదేవిధంగా వుంది.

ఆస్ట్రేలియాలో కూడా ప్రభుత్వ విభాగాలలో ఉద్యోగాలలో కోతలు విధించారు. ఉద్యోగులపై నిర్బంధ పదవీ విరమణను రుద్దారు.

అభివృద్ధిచెందుతోన్న, అభివృద్ధిచెందని దేశాలలో నిరుద్యోగ శాతం మరింత దారుణంగా వుండి, కార్మికులను నికృష్ట దారిద్ర్యంలోకి పడదోస్తోంది.

## వేతనాలు, సదుపాయాలలో కోతలు

ఉత్పాదకత 200 శాతం పెరిగినప్పటికీ, కార్మికుల వేతనాలు మాత్రం పెరగకపోగా వేతనాలలో కోతలు, పెన్షన్లలో కోతలు, వైద్య సదుపాయాలలో కోతలవంటి చర్యలతో అపరిమితంగా తగ్గించివేయబడుతున్నాయి. కనీస వేతనాలు గత కొద్ది దశాబ్దాలకాలం నాటికంటే చాలా తక్కువ శాతంగా వున్నాయి.

అమెరికాలో కార్పొరేటు కంపెనీల సిఇఓలు అసాధారణ జీతాలు, ఆదాయాలతో భోగాలను అనుభవిస్తూవుండగా, పారిశ్రామిక కార్మికుల నిజవేతన విలువ రోజురోజుకీ దిగజారిపోతున్నది. అమెరికాలో ప్రస్తుతం ఒక గంట సమయపు కనీస వేతనం 7.26 డాలర్లుగా వుంది. ఇది 1960ల నాటికంటే చాలా తక్కువ. గత నాలుగు దశాబ్దాల ద్రవ్యోల్బణంతో పోల్చితే, ప్రస్తుత కనీస వేతన నిజవిలువ మరింత తక్కువగా వుంది. డెట్రాయిట్ త్రయంగా పిలవబడే ఫోర్డ్, జనరల్ మోటార్స్, క్రిస్లెల్ ఈ మూడు పరిశ్రమలు యునైటెడ్ ఆటో వర్కర్స్ (యుఏడబ్ల్యు)తో వేతన ఒప్పందం చేసుకున్నాయి. దీనిప్రకారం కొత్తగా చేర్చుకున్న కార్మికులకు దీర్ఘకాలంగా పనిచేస్తోన్న కార్మికుల వేతనంలో 50శాతం మాత్రమే చెల్లించబడుతుంది. అమెరికాలో వేతన చెల్లింపు పరిస్థితి ఈ విధంగా వుంది. మహిళా కార్మికులకు మరియు నల్లజాతికి, హిస్పానిక్ జాతులకు చెందిన కార్మికులకు, మెక్సికోనుండి, ఇతర దేశాలనుండి వచ్చిన వలస కార్మికులకు, శ్వేతజాతి అమెరికా కార్మికులకు చెల్లించే వేతనంకంటే ఇప్పటికీ తక్కువగా చెల్లించబడుతోంది.

స్పెయిన్, గ్రీసు, హంగేరీలవంటి యూరోపియన్ యూనియన్ దేశాలలో పొదుపు చర్యల పేరిట 30–35–40 శాతం వేతనాలలో కోతలు విధించారు. పెన్షన్లు, వైద్య రక్షణలలో కోతలు విధించారు. యూరోపియన్ యూనియన్ దేశాలు సామాజిక పరిరక్షణ నినాదంతో వేతనాలలో కోతలు, పదవీ విరమణా నంతర సదుపాయాలలో, వైద్య సేవలలో కోతలు విధిస్తున్నాయి.

ఈ విధంగా ఉద్యోగాలలో కోతలు, సదుపాయాలలో కోతలు, వేతనాలలో కోతలతో కార్మికుల కొనుగోలుశక్తి నానాటికీ క్షీణిస్తూ, వారు కనీసం ఇంటి అద్దెలు, సంబంధిత బిల్లులను చెల్లించలేని స్థితిలోకి నెట్టబడుతున్నారు. తద్వారా రోజురోజుకీ అనేకమంది కార్మికులు తమ నివాస సౌకర్యం కోల్పోతున్నారు. వారంతా బికారులుగా దిగజార్చబడుతున్నారు. అమెరికాలో నిరుద్యోగులైన కార్మికులపై ఔషధ ప్రయోగాలు జరుపుతున్నారు. పేదవారి పిల్లలు వారి తల్లిదండ్రులనుండి వేరుచేయబడుతున్నారు. గృహ వసతిలేని వారికి ఏర్పరచిన శిబిరాలు కిక్కిరిసిపోతున్నాయి. నిరుద్యోగ భృతి, సదుపాయాలకోసం పెద్దసంఖ్యలో నిరుద్యోగులైన కార్మికులు దరఖాస్తు చేసుకుంటున్నారు. యూరోపియన్ యూనియన్ దేశాలలో–ప్రత్యేకించి స్పెయిన్, గ్రీసులలో కార్మికులు– తమ నివాస గృహాలకు అద్దె బకాయిలు చెల్లించలేక పోయినందుకుగానూ చట్టపరమైన చర్యలతో వారిని ఆయా ఇళ్ళనుండి ఖాళీచేయిస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆత్మహత్యలు పెరిగాయి. ఇంగ్లాండులో నిరుద్యోగులైనవారు అనేకమంది మాదకద్రవ్యాల వ్యసనాలకు బానిసలై మృత్యువాతపడుతున్నారు.

తమ సూపర్ లాభాలకోసం బహుళజాతి కంపెనీలు చైనాలో అత్యంత క్రూరంగా శ్రమదోపిడీ సాగిస్తున్నాయి. కార్మికులకు నెలల తరబడి చెల్లించాల్సిన, చెల్లించ బడకుండా వున్న వేతన బకాయిలు పేరుకుపోవటం, చైనాలో ఒక సాధారణ విషయంగా వుంది. తత్ఫలితంగా కార్మికులు తీవ్ర నిస్పృహకు గురై, తరచుగా తమ యాజమాన్య దొంతరలపై దాడులకు పాల్పడుతున్నారు.

## తీవ్రంగా పెరుగుతోన్న పనిభారం

ఉత్పాదకతను పెంచే పేరున, మార్కెట్టులో పోటీని తట్టుకునేందుకు ధరలను తగ్గించే పేరున, యాజమాన్యాలు కార్మికులపై పని టార్గెట్లు, ఉత్పత్తి టార్గెట్లు పేరుతో మరింతగా, మరింతగా పనిభారాన్ని మోపుతున్నారు. దీనికి రెండు పద్ధతులను అనుసరిస్తున్నారు. 8 గంటల పనిదినంలోనే ఉత్పత్తి టార్గెట్లను పెంచటం ఒక పద్ధతికాగా, అధిక వేతనం చెల్లించకుండానే బలవంతంగా కార్మికులచే 8 గంటల పనిదినాన్ని మించి రోజుకి 10–12 గంటలు పనిచేయించటమనేది రెండవ పద్ధతి. ఈ విధంగా యాజమాన్యవర్గం మేడే ప్రధాన నినాదమైన 8 గంటల పని దినమనే దాని సారాంశాన్నే డొల్లజేసేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తోంది.

## కార్మికుల పాలిట శాపంగా మారిన సాంకేతిక పురోభివృద్ధి

అత్యాధునిక సాంకేతిక పురోభివృద్ధి యుగంలో మనం జీవిస్తున్నామని, దీని ఫలితంగా ప్రపంచ ప్రజానీకపు సంక్షేమం మెరుగై, సంపదలు అభివృద్ధి చెందుతాయని పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క విశేష గుణాల గురించి దళారీ మేధావులు ప్రవచిస్తారు.

కానీ వాస్తవానికి పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం–పెట్టుబడిదారీ వర్గపు సూపర్‌లాభాల సముపార్జనా ప్రయోజనాలకు తోడ్పడుతూ, కార్మికుల పని పరిస్థితులను, కార్మికుల హుందాతనాన్ని మరింతగా దిగజారుస్తూ వారిని అమానవీకరిస్తోంది.

వాస్తవానికి, సాంకేతికాభివృద్ధి–కార్మికులయొక్క సాధారణ ప్రజానీకంయొక్క జీవన ప్రమాణాల పెంపుదలకు తోడ్పడాలి; పనిగంటల తగ్గింపుకు, నిరుద్యోగం తగ్గుదలకు, మరింతగా ఉద్యోగాల కల్పనకు తోడ్పడాలి; సాధారణ ప్రజానీకం, కార్మికులు ఆరోగ్యకర జీవనం సాగించటాన్ని సాధ్యం చేయాలి. కానీ పెట్టుబడిదారీ వర్గ యాజమాన్యంలో, సాంకేతిక పరిజ్ఞాన పురోభివృద్ధి కూడా సాధారణ ప్రజల, కార్మికుల జీవితాలలో కష్టాలు, పేదరికం మరింతగా వ్యాపించటానికే దోహదపడుతోంది. సాంకేతిక పురోభివృద్ధి ఉద్యోగాలలో కోతలకు, నిరుద్యోగానికి దోవ తీస్తోంది.

సాంకేతిక పురోభివృద్ధి కారణంగా 50 లక్షలనుండి కోటిమంది వరకూ ప్రతి ఏటా ఉద్యోగాలు కోల్పోతున్నారు. మర మనుషులను, యాంత్రీకరణను ఉపయోగించి వేతనాల ఖర్చులను తగ్గించుకొని, యాజమాన్య వర్గాలు తమ ఖర్చును తగ్గించుకుంటున్నాయి. చైనా వంటి దేశాలలో కూడా కారుచౌక మానవ శ్రమ – సూపర్ లాభాల సముపార్జనకు అందుబాటులో వుంది. ఉదాహరణకు–చైనాలోని గ్రేట్‌వాల్ మోటార్స్ ఫాక్టరీలో 50వేల మంది కార్మికులు పనిచేస్తుండేవారు. ఈ ఫ్యాక్టరీలో ‘ఓక్స్‌వాగన్’ మరియు ‘ఆడి’ మోటార్ కార్పోరేషన్‌కు చెందిన వాహనాలను తయారుచేస్తారు. వేతనాలలో పెరుగుదల, ముడిసరుకుల ఖర్చు పెరుగుదలలతో యాజమాన్యం తమ ఖర్చులను తగ్గించుకునేందుకు స్విట్జర్లాండుకు చెందిన రోబోలను ప్రవేశపెట్టేందుకు పథకాలను సిద్ధంచేసింది. నెదర్‌లాండ్స్ లోని ఫిలిప్స్ ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రానిక్ షేవర్స్‌ను అసెంబుల్ చేసే పనికి 128 రోబోలను వినియోగిస్తున్నారు. కాగా చైనాలోని జుహాయ్ ఫ్యాక్టరీలో ఇదే పనిని వందలాది మంది నైపుణ్యంగల కార్మికులు చేస్తున్నారు. నెదర్‌లాండ్స్ ఫ్యాక్టరీలో పదింట తొమ్మిది వంతుల పనిని యాంత్రీకరించారు.

అమెరికాలోని సి అండ్ ఎస్ హోల్‌సేల్ గ్రోసరీస్ అనే అమెరికాలోని అతిపెద్ద ఆహార పదార్థాల పంపిణీ సంస్థ తమ వేతనాల ఖర్చు తగ్గించుకునేందుకు రోబో యంత్ర సాంకేతికతను ఉపయోగిస్తోంది.

కాలిఫోర్నియాలోని ‘ఎర్త్ బౌండ్ ఫార్మ్స్’, షిప్పింగ్ బాక్సులలో సేంద్రియ పదార్థాలనుంచటానికి రోబోలను ఉపయోగిస్తోంది.

యాపిల్ కంపెనీకి ఐ–పాడ్స్, ఐ–ఫోన్స్ తయారు చేసి అందజేసే సంస్థఅయిన చైనాలోని ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలోనూ, తమ భారీ ఫ్యాక్టరీలన్నింటిలోనూ కార్మికుల సమస్యలనుండి తప్పించుకోవటానికి; కార్మికుల వేతనాలకు చెల్లించే ఖర్చును తగ్గించుకునేందుకు రోబోలను ఉపయోగించటానికి సంసిద్ధంగా వుంది.

చైనాలోని అనేక పరిశ్రమలు వెల్డింగ్, పెయింటింగ్, ప్యాకింగ్ తదితర పనులు చేయవలసిన స్థానాలలో కార్మికులకు బదులుగా రోబోలను ఉపయోగిస్తున్నాయి. చైనాలోని 3 వేలపైగా రెస్టారెంట్లలో చెఫ్‌ల, వెయిటర్‌ల ఉద్యోగాలలో రోబోలనుపయోగిస్తున్నారు.

ఈ విధంగా–మార్క్స్ ఏనాడో హెచ్చరించినట్లుగా –పెట్టుబడిదారీ పాలనలో సాంకేతిక పురోభివృద్ధి, నిరంతరం కార్మికుల స్థితిగతులను మరింతగా దిగజార్చేందుకు ఒక వనరుగా తోడ్పడుతోంది.

## నికృష్ట శ్రమదోపిడీకి గురౌతున్న బాల కార్మికులు

తన సూపర్ లాభాల సాధనకోసం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలాంటి జాలీ, దయాలేకుండా బాలకార్మికుల శ్రమను ఘోరంగా దోపిడీ చేస్తోంది. ఐఎల్ఓ అంచనా ప్రకారం, ప్రపంచవ్యాపితంగా 22 కోట్ల మంది బాల కార్మికులున్నారు. వీరిలో అత్యధికులు అత్యంత ప్రమాదకర పరిశ్రమలలో, దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. యాపిల్‌వంటి దిగ్గజ పరిశ్రమలకు తయారీదారులుగా వున్న చైనాలోని ఫాక్స్‌కాన్‌వంటి పరిశ్రమ సైతం బాలకార్మికులనుపయోగిస్తోంది. ‘నెస్లే ఇండియా’కు సరఫరాదారులైన పరిశ్రమలు కూడా బాలకార్మికుల శ్రమను ఉపయోగిస్తున్నాయి. 11 కోట్ల 50 లక్షలమందికి పైగా బాలలు పరిశ్రమల్లో అత్యంత ప్రమాదకర పనులు చేస్తున్నారు. దీనికి బాలికలేమీ మినహాయింపుగా లేరు; షుమారు 4 కోట్ల పది లక్షలమంది బాలికలు ఈ విధమైన ప్రమాదకర పనులలో వున్నారు.

## ఘోరమైన దోపిడీకి గురౌతున్న మహిళా కార్మికులు

ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో మహిళా కార్మికులు అత్యంత దోపిడీకి గురిచేయబడుతున్నారు. పురుష కార్మికులతో పోలిస్తే మహిళా కార్మికులకు సమాన ఉపాధి అవకాశాలు లేవు. వారికున్న అవకాశాలు చాలా పరిమితం. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, సమానత్వంవంటి వాటి గురించి బడాయిగా మాట్లాడే అమెరికాలో సైతం, మహిళా కార్మికులు వివక్షకు గురౌతున్నారు. ఒకేరకపు పనికి పురుష కార్మికులకంటే మహిళా కార్మికులకు తక్కువ వేతనమిస్తున్నారు. ఒకే రకపు పనికి పురుష కార్మికునికి ఒక డాలర్ చెల్లిస్తే, మహిళా కార్మికురాలికి 75 సెంట్లు మాత్రమే చెల్లించబడుతోంది.

అమెరికాలోని విశ్రాంత కార్మికులలోని ప్రతి పదిమందిలోనూ 8 మందికి పెన్షను సదుపాయంలేదు. అమెరికాలోని 50శాతం మంది మహిళా విశ్రాంత కార్మికులకు, విశ్రాంత పురుష కార్మికులతో పోలిస్తే కేవలం 60శాతం పెన్షను మాత్రమే పొందుతున్నారు. 2006లో ‘అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్’ యొక్క అంచనాప్రకారం, ఒక్కో అమెరికా కార్మిక మహిళ తన జీవిత కాలంలో 5,23,000 డాలర్లను కోల్పోతోంది. మహిళా కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించటంద్వారా ఇంతేసి మొత్తాలను యాజమాన్యాలు మిగుల్చుకుంటున్నాయి. ఒక పురుష కార్మికునితో సమాన స్థాయిలో సమాన పనిచేసే ఒక్కో మహిళా కార్మికురాలికి ప్రతి సంవత్సరం 10,784 డాలర్లు తక్కువగా చెల్లించబడుతోంది. ఇదే ఆఫ్రో–అమెరికన్ లేదా లాటిన్ అమెరికన్ దేశాలకు చెందిన మహిళా కార్మికులైతే, 19,575 డాలర్లనుండి 23,873 డాలర్ల వరకు పురుష కార్మికులతో పోలిస్తే తక్కువ వేతనాలు చెల్లించబడుతోన్నాయి. పూర్తికాలపు మహిళా కార్మికులకు, తమ తోటి పురుష కార్మికులకంటే 23 శాతం తక్కువ వేతనం చెల్లించబడుతోంది.

బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా, నికరాగువా, స్విట్జర్లాండు వంటి దేశాలలో వాల్‌మార్ట్, క్యారీఫోర్, యాపిల్‌వంటి బహుళజాతి కంపెనీలకు వాటి ఉత్పత్తుల సరఫరాదారులైన పరిశ్రమలున్నాయి. వీటిలో కార్మికులకు కనీస వేతనాన్ని, వైద్య రక్షణలను నిరాకరిస్తూ ఎలాంటి పరిహార చెల్లింపులూ లేకుండానే కార్మికులచే నిర్బంధంగా పనిచేయించుకుంటున్నారు.

ఆడిదాస్, రీబాక్, నైక్, ప్యూమావంటి ప్రముఖ పరిశ్రమలన్నింటికీ ఆటవస్తువులను సరఫరాచేసే పరిశ్రమలలో కార్మికులకు 7 రోజుల పనివారం; 16–18 గంటల పనిదినం అమలవుతున్నాయి. మహిళా కార్మికులు లైంగిక వేధింపులకు గురౌతూ, ఏ విధమైన చెల్లింపూ లేకుండా నిర్బంధ ఓవర్‌టైమ్ చేయవలసిన దుస్థితిలో వున్నారు.

బంగ్లాదేశ్, వియత్నాం, ఇండియా, శ్రీలంక, పాకిస్థాన్, ఈజిప్టు వంటి దేశాల్లోని దుస్తుల తయారీ పరిశ్రమలలో 14–25 సం॥లున్న మహిళా కార్మికులు నిర్దాక్షిణ్యంగా దోపిడీకి గురౌతున్నారు. తక్కువ వేతనాలు, వేతన బకాయిలు, ఎక్కువ పనిగంటలు, ఎలాంటి వేతనంలేని బలవంతపు ఓవర్‌టైమ్; పనిప్రదేశాల్లో వేధింపులు; లైంగిక వేధింపులు వంటివన్నీ ఈ బాలికలపై ప్రయోగిస్తున్నారు. ప్రత్యేక ఆర్థికమండళ్ళు, ప్రత్యేక ఎగుమతి మండళ్ళలో మహిళా కార్మికుల స్థితి భయంకరంగా వుంది. యూరోపియన్ యూనియన్ దేశాలలో విధించిన పొదుపు చర్యల ప్రభావం, ఆయా దేశాలలోని మహిళా కార్మికులపై చాలా తీవ్ర ప్రభావాన్ని పడవేస్తోంది.

## కార్మికుల హక్కులపై తీవ్రమౌతోన్న దాడులు

ప్రపంచవ్యాపితంగా కార్మికులు ‘పెట్టుబడి’పై తమ సాహసోపేతమైన, తీవ్రమైన పోరాటాలు సాగించటం ద్వారా, అమూల్యమైన త్యాగాలద్వారా అనేక హక్కులు సాధించుకోవటంతోపాటు, వాటికి అనేక చట్టపరమైన రక్షణలను కూడా సాధించుకున్నారు. కాగా, కార్మికుల ఈ హక్కులపై ఈనాడు తీవ్రమైన దాడి జరుగుతోంది.

కార్మికుల హక్కులపై దాడులు నిత్యకృత్య మయ్యాయి. యూరోపియన్ యూనియన్ దేశాలలో 15 శాతం వేతన కోతలను విధించారు. పనిగంటలను పెంచారు. పెన్షను, ఆరోగ్య సదుపాయాలు, పదవీ విరమణానంతర సదుపాయాలను కుదించివేశారు.

పెరూ, గ్వాటిమాలా వంటి మధ్య అమెరికా దేశాలలో కార్మికులు ఒక యూనియన్‌గా సంఘటిత మవడమే అసాధ్యంగా పరిణమించింది. కార్మిక నాయకులు హత్యకు గురౌతున్నారు. కార్మిక చట్టాలను సంస్కరించే పేరున, అనేక ఆసియా దేశాలలో కార్మిక హక్కులకున్న చట్టపరమైన రక్షణలన్నీ కాలరాచి వేయబడు తున్నాయి. ఏవిధమైన రక్షణలూలేని, కార్మికుల కాంట్రాక్టీకరణ పెరిగిపోతోంది.

## కార్మికుల భద్రతపట్ల చిన్నచూపు

శ్రమదోపిడీని తీవ్రం చేయటంద్వారా, తన సూపర్‌లాభార్జనా వేటసాగిస్తున్న పెట్టుబడిదారీవ్యవస్థ, ఉద్దేశ్యపూర్వకంగానే కార్మికుల పనిప్రదేశ భద్రతపట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తోంది. పనిప్రదేశంలో కార్మికుల ప్రమాదాలు, వారి మరణాలు అనేవి చాలా సాధారణాంశంగా మారిపోయాయి. లోహపరిశ్రమ, గనుల విభాగాలలో పనిప్రదేశ ప్రమాదాలు మరింత ఎక్కువగా వున్నాయి. ప్రతి గంటకూ ముగ్గురు కార్మికులు 'హత్య' గావింపబడుతున్నారు. ఈ విభాగాలలో ప్రతి సం॥రం 2000పైగా పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనితోపాటుగా, రసాయన మరియు ప్రమాదకర పరిశ్రమలలో పనిచేసే వారిలో అధికశాతం కార్మికులు పని సంబంధ వ్యాధులతో 'హత్య' చేయబడుతున్నారు.

చైనాలో బొగ్గుగనుల ప్రమాదాలలో పెద్దసంఖ్యలో కార్మికులు మరణించటమనేది, ఆ దేశంలో ఒక రోజువారీ వ్యవహారమైంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో దుస్తుల పరిశ్రమలలో, అగ్నిప్రమాదాలవంటి వాటిల్లో, పైకప్పులు కూలిపోవటంవంటి ఘటనల్లో వందలాది మంది కార్మికులు మరణించగా, వేలాదిమంది కార్మికులు గాయాలపాలవుతుండటం సర్వసాధారణమైన వ్యవహరంగా మారింది.

## వలస కార్మికుల దయనీయ పరిస్థితులు

ఇతర దేశాలకు కాందిశీకులుగా జీవనోపాధికోసం వలసలువెళ్ళే వారు-ఊపిరందక, తీవ్ర ఆకలి, తీవ్ర నీటికొరతవంటి సమస్యలతో అత్యంత విషాద సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఉద్యోగాన్వేషణకై కిక్కిరిసిన కాందిశీకులతో కూడిన పడవలు మధ్యధరా సముద్రంలో మునిగిపోగా, మరణాల సంఖ్య పెరుగుతోంది. వందలాదిమంది ఉద్యోగాన్వేషకులైన వలస కార్మికులు ఈ విధమైన దుర్మరణాలకు గురికావటమనేది, వారి దుస్థితికి అద్దంపడుతోంది. కువాయిట్, ఖతార్, సౌదీఅరేబియా, యు.ఏ.ఆర్. తదితర గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల కష్టాలకు అంతులేకుండా వుంది. మహిళా కార్మికులు లైంగిక దాడులకు గురౌతున్నారు. తమ బాధలు భరించలేని అనేకమంది మహిళా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ గల్ఫ్ దేశాలలోని చాలామంది కార్మికులకు సరైన ఆధార పత్రాలు లేవనే పేరుతో ఖైదు చేయబడుతున్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలలో సైతం, సరైన ఆధార పత్రాలులేని కార్మికులు ఘోరమైన వివక్షకు గురిచేయబడుతూవున్నారు. 1 కోటి పదిలక్షలమంది చట్టవిరుద్ధ వలస కార్మికులు అమెరికాలో వున్నారనేది ఒక అంచనా. వీరి శ్రమ కారుచౌకగా, నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేయబడుతోంది. ఈ చట్టవిరుద్ధ వలస కార్మికులలో 2,60,000 మంది భారత వలస కార్మికులు వున్నారు.

ప్రపంచ వ్యాపితంగా కార్మికుల దుస్థితి ఇలా వుండగా కార్పొరేటు దిగ్గజాలు-తమ నుండి కార్మికులు పొందే మన్ననల గురించి, సదుపాయాల గురించి ఎంతో గొప్పగా మాట్లాడుతుంటారు.

ఇటీవలి అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ఫ్లోరిడాలోని వెస్ట్‌గేట్ రిసార్ట్స్ సిఇఓ డేవిడ్ సైగల్, ఒబామా ఎన్నికైతే అందరినీ ఉద్యోగాలనుండి తీసేస్తాయని ఒక ఇ-మెయిల్ ద్వారా బహిరంగంగా అక్కడ పనిచేసే 8వేలమంది కార్మికులను, ఉద్యోగులను బెదిరించాడు.

ఫుకిషిమా అణువిద్యుత్తు కేంద్రం వద్ద పనిసాగిస్తున్న ఒక సబ్‌కాంట్రాక్టు కంపెనీ యాజమాన్యం-సునామీ, ఆపై భూకంపం కారణంగా అణువిద్యుత్తు కేంద్రంనుండి వెలువడిన అణుధార్మికతను తొలగించి ఆ పరిసరాలను శుభ్రపరిచే పనిని చేపట్టింది. అయితే, అక్కడ బయల్పడిన అణుధార్మికత ప్రమాద స్థాయిల గురించి కార్మికులెవ్వరూ మాట్లాడరాదని ఆంక్షలు విధించింది. అణుధార్మికత బయల్పడిన స్థాయిలను గుర్తించే పరికరాలను మూసివేసి, అతి తక్కువ అణుధార్మికత స్థాయిలను సూచింప జేయాలని కూడా ఆ యాజమాన్యం కార్మికులను ఆదేశించింది.

2013 ఏప్రిల్ 9న జనరల్ మోటర్స్ కంపెనీ యాజమాన్యం సంవత్సరాంతంలో కార్మికుల యూనియన్‌తో జరిపే చర్చలు ఒక కొలిక్కి రాలేదనే సాకుతో తన కంపెనీ ఉత్పత్తి కార్యకలాపాలనన్నింటినీ దక్షిణ కొరియానుండి ఉత్తర కొరియాకు బదిలీ చేస్తానని హెచ్చరించింది.

భారీ సూపర్ లాభాల్ని దండుకుంటున్న ఇంటర్నేషనల్ ఆటోమోటివ్ కాంపొనెంట్స్ యాజమాన్యం ఇంగ్లాండులోని తన కార్ల తయారీ పరిశ్రమలోని ఉద్యోగులందరికీ సాంప్రదాయం ప్రకారం 'బోనస్' ఇచ్చింది, ఇంతా చేస్తే అది తన ఉద్యోగులకు క్రిస్టమస్ బోనస్‌గా ఇచ్చింది-'బేకన్ శాండ్ విచ్' మాత్రమే!

2012 జులైలో భారత దేశంలోని ఒడిషా రాష్ట్రం-పరదీప్‌వద్ద చమురు శుద్ధిపరిశ్రమలోనికి ప్రవేశిస్తున్న కార్మికులపై సక్రమమైన అనుమతి పత్రాలు లేవనే కారణంతో సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది కాల్పులు జరపగా, అందులో ఏడుగురు కార్మికులకు తూటాల గాయాలయ్యాయి.

ఈ విధంగా ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ యాజమాన్యం బానిసల స్థాయికంటే కార్మికులను మరింతగా దిగజారుస్తోంది.

## మన దేశంలో కార్మికుల స్థితిగతులు

మన దేశంలో కార్మికుల స్థితిగతులు మరింత భయానకంగా వున్నాయి. ఇటీవలి ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం ప్రపంచంలోని అత్యంత నిరుపేదలలో మూడవ వంతు భారతదేశంలోనే వున్నారు. 2013 యుఎన్‌డిపి నివేదిక ప్రకారం, అది వివరాలు సేకరించిన 187 దేశాలకు సంబంధించిన మానవాభివృద్ధి సూచికలో మనదేశం 136వ స్థానంలో వుంది. పేదరికం, అసమానత్వం భారతదేశంలో రోజురోజుకీ పెరిగి పోతున్నాయి.

ఇటీవలి 'యూనిసెఫ్' అధ్యయనంలో ఆరుకోట్ల పదిలక్షల మంది భావి భారత పౌరులైన బాలలు ఎదుగుదల లేక గిడసబారి వున్నారని తెలిపింది. పౌష్టికాహార లోపమే వారు గిడసబారి పోవడానికి కారణం. పౌష్టికాహార లోపానికి పేదరికమే కారణంగా వుంది.

భారత దేశంలో ఉద్యోగితా శాతం అత్యంత దయనీయస్థితిలో వుంది. నిరుద్యోగం దావానలంలా వ్యాపిస్తోంది. మనదేశంలో అత్యధిక ప్రజానీకం రెక్కాడితేగాని డొక్కాడని స్థితిలో వున్నారు.

భారత పాలకులు మనదేశ ఆర్థికాభివృద్ధి గురించి ఎంత గొప్పగా ప్రకటించుకుంటున్నా, అది ఉద్యోగ కల్పనలో ఎలాంటి అభివృద్ధినీ తీసుకొని రాలేదు. ఉత్పత్తి రెట్టింపవుతుండగా, కార్మికుల సంఖ్య టాటాస్టీలు ప్లాంటులో లాగా సగానికి పైగా పడిపోతోంది. భారతదేశంలో అత్యధిక ప్రజానీకానికి వైద్య సౌకర్యానికి అవకాశంలేదు. కనీస వేతన రక్షణలేదు-పనిభద్రత, పని ప్రదేశంలో భద్రత, ప్రసూతి శలవులు, సదుపాయాలు వంటివేవీలేవు. ఉద్యోగ కల్పనా శాతం పడిపోతున్నది. ప్రతి సంవత్సరం 45 లక్షలనుండి 80 లక్షలమంది ప్రజలు పనికోసం ఎదురుచూస్తున్నారు. విద్యావంతులైన యువకులకు కూడా ఉద్యోగాలు లభించటంలేదు. పాఠశాల విద్య పూర్తిచేసుకున్న సాంకేతిక విద్యలో డిప్లొమా చేసిన వారిలో అత్యధికులు నిరుద్యోగులుగా వున్నారు. ఉద్యోగాల కల్పన తగ్గడం నిరుద్యోగాన్ని మరింతగా పెంచుతోంది. వ్యవసాయరంగంలో సంక్షోభ ఫలితంగా 1 కోటీ 50 లక్షలమంది ప్రతిఏటా ఉపాధి కోల్పోతున్నారు. తయారీ రంగంలో 35 లక్షల ఉద్యోగాలను కుదించారు.

భారత దేశంలోని మొత్తం ఉద్యోగులలో 48.6 శాతం స్వయం ఉపాధి రంగంలో వుండగా, 19.7శాతం వేతన కార్మికులుగానూ, 31.7 శాతం రోజుకూలీలుగాను వున్నారు.

ఈ రోజుకీ 52.9 శాతం, ప్రజలు వ్యవసాయం, అడవి, చేపలవేటలపై ఆధారపడివున్నారు. 19.3 శాతం ప్రజలు ఉత్పత్తి, తయారీ రంగాలలో ఉద్యోగాలు కలిగి వున్నారు. ఇక, భవననిర్మాణ రంగంతోసహా ఇతర సేవారంగాలన్నింటిలో కలిపి 27.8 శాతం మంది పనిచేస్తున్నారు.

ప్రజల సంక్షేమం అభివృద్ధికొరకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు నుండి ప్రభుత్వం వెనక్కు తగ్గటంతో నిరుద్యోగం పెరుగుతోంది.

వ్యవసాయరంగంలో గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణ ప్రాంతాలకు వలసలుపోతున్న ఒక కోటీ 50లక్షల మంది ఉత్పత్తి, తయారీ రంగాలలో ఉపాధి పొందలేకపోగా, అతితక్కువ రోజుకూలీకి నిర్మాణ రంగం వంటి వాటిల్లో పనిచేస్తున్నారు. సంఘటిత రంగంలో కూడా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ల పేరిట అనియత ఉద్యోగిత పెరుగుతోంది.

వ్యవసాయరంగంలోని అనియత కార్మికులు, అనియత వ్యవసాయేతర రంగంలో మాత్రమే పనిచేస్తున్నారు. ఈ ఉద్యోగాల కల్పనలన్నీ ఉద్యోగిత పెరుగుదలగా భావించలేము. సుమారుగా 27 లక్షల మంది నిరుద్యోగులు-వీరిలో తీవ్రంగా నష్టపోతున్న మహిళలు పెరుగుతున్నారు.

సంఘటిత రంగంలో కార్మికుల చట్టబద్ధ హక్కులన్నీ మొరటుగా తిరస్కరించబడుతున్నాయి.

నోయిడా, మానేసర్, శ్రీపెరంబదూర్, బెంగుళూరు మొదలగు చోట్ల పారిశ్రామిక మురికివాడలలో బహుళజాతి సంస్థలు-కార్మికులు యూనియన్‌గా సంఘటితపడటాన్ని సైతం నిర్దాక్షిణ్యంగా తిరస్కరిస్తున్నాయి. సుజికీ మానేసర్ ప్లాంటులోలాగా, యానాంలోని రీజెన్సీ సిరామిక్స్‌లో లాగా, తమిళనాడులోని మరికొన్ని చోట్లలాగా ఎవరైనా, కార్మికులు సంఘటితపడేందుకు ముందుకొస్తే క్రూరమైన పోలీసు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి.

ఏవిధమైన అధికవేతనం చెల్లించబడకుండానే కార్మికులు రోజుకు 10 నుండి 12 గంటలు బలవంతంగా శ్రమచేయించుకోబడుతున్నారు. కార్మికులు అత్యంత ప్రమాదకరమైన, రక్షణలులేని ప్రాంతాల్లో బలవంతంగా పనిచేస్తూ, తరచూ పారిశ్రామిక ప్రమాదాలకు గురౌతున్నారు. అనేకమంది చావులకు, తీవ్రగాయాలకు లోనవుతున్నారు. పరిశ్రమలలో బాలకార్మికుల శ్రమనుపయోగించటం పెరిగింది. మహిళా కార్మికులు చౌక కార్మికులుగా దోపిడీ చేయబడటమేగాక, నేటి అత్యాధునిక ఐటి మరియు బిపిఓ విభాగాల్లోనూ లైంగిక వేధింపులకు, దాడులకు లోనవుతున్నారు. వారి ప్రాణాలకు ఏవిధమైన రక్షణాలేదు. పురుష కార్మికులతో పాటుగా మహిళా కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వటంలేదు. కార్మికులు పొదుపు చేసుకున్న పిఎఫ్ ఇతర పెన్షను నిధులను సైతం అత్యధిక యాజమాన్యాలు దిగమింగుతున్నాయి. కార్మికులు దాచుకున్న పిఎఫ్ మరియు పెన్షను నిధులను షేరు మార్కెట్లో పెట్టుబడి పెట్టటానికి ప్రభుత్వం చట్టబద్ధ అనుమతినిచ్చి వేసింది. పిఎఫ్‌లోనూ, పెన్షను నిధులలోనూ కార్మికుల వాటాను పెంపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటూ, తిరిగి ఆ మొత్తాలను షేరు మార్కెట్లో పెట్టుబడులుగా చట్టా వ్యాపారానికి అనుమతించింది.

భారతదేశంలోని అత్యధిక కార్మికులు పౌష్టికాహార లోపంతో ఇల్లు లేక, విద్యలేక, ఆరోగ్య సౌకర్యాలులేక బాధపడుతున్నారు. వీరికి కనీస మంచినీటి సౌకర్యం కూడా ఉండటంలేదు.

అర్ధఫ్యూడల్ వ్యవస్థగానున్న మనదేశంలో ప్రజలపై నికృష్ట దోపిడీ, అణచివేతలు ముఖ్యంగా మనదేశంలో కార్మికులు కష్టజీవులపై అధికంగా వున్నాయి.

నేటికీ మానవ హుందాతనాన్ని దిగజార్చే అమానవీయమైన పాకీ పని అధికారిక ఆమోదంతో మనదేశంలో కొనసాగుతోంది. మనషులతో పాకీపని చేయించటంలో మనదేశంలో రైల్వేలు ప్రథమంగా వున్నాయి. ఇంకా సిగ్గులేకుండా రైల్వేట్రాక్‌లపై మలమూత్రాలను పాకీ వారితో శుభ్రంచేయించేందుకు తమను ఆమోదించాలని డిమాండ్ చేస్తోంది.

మేఘాలయాలో సాగుతున్న విధంగా ఎలుకల కలుగుల్లాంటి రంధ్రాలలో దూరి గనులు తొలచటమనేది మానవ శ్రమను-ముఖ్యంగా-బాలల శ్రమను ఎంతటి నికృష్టంగా దోపిడీ చేస్తున్నారనే దానికి ఒక ఉదాహరణగా వుంటుంది.

చట్టపరమైన జంకులేవీ లేకుండా కట్టుబానిస వ్యవస్థ నేటికీ కొనసాగుతోంది. వలస కార్మికులు తరచుగా కట్టుబానిసలుగా పనిచేస్తున్నారు. ఇటీవల ఒడిషా నుండి తీసుకురాబడి ఆంధ్రప్రదేశ్ ఇటుక బట్టీలలోనూ, ఆంధ్రప్రదేశ్ గ్రానైట్ పరిశ్రమలోనూ, పనిచేస్తున్న కార్మికులే దానికి ప్రత్యక్ష తార్కాణాలు. గ్రామీణ ప్రాంతాలలోని దళారీలు దళితులను, ఆదివాసులను ప్రలోభపరిచి మెరుగైన వేతనాలు ఇస్తామని పట్నాలకు తీసుకువచ్చి, వారిచే నిర్బంధ వెట్టిచాకిరీ చేయిస్తున్నారు.

దుస్తులు మరియు బట్టల పరిశ్రమలలో అమానవీయంగా సాగుతోన్న దోపిడీ ముఖ్యంగా పేర్కొనదగింది. ఈ పరిశ్రమకు చెందిన దళారులు అనేకమంది యువతులకు ఆశలు కల్పించి వారిని కట్టుబానిసలుగా ఆయా పరిశ్రమలో ఉపయోగిస్తున్నారు. ఆదివాసీ, దళిత యువతులు ఈ అమానవీయ, దారుణమైన దోపిడీ బాధితులుగా వున్నారు.

తమిళనాడులోని తిరుప్పూరులో 16-25 సం॥ల వయసుగల యువతులు-దుస్తుల, బట్టల పరిశ్రమ యాజమాన్యాలచే 'సుమంగళి' వంటి పథకాలతో ప్రలోభాలకు లోనై అర్ధ-కట్టుబానిసలుగా చాకిరీ చేయటానికి నెట్టబడ్డారు. వీరిలో అత్యధికులు దళితులు. వీరిచే బలవంతంగా అధికపని చేయిస్తున్నారు. ట్రేడ్ యూనియన్లుగా ఏర్పడేందుకు వీరిని అనుమతించలేదు. వీరంతా దూషణల రూపంలోనూ, లైంగిక వేధింపులతో సహా అన్నివిధాల భౌతిక వేధింపులకు గురౌతున్నారు.

చాల పెద్దఎత్తున ప్రచారం గావించుకుంటున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం - గ్రామీణ పేదలకు ఉపాధిని గ్యారంటీ చేయటంలో విఫలమై నిరుపయోగ మైనదిగా రుజువుచేసుకుంది. ఇక, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారమే, ఉపాధి కల్పిస్తున్న పని దినాలు 2009-10లో 54రోజుల నుండి 2011-12 నాటికి 43 రోజులకు పడిపోయాయి. సుదూర ప్రాంతాలకు పొట్టచేత బట్టుకొని గ్రామీణ పేదలు వలసపోకుండా ఆపటంలో ఈ పథకం విఫలమైందనేది నిరాకరించవీలులేని వాస్తవం.

ఈ విధమైన బాధమయమైన, విషాదకర, అమానవీయ, హేయమైన పరిస్థితుల నడుమనున్న కార్మికవర్గం-పరిస్థితులనన్నీ 'విధి' రాతకు వదలి మౌన ప్రేక్షకులుగా వుండలేరు; ఉండజాలరు.

సమరశీలత, సామాజిక చైతన్యంకల వర్గంగా కార్మికులు ఈ దోపిడీ అసమానతలను, అణచివేతను కొనసాగనివ్వరు. ఈ విధమైన దుర్మార్గాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడమే కార్మికుల వర్గ స్వభావం.

అభివృద్ధి చెందిన దేశాలలో ప్రత్యేకించి యూరోపియన్ యూనియన్ దేశాలలో తమ హక్కులను ఎలుగెత్తి చాటుతూ, తమ హక్కులను తిరిగి పొందటానికి, తమ ప్రయోజనాల పరిరక్షణకు కార్మికులు పెద్దఎత్తున పోరాటాలలోకి కదులుతూ వుండటాన్ని మనం ఇప్పటికే గమనించాం.

ఇటీవలి కాలంలో దక్షిణాఫ్రికా గనికార్మికులు తమ హక్కుల సాధనకై సాగించిన మిలిటెంట్ పోరాటం స్ఫూర్తిదాయకమైంది.

ఈజిప్టు, వియత్నాం మరియు బంగ్లాదేశ్‌లలోని దుస్తుల పరిశ్రమలలో మహిళా కార్మికులు చెదురు మదురుగా సాగించే పోరాటాలు, ఆందోళనలు-దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా కార్మికుల పోరాట పటిమను సూచిస్తోంది.

తమ వేతన బకాయిల చెల్లింపుకోసం; బలవంతపు ఓవర్‌టైమ్ చేయించటాన్ని నిరసిస్తూ; మెరుగైన భద్రతతో కూడిన పనిపరిస్థితులను డిమాండ్‌చేస్తూ చైనాలో పెద్దఎత్తున గొలుసుకట్టుగా సాగుతోన్న పోరాటాలు-ప్రపంచ వ్యాపిత కార్మికులకు స్ఫూర్తిదాయకంగా నిలచి తమ స్వీయపోరాటాలు సాగించేందుకు ఉత్తేజాన్ని కల్గిస్తున్నాయి.

మానేసర్‌లోని మారుతీ సుజుకీలోనూ; యానాం లోని రీజెన్సీ సిరామిక్స్‌లోనూ; నోయిడాలోనూ, తమిళనాడుకు చెందిన శ్రీపెరంబదూర్‌వంటి పారిశ్రామిక మురికివాడలలోనూ కార్మికులు సాగిస్తున్న పోరాటాలు భారత కార్మికులలో ఆశలు రేకెత్తించి; వారంతా తప్పక ఐక్యంకావాలని, వారంతా ఒక వర్గంగా సంఘటితమై దోపిడీ, అణచివేత, అసమానతలకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాలు సాగించాలని ప్రబోధిస్తున్నాయి.

గిట్టుబాటు ధరలకోసం, బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, నీటిపారుదల-వ్యవసాయరంగ అభివృద్ధికి అవసరమైన పథకాల అమలుకోసం మనదేశంలోని వివిధ ప్రాంతాలలో రైతాంగం సాగిస్తున్న అనేక పోరాటాలు ఏమని చెప్తున్నాయంటే, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ భూమి సేకరణలతోపాటు, గ్రామీణ పేదల చావుబతుకుల వంటి సమస్యలు పరిష్కారం కానంతవరకూ భారత దేశంలోని యావత్తు కష్టజీవులకు, అణచివేతకు గురౌతున్న విశాల ప్రజారాశులకు మెరుగైన పరిస్థితులుంటాయని ఎవరూ ఆశలు పెట్టుకోవాల్సిన అవసరంలేదని చెబుతున్నాయి.

**కనుక, భారత కార్మికుల ముందు తక్షణ పరిష్కారానికై ఈ కర్తవ్యాలు ముందున్నాయి.**

**1) కార్మికులు, తామంతా ఒక వర్గంగా ఐక్యం, సంఘటితం కావాలి.**

**2) రైతాంగం, ఇతర కష్టజీవులు, అణచివేతకు గురయ్యే ప్రజలతో ఐక్యతను పెంపొందించుకోవాలి.**

**3) దోపిడీ, అణచివేత, అసమానతలకు తావులేని వ్యవస్థ స్థాపనకోసం-దోపిడీ, అణచివేత, అసమానతలకు వ్యతిరేకంగా, వీటికి గురయ్యే వర్గాలన్నీ సాగించే పోరాటాలకు నాయకత్వం వహించి కొనసాగించాలి.**

చారిత్రక అనివార్యత వెలుగులో ఈ విధమైన కర్తవ్యాలు చేపట్టవలసిన భారత కార్మికవర్గం-మేడే ప్రాధాన్యతను తేలికగా తీసుకోవటంగానీ, లేదా ఒక లాంఛనప్రాయమైనదిగా మార్చటంగానీ లేదా ఒక వేడుకగా చేసుకోవటంగానీ కాకుండా, అంతర్జాతీయ కార్మికుల పోరాట దీక్షాదినంగా పాటించి, పెట్టుబడి దోపిడీని అంతమొందించేందుకు, మానవ జాతికే శాపంగా పరిణమించిన పెట్టుబడిదారీ వ్యవస్థను సమూలంగా నాశనంగావించేందుకు ప్రతినబూనాలి. వర్గ ఐక్యతను సాధించి, అవిశ్రాంత వర్గపోరాటాలు సాగించటంద్వారా దోపిడీ, అణచివేత, అసమానతలకు తావులేని సామ్యవాద వ్యవస్థను స్థాపించాలి.

మేడే దినాన ఈ విధంగా ప్రతినబూనుదాం.

**- పాణి**

# విదేశీ పెట్టుబడి పరమౌతున్న చిన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు

**నూతన** ఆర్థిక విధానాలలో భాగంగా భారత ప్రభుత్వం సంస్కరణల పేరిట విద్యుత్తురంగ ప్రైవేటీకరణను చేపట్టింది. మొదట విద్యుదుత్పత్తి రంగంతో ప్రారంభమైన ప్రైవేటీకరణను తరువాత విద్యుత్తు రవాణా, పంపిణీ రంగాలకు విస్తరింపజేశారు. విద్యుదుత్పత్తిని పెంచి నాణ్యమైన కరెంటును నిరంతరాయంగా సరఫరా చేయటమే ఈ విధానపు లక్ష్యమని చెప్పుకున్నారు. కానీ ఆచరణలో ఈ లక్ష్యాలు నెరవేరలేదు. విద్యుత్తు ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడినా, చిన్న పరిశ్రమలూ, చిన్న వ్యాపారులూ కరెంటు కోతలతో నష్టపోతున్నా, విపరీతంగా పెరిగిన కరెంటు బిల్లులు చేతికొస్తున్నాయి.

ప్రైవేటీకరణ పేరిట విద్యుదుత్పత్తి రంగాన్ని విదేశీ పెట్టుబడిదారుల పరంచేశారు. ఎన్‌రాన్‌తో మొదలుపెట్టి ప్రైవేటు రంగంలో నిర్మించిన ధర్మల్ విద్యుత్తు ప్రాజెక్టులన్నీ పరోక్షంగానో, ప్రత్యక్షంగానో విదేశీ పెట్టుబడి ఆధీనంలోనే వున్నాయి. వీటిని నిర్మించి పెట్టిందీ, వీటికి యంత్రాలు సరఫరా చేసిందీ, చివరకు వీటిని నడిపేదీ నిర్వహించి పెట్టేదీ కూడా విదేశీ కంపెనీలే.

ఇక అణువిద్యుదుత్పత్తి ప్రభుత్వ రంగంలోనే వున్నా అక్కడా ఇదే పరిస్థితి. వాటిని నిర్మించి పెట్టేదీ, అణు రియాక్టర్లను సరఫరా చేసేదీ, జీవితకాలంపాటు వాటిని నడిపేదీ కూడా విదేశీ కంపెనీలు. అణుప్రమాదం జరిగి భారత ప్రజలు నష్టపోతే మాత్రం కనీసం నష్టపరిహారం చెల్లించే బాధ్యత కూడా ఈ విదేశీ కంపెనీల కుండదని చట్టపర హామీని కూడా భారత పాలకులు వాటికిచ్చారు.

విద్యుదుత్పత్తిలోని ఈ రెండు ప్రధాన రంగాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్న తర్వాత విదేశీ పెట్టుబడి తన కబంధ హస్తాలను ఇతర విద్యుదుత్పత్తి రంగాలకు విస్తరించింది. అది సాంప్రదాయేతర ఇంధన వనరులతో సాగే విద్యుదుత్పత్తి. గాలి మరలతో విద్యుదుత్పత్తి సాగించటంలో అగ్రస్థానంలో వున్న భారత కంపెనీని విదేశీ పెట్టుబడిదారులు కొని వేశారు. విద్యుత్తు సంక్షోభంనుండి బయట పడాలంటే సూర్యరశ్మినుండి విద్యుదుత్పత్తే శరణ్యమనీ, ఇంటి కప్పులపై సూర్యరశ్మి ఫలకాలను పెట్టుకుంటే సబ్సిడీ ఇస్తామనీ, ఆ ఇళ్లనుండి విద్యుత్తును ట్రాన్స్‌కోలు కొంటాయనీ విధాన ప్రకటనలు చేస్తున్నారు. 95 లక్షల రూ॥లు పెట్టి గవర్నరుగారి రాజభవనానికి సూర్యరశ్మి ఫలకాలను పెట్టినందున నెలకు 33వేల రూపాయల విద్యుత్తుబిల్లు ఆదా అయిందని ప్రచారం చేస్తున్నారు.

అసలు విషయమేమిటంటే ఈ సూర్యరశ్మి ఫలకాలను తయారుచేసేదీ, అమ్మేదీ విదేశీ కంపెనీలే. ఆవిధంగా ఈ రంగాన్ని కూడా విదేశీ కంపెనీల దోపిడీకి నిలయం చేస్తున్నారు.

దీనికంతటికీ దేశంలో పెట్టుబడి పెట్టేందుకు ధనం లేదనీ, కనుక విదేశీ పెట్టుబడిని ఆహ్వానించక తప్పదనీ చెప్పుకున్నారు.

విద్యుదుత్పత్తిలో ఇక మిగిలింది చిన్నజల విద్యుత్తు ప్రాజెక్టులు. హిమాలయ పర్వత సానువుల్లో జల విద్యుదుత్పత్తికి అనేక అవకాశాలున్నాయంటూ చాలా కాలంనుండీ ప్రచారం చేస్తున్నారు. టెహ్రీ వంటి పెద్దడ్యాముల నిర్మాణానికీ పూనుకున్నారు. దీనిపై విమర్శలు రావటంతో(భూమి ముంపు, నిర్వాసితుల సమస్య, భూకంపాలు) చిన్న జల విద్యుత్తు డ్యాముల నిర్మాణాన్ని చేపట్టారు.

హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాలలో వందలాది చిన్న డ్యాముల నిర్మాణానికి పూనుకున్నారు. అయితే ప్రభుత్వరంగంలో కాదు, ప్రైవేటు రంగంలో. దాదాపుగా వీటన్నింటినీ సివిలు ఇంజనీరింగ్ కంట్రాక్టర్లే నిర్మిస్తున్నారు. ప్రభుత్వం చుట్టూ తిరిగి, అధినేతలకు నజరానాలు సమర్పించుకునీ అన్ని అనుమతులు తెచ్చుకుని వీరు నిర్మాణాలు చేస్తున్నారు.

వీటిద్వారా ఒక మెగావాట్ విద్యుదుత్పత్తి చెయ్యాలంటే 25 లక్షల రూ॥లు పెట్టుబడి వ్యయం అవుతుంది.

ఈ చిన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు సిద్ధమైన తర్వాత విదేశీ పెట్టుబడి రంగంలోకి దిగింది. నిర్మించింది సివిల్ కంట్రాక్టర్లు గనుక, వారిలో ఎవరికీ విద్యుదుత్పాదనలో అనుభవంలేదు గనుక, కొంతలాభానికి అమ్ముకోవటానికి వారు సిద్ధంగావున్నారు. మరే విద్యుదుత్పత్తి రంగంలోనైనా ఒక మెగావాట్టుకు 5-నుంచి 8 కోట్ల రూ॥ల వరకూ పెట్టుబడి వ్యయం వుంటుంది గనుక, 50 లక్షల రూ॥కు వీటిని కొని వేయటానికి విదేశీ కంపెనీలు ముందుకు వస్తున్నాయి. దీనికి రెండు రకాల పద్ధతులను అనుసరిస్తున్నారు. ప్రత్యక్షంగా, నిర్మించిన కంట్రాక్టరు నుండి కొనివేయటం; పరోక్షంగా వీటి నిర్మాణానికి మదుపు పెట్టిన ద్రవ్య సంస్థలను కొనివేయటంద్వారా ఈ ప్రాజెక్టులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవటం.

అరుణాచల్ రాష్ట్రప్రభుత్వం జలవిద్యుత్తు అభివృద్ధి కార్పోరేషన్‌ను ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో ఇప్పుడు 282 చిన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మాణమౌతున్నాయి. వీటి నిర్మాణానికి ఈ కార్పోరేషన్ రుణాన్నిస్తుంది. ఈ ప్రాజెక్టులలో విద్యుదుత్పత్తి మొదలైన తర్వాత వాటి ఆదాయాన్నిబట్టి ఈ రుణాన్నీ, వడ్డీనీ ఇవి తిరిగి చెల్లిస్తాయి.

భారత, బ్రిటన్‌ల ద్వంద పౌరసత్వమున్న నవీన్ జిందాల్ ఒక బడాబూర్జువా. ఇతను ఏవిధంగా చూసినా విదేశీ పెట్టుబడిదారుడే. అరుణాచల్ ప్రభుత్వం జలవిద్యుత్తు అభివృద్ధి కార్పోరేషన్‌లో 49 శాతం వాటాలను నవీన్ జిందాల్‌కు అమ్మివేసింది. జలవిద్యుత్తు ప్రాజెక్టులకు రాష్ట్రప్రభుత్వమిచ్చే ఆర్థిక సహాయం ఈ కార్పోరేషన్ ద్వారానే చేస్తానని ఒప్పుకొంది. ఈ కార్పొరేషన్ సహాయం చేసిన, ఇకముందు చేయబోయే ప్రాజెక్టులనుండి వచ్చే చెల్లింపులన్నీ లాభాలుగా నవీన్ జిందాల్ గ్రూపుకు చెందుతాయి. పెట్టుబడి ప్రభుత్వానిది. లాభాలలో వాటా జిందాల్‌ది! దీనిపై విమర్శలు రావటంతో వాటాలను తిరిగి యిచ్చెయ్యమని జిందాల్‌ను అడుగుతామని ప్రకటించింది.

ఇక ప్రత్యక్ష పద్ధతి. గ్రీన్‌కో అన్న కంపెనీని అనిల్ చెలమలసెట్టి, మహేష్ కొల్లి అనే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఎన్‌ఆర్‌ఐలు 2005లో ప్రారంభించారు. ఎలాంటి పన్నులుండని స్వర్గంగా చెప్పే ఐజిల్ ఆఫ్ మాన్‌లో ఈ కంపెనీని రిజిస్టరు చేశారు. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజికి అనుబంధంగా వుండి, నియమ నిబంధనలు కఠినంగా వుండని ఆల్టర్నేటివ్ ఇన్‌వెస్ట్‌మెంటు మార్కెట్టు నుండి 2007లో 5 కోట్ల డాలర్లు పెట్టుబడిగా పోగు చేశారు. (ఇదంతా చూస్తే భారత్‌నుండి అక్రమార్జనలే ఈ రూపంలో వస్తున్నాయన్న అనుమానాలు వస్తాయిగానీ ఇప్పటివరకూ ఎలాంటి సాక్ష్యాలు లేవు). ఇదికాక ప్రైవేటు ఈక్విటీ నిధుల సంస్థ టిపిజినుండీ, సింగపూర్ ప్రభుత్వ బాండ్లనుండీ, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ అనుబంధసంస్థ నుండీ రుణాలు తీసుకున్నారు. ఆవిధంగా గ్రీన్‌కోకు 1600 కోట్ల రూ॥లు పెట్టుబడి సమకూరింది.

హైద్రాబాదు కేంద్రంగా వున్న గ్రీన్‌కో కంపెనీ ఇప్పటివరకూ 60 చిన్న జలవిద్యుత్తు ప్రాజెక్టులను తానే నిర్మించింది. విద్యుదుత్పత్తి ప్రారంభించిన 105 ప్రాజెక్టులను కొనివేసింది. అన్ని అనుమతులు పొంది నిర్మాణం సాగుతున్న 220 ప్రాజెక్టులనూ, అనుమతులు వచ్చాయని తెలిసి పనులు ప్రారంభించబోతున్న 400 ప్రాజెక్టులనూ కొనివేసింది. వీటి ఉత్పత్తి సామర్థ్యం 5 నుండి 15 మెగావాట్లు. అన్ని ప్రాజెక్టులూ కలిపి 1000 మెగావాట్ల సామర్థ్యం వుంది. 2011-12 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ నికర లాభం 81.2 కోట్లు.

గ్రీన్‌కో కొన్న ఈ ప్రాజెక్టుల్లో ప్రధాన భాగం కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో వున్నాయి. కొన్ని సిక్కింలో వున్నాయి. ఇప్పుడు అరుణాచల్‌ప్రదేశ్‌లోని ప్రాజెక్టులను కొనే పనిలో వుంది. బ్రహ్మపుత్ర ఉపనది లోహిత్‌పై 50 కి.మీ. పరిధిలో వున్న 15 డ్యాములు కొనుగోలుకు చర్చలు సాగిస్తున్నది.

25 లక్షల రూ॥లతో కంట్రాక్టర్లు నిర్మించిన ఈ ప్రాజెక్టులు కూడా విదేశీ పరమౌతున్నాయి. నిర్మించిన వారు నిర్వహించే అనుభవంలేక నష్టపోతున్నారనీ, తమ నిర్వహణా పరిజ్ఞానంతో లాభాలు గడిస్తున్నామని గ్రీన్‌కో పెట్టుబడిదారు అనిల్ చెలమలశెట్టి చెప్పుకున్నారు. ఈ రంగంలో గత చేదు అనుభవాలరీత్యా నిర్వహణా పరిజ్ఞామంటే ఏమిటో అర్థంచేసుకోవటం కష్టంకాదు. ఎక్కువ డ్యాములు తమ ఆధీనంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాన్ని ఒప్పించి విద్యుత్తు అమ్మకం రేటు పెంచుకుంటారు.

ఈ చిన్న డ్యాముల నిర్మాణంవల్ల తలెత్తుతున్న పర్యావరణ తదితర సమస్యల గురించి మరో సందర్భంలో చర్చించుకుందాం. ✶

## కమ్యూనిస్టు విప్లవయోధుడు కా॥ కానూసన్యాల్ వర్ధంతి సభలు

**ఒంగోలు, 23-3-13 :**

మార్చి 23 సాయంత్రం స్థానిక ఈమనిపాలెం లోని పార్టీ కార్యాలయం సెంటర్‌లో సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో భారత విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ కానూసన్యాల్ వర్ధంతి సభ జరిగింది. పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ యస్. లలిత కుమారి అధ్యక్షతన జరిగిన ఈసభలో వక్తలు తొలుత కామ్రేడ్ కానూ సన్యాల్ చిత్రపటం వద్ద పూలు వుంచి నివాళులర్పించి, ఆయన చూపించిన మార్గాన ముందుకు సాగుదామని ప్రతినబూనారు.

ఈ సభలో కా॥లలితకుమారి మాట్లాడుతూ కా॥కానూసన్యాల్ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు విప్లవ నాయకుడని, ఎప్పుడూ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు నెరపటంపై ఆసక్తిగా వుండేవారని, ఆయన జీవిత కాలమంతా నిజాయితీతో, నిరాడంబరంగా గడిపారని, జీవితంలో పొదుపుగా వుండటమనేది ఆయన నుండి మనం నేర్చుకోదగ్గ అతిముఖ్యలక్షణమని, కా॥ కానూసన్యాల్ ఒక విప్లవ ప్రజాయోధుడిగా, నాయకునిగా భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా ఖ్యాతి గడించారని, కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత కోసం ఆయన చివరి శ్వాసవరకు పరితపించి పనిచేశారని అన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కా॥ఎమ్.ఎస్.శాయి మాట్లాడుతూ అత్యంత పేద ప్రజానీకం మధ్యనే ఆయన జీవనాన్ని సాగించారని, డార్జిలింగ్ జిల్లా టీ తోట కార్మికులతో ఆయన మమేక మయ్యారని, టీ తోట కార్మికసంఘాన్ని విస్తృతపరచారని, నేడు దేశంలో అసంఘటితరంగ కార్మికులు ఏ హక్కులు లేకుండా నికృష్టమైన జీవితాలను గడుపుతున్నారని, సంఘటితరంగ కార్మికుల హక్కులను పాలకులు హరించి వేస్తున్నారని, కార్మికవర్గ దృక్పథంతో కార్మికవర్గాన్ని సంఘటితపరచి ఐక్య ఉద్యమాలు నిర్మించాలన్నారు. ఈ సభలో రైతుకూలీసంఘం నాయకులు కామ్రేడ్ రామారావు, కా॥పరిటాల కోటేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥పేరయ్య, ఎన్‌వైయస్ నాయకులు కా॥జి.వెంకటరావు తదితరులు కా॥కానూసన్యాల్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

**నాగాయలంక, 24-3-13 :**



నగ్జల్బరీ ఉద్యమ నిర్మాత కా॥ కానూసన్యాల్ వర్ధంతి సభ 24-3-13న నాగాయలంక పంచాయితీ ఆఫీసు వద్ద జరిగింది. ఈ సభకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లాకోశాధికారి కా॥తలశిల లీలామనోహర్ అధ్యక్షత వహించారు. అప్పటికి వారం రోజులు క్రితమే మరణించిన కా॥మానం రామారావుకు, కా॥కానూ సన్యాల్‌కు తొలుత సభలో నివాళులర్పించారు.

సభలో మొదటిగా ఓపిడిఆర్ రాష్ట్రనాయకులు కా॥ఎమ్.వి.కృష్ణయ్య మాట్లాడుతూ అమరులను తలచట మంటే, వారి ఆశయసాధనకోసం, సామ్రాజ్యవాద - భూస్వామ్య దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమేనన్నారు. మనదేశ వనరులను విదేశీ, దేశీయ దళారీ పెట్టుబడిదారులకు కట్టబెడ్తున్న తీరును నిశితంగా విమర్శించారు. 'ఒక బిటియు గ్యాస్‌ను ఇరాన్ మనకు ఒక డాలరు - రెండు డాలర్లకు అందిస్తామంటే, అమెరికా వత్తిడికి తలొగ్గిన పాలకులు దానిని నిరాకరించారు. రిలయన్స్ వద్ద అదే ఒక బిటియుగ్యాస్‌ను 4.20డాలర్లకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడేమో విదేశాల నుండి దిగుమతి చేసుకొంటే అయ్యేరేటు ప్రకారం 14డాలర్లు చెల్లించాలని రిలయన్స్ కేంద్రంపై వత్తిడి చేస్తోంది. ఇంతకంటే దారిదోపిడీవుందా?'అని ఆయన ప్రశ్నించారు. ఈ దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం అహర్నిశలు శ్రమించిన అమరుల బాటలో ప్రజల్ని చైతన్యపరచి ఉద్యమింపజేయటమే కర్తవ్యమని కామ్రేడ్ కృష్ణయ్య నివాళులర్పించారు.

సిపిఐ (ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ యద్దనపూడి సోని, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె.జగన్ తదితరులు పాల్గొని కా॥ కానూసన్యాల్, కా॥ఎమ్మార్‌ల బాటలో ముందుకు సాగుదామని ప్రతినబూనారు. 250 మంది రైతు కూలీలు, స్థానిక ప్రజానీకం ఈ సభకు హాజరయ్యారు. ✶

## మత్స్యకారుల సముద్రవేటపై ప్రభుత్వ ఆంక్షలకు నిరసనగా సభ

**బందరు, 15-4-13:**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 15-4-13 సాయంత్రం బందరు మండలం, పల్లెతుమ్మల పాలెంలోని ప్రధాన సెంటర్‌లో సముద్ర వేటపై ఆంక్షలు రద్దుచేయాలని, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని, తీరప్రాంతంలో ధర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ల కాలుష్యాన్ని అరికట్టాలనే అంశాలపై సభ జరిగింది. ఈ సభకు కా॥మైలా పోతురాజు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥యద్దనపూడి సోని పాల్గొని ప్రసంగిస్తూ 1991 సం॥నుండి అమలుచేస్తున్న నూతన ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రవేటీకరణ విధానాల ఫలితంగా అన్ని వర్గాల ప్రజానీకం తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. మత్స్యకారులు చేపలవేట సాగించాలంటే అనుమతులు, బోట్ లైసెన్సులు తీసుకోవాలని; అనుమతులు లేకుండా హద్దులు దాటితే 9 లక్షల జరిమానా మరియు 3 సం॥ల జైలు శిక్ష అంటే ఒక్కమాటలో చెప్పాలంటే మత్స్యకారులను సముద్రపు వేటనుండి వెళ్ళగొట్టేందుకు 2009 'సముద్రపు వేట నియంత్రణ బిల్లు'ను తీసుకువచ్చారని, ఈ చట్టం చేశాక కేంద్రప్రభుత్వం 125 విదేశీ ట్రాలర్లకు అనుమతి నిచ్చిందని, ఒకే అనుమతి పత్రంతో 4-5 విదేశీ ట్రాలర్లు నిరంతరం సముద్రంలో వేటాడుతున్నా ఈ పాలకులు గాని, ప్రభుత్వంగాని పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ తీరప్రాంతంలో ఎక్కడ చూసినా మడ అడవులను నరకవద్దని బోర్డులు పెట్టారు కానీ, ఈ ప్రాంతంలో పవర్‌ప్లాంటులకోసం టి.సుబ్బరామిరెడ్డికి చెందిన గాయత్రి కన్‌స్ట్రక్షన్ వార్కి 1200 ఎకరాలు ఇచ్చారని, వారు మడ అడవులు నరికినప్పటికీ, ఇక్కడ వున్న ఎంఎల్‌ఏలుగాని, ఎంపిలుగాని, అధికారులుగానీ ఎవరూ మాట్లాడంలేదని, ఈ నీతులు ఎవరికి చెప్పటానికి అని ప్రశ్నించారు. 'విదేశాలనుండి క్రిమి రసాయనాలను నింపిన ఓడలను భారత దేశంలోకి పంపుతున్నారు. 72వేల రకాల రసాయనాలు సముద్రంలో కలుస్తున్నాయి. దీనివల్ల సముద్ర జలాలు కలుషితమై మత్స్యసంపద నాశనమౌతోంది. థాయిలాండ్‌లో 10వేల మంది మత్స్యకారులు దీనికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఇటీవల కాలంలో సముద్రం గుండా టెర్రరిస్టులు వస్తున్నారని సముద్రంలో వేటాడే బోట్లన్నిటికీ ఒకేరకమైన రంగు వేయాలని చట్టంచేశారు. మెరైన్ పోలీస్ స్టేషన్లుపెట్టి మత్స్యకార్లను అనుమానితులుగా ముద్రవేస్తూ, తమకు జరిగిన అన్యాయాలను, హక్కులను అడగకుండా అణచటానికి ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారు' అంటూ ఏ సమస్యనైనా పరిష్కరించుకోవాలంటే సంఘటితంగా, సంఘంగా పోరాడవల్సిందేనని కా॥సోని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర) నాయకులు, కా॥కొప్పినేని ఉమా మహేశ్వరరావు, కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు (న్యూ) బందరు ఏరియా నాయకులు కా॥ఎం.సుధాకర్, జి.మల్లేష్‌లు ప్రసంగించారు. ముందుగా ప్రజాకళాకారులు పాటలు పాడారు. 'ధరలు బాబోయ్ ధరలు' వీధి నాటిక ప్రదర్శించారు. కళాకారులు పాడిన పాటలు, నాటిక ప్రజలను బాగా ఆకట్టుకొన్నాయి. ✶


**వెలువడింది !**

**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**

**వార్షిక సంచిక 2012**

వెల : రు. 50/-

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# పొన్నెకల్లు గ్రామంలో నివాస స్థలాల రక్షణకై దళిత, గిరిజన పేదల ఆందోళన

**గుంటూరుజిల్లా,** తాడికొండ మండలం -పొన్నెకల్లు గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూమి సర్వే నంబరు 207లో దళిత, గిరిజన శ్రామిక కులాల నిరుపేదలు గత 70 సం॥లకు పైగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. 1989 సం॥వరకు ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు చెల్లిస్తూనే వున్నారు. మరుగుదొడ్లు, పక్కాగృహాల నిర్మాణానికి ప్రభుత్వపరంగా మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు కూడా పొందారు.

## గుడిసెల తొలగింపుకు పెత్తందార్ల ప్రయత్నాలు

ప్రభుత్వ పోరంబోకు భూమిలో నివాసముంటున్న ఈ పేదల గుడిసెలను తొలగించి, ఈ స్థలాన్ని కబ్జా చేయాలనో లేక మరి ఏ స్వార్థతలంపుతోనో ఆ గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం శివాజీ ఆధ్వర్యాన గుడిసెల తొలగింపునకు ప్రయత్నాలను ఇటీవల ముమ్మరంచేశారు.

1989 సం॥లో గుర్రం శివాజీ సర్పంచ్ అయినప్పటినుండి పేదల గుడిసెలకు ఇంటి పన్ను కట్టించుకొనడం నిలుపుదల చేశారు. కరెంటు సరఫరా నిలిపివేశారు. పక్కా గృహాల మంజూరు ఉత్తర్వులను రద్దుచేయించారు. ఆ స్థలములోని గుడిసెలను తొలగించాలని హుకుం జారీచేశారు.

'మేము ప్రభుత్వ స్థలంలో నివాసముంటుంటే ఎందుకు ఖాళీచేసి వెళ్ళాల'ని గుడిసెవాసులు అడుగుతూంటే 'ఇది గుర్రం వారి చెరువు స్థలమని, ప్రభుత్వ స్థలముకాదని, చెరువు కూడా గుర్రం వారిదేనని, తక్షణమే ఈ స్థలం ఖాళీచేసి వెళ్లాలని, బెదిరింపులకు, అబద్ధపు ప్రచారాలకు దిగారు.

పేదలు ఉంటున్న ఈ నివాస స్థలానికి సంబంధించిన విషయంపై కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ గుర్రం కోటయ్యగారు జీవించివున్న కాలంలోనే 'ఇది ప్రభుత్వ చెరువని, గుర్రంవారి ప్రైవేటు స్థలంకాదని', ప్రభుత్వమునుండి న్యాయస్థానములనుండి స్పష్టమైన రికార్డును సంపాదించి, దానిని గ్రామ ప్రజలందరి ముందు బహిర్గతం చేశారు. కానీ గుర్రం శివాజి, అతని అనుయాయులు పాతపాటనే పాడుతూ ఇది తమ సొంతచెరువని బుకాయిస్తున్నారు.

2002 సం॥లో గ్రామంలో కొందరు అగ్రకుల పెత్తందారులు గుర్రం శివాజీ ప్రోద్బలంతో పేదలు నివసిస్తున్న స్థలమును బలవంతంగా ఆక్రమించడానికి, ఆ స్థలములో వరిగడ్డివాములు, దిబ్బలు, పశువుల కొష్టాలు వేశారు. ఈ పరిస్థితిని గమనించిన దళిత యువకులు పొదిలి వెంకట్రావు అనే అతని ఆధ్వర్యంలో పెత్తందార్లకు ఎదురు నిలబడి, ఆ స్థలాన్ని వారు కబ్జా చేయకుండా కాపాడుకున్నారు.

అప్పటికి సద్దుమణిగినట్టే కనిపించిన పెత్తందార్లు ఆ తర్వాతకూడా ఆ స్థలంనుండి పేదలను ఏ విధంగా నైనా తొలగించాలనే దుష్ట ఆలోచనలతో తమ ప్రయత్నాలు సాగిస్తూనే వున్నారు. 2011 సం॥లో 'ఈ స్థలములో కళ్యాణమండపం కట్టాలి. లేదా పశువుల ఆసుపత్రి కట్టాలి' అంటూ కొత్తపల్లవి ప్రారంభించారు. గిరిజనులు, దళిత, యువకులు ఈ వాదనను కూడా త్రిప్పికొట్టారు. 'పశువుల ఆసుపత్రి నిర్మాణానికి గ్రామంలో ఇంకా చాలా స్థలాలు వున్నాయని, ఎప్పటినుండో నివాసముంటున్న పేదల గుడిసె స్థలాలే కావలసి వచ్చాయా' అంటూ పెత్తందార్ల వాదనలను ఎండగట్టారు. ఆ తర్వాత వేరే స్థలములో పశువుల ఆసుపత్రి నిర్మాణం జరిగింది.

మరలా ఇటీవల గుర్రం శివాజీ కొత్తపథకంతో పేదల గుడిసెలను తొలగించడానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. ఆ స్థలములో మంచినీటి ఫిల్టర్‌బెడ్ నిర్మించాలని, కాబట్టి గుడిసెలు ఖాళీచేయాలని, లేదంటే బుల్‌డోజర్‌తో నేలమట్టం చేస్తామంటూ బెదిరింపులు సాగించాడు.

ఈ పరిస్థితిని గమనించిన దళిత యువకులు అంతకుమునుపటి నుండి నివాసముంటున్న ఎరుకల వారికి అండగా మాదిగ, పాముల, చాకలి, యాదవ, మంగలి, చెంచు తదితర కులాల పేదలను మరో 30 మందిని సమీకరించి 2013 జనవరిలో గుడిసెలు వేసుకున్నారు.

ఉన్న గుడిసెలనే తీసేయమంటుంటే కొత్తగా గుడిసెలు వేయటమేమిటని గ్రామపెత్తందార్లకు కన్నెర్ర అయ్యింది. రెవెన్యూ అధికారులను, పంచాయితీ, పోలీసు అధికారులను పలుసార్లు పేదలపైకి ఉసిగొలిపి గుడిసెలను వెంటనే పీకివేయాలంటూ అదిరింపులకు, బెదిరింపులకు పూనుకున్నారు. మంచినీటి ఫిల్టర్‌బెడ్ నిర్మాణానికి ఆ స్థలం కావాలంటూ గుర్రం శివాజీ ఆధ్వర్యంలో గ్రామంలో సంతకాలు సేకరణకు పూనుకున్నారు.

## గుడిసెవాసుల పోరాటానికి అండగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

ఈ నేపథ్యంలో గుడిసెవాసులైన నిరుపేదలందరితో రైతుకూలీసంఘం పలుసార్లు సమావేశాలు జరిపి వారిలో మనోధైర్యం కలిగించింది. సిపిఐ(ఎం.ఎల్) పార్టీ నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి, కా॥దేవరశెట్టి వెంకటస్వామి; రైతుకూలీసంఘం(ఆం.ప్ర)జిల్లా అధ్యక్షులు కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, జిల్లా సహాయకార్యదర్శి కా॥దానబోయిన భాస్కరరావులు గుడిసెస్థలాల రక్షణకొరకై పోరాడుతున్న పేదలతో కలసి జిల్లా కలెక్టరు, ఆర్‌డిఒ, ఎంఆర్ఓ లాంటి ప్రభుత్వ అధికారులను కలిసి, పెత్తందారుల దుశ్చర్యలను వివరించారు. ఎప్పటినుండో నివాసముంటున్న దళిత, గిరిజన నిరుపేదల ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి రక్షణ కల్పించాలని అధికారులను కోరారు.

పేదల పక్షాన నిలబడి, వారికి న్యాయం చేయాల్సిందిగా కోరుతూ గ్రామంలో గ్రామపెద్దలకు, వివిధ పాలక పక్ష రాజకీయపార్టీల నాయకులకు లేఖలు అందించారు. ఇది ప్రభుత్వ పోరంబోకు స్థలమని, ఇందులో గత 70సం॥లుగా పేదలు నివాసముంటున్నారని, గ్రామపెత్తందారుల మాటలను, చేతలను గమనించాలని, నిలువనీడలేని నిరుపేదలకు నివాస స్థలాలు చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వందేనని, దళిత, గిరిజనులకు రక్షణ కల్పించి వారి గుడిసె స్థలాలకు పట్టాలివ్వాలని డిమాండ్‌చేస్తూ పేదలు 2-4-13న గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సిపిఐ(ఎం.ఎల్) పార్టీ రాష్ట్ర నాయకులు కా॥గుర్రం విజయకుమార్ ఇంకా రైతుకూలీసంఘం నాయకులు పాల్గొన్నారు. 4-4-13న గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తాశీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన మెమోరాండం యిచ్చి పరిస్థితిని వివరించారు. గుడిసెవాసులు తమ నివాస స్థలాలను రక్షించుకొనేందుకు కృతనిశ్చయంతో వున్నారు. ✡

# రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) కార్యాలయం ప్రారంభం

**నిజామాబాద్, 2.5.13 :**

నిజామాబాద్‌లోని మధురానగర్‌కి చెందిన పేదలు ఎన్నో సంవత్సరాలుగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకత్వాన కెనాల్ ప్రక్కన శ్రామికనగర్ కాలనీ నిర్మించుకొని జీవిస్తున్నారు. ఆ కాలనీలో ప్రజలే కార్యాలయం కోసం తలాకొంత చందాలు వేసుకొని, శ్రమదానం చేసి కార్యాలయాన్ని నిర్మించుకొన్నారు. 2-5-13న జరిగిన కార్యాలయం ప్రారంభోత్సవానికి రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య హాజరైనారు. సంఘ కార్యాలయాన్ని కె.కోటయ్య ప్రారంభించి, ఎర్రజెండా ఎగరవేశారు. పేదలు, కష్టజీవులు ఐక్యంగా నిలబడవలసిన కర్తవ్యాన్ని, సంఘటితంగా ఉండి అన్ని సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలను సాగించాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా నాయకులు కామ్రేడ్ గంగుల నర్సయ్య ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, కార్యాలయం నిర్మాణం కోసం కృషిచేసిన ప్రజలకి, సహకరించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేశారు. ✡


జనశక్తి ప్రచురణ

**విప్లవ ప్రజా ఉద్యమం**

**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు**

**సావధానంగా చర్చిద్దాం!**

**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**

వెల: 10.00


# ఝార్ఖండ్: విస్థాపనకు వ్యతిరేకంగా ప్రజానుకూల అభివృద్ధి విధానానికై ప్రజా జాతా

**రాంచి, 17-3-13 :**

'విస్థాపన్ విరోధి నవనిర్మాణ్ మోర్చా' ఆధ్వర్యంలో మార్చి 10 నుండి నిర్వహించిన ప్రజా జాతా మార్చి 17న ముగిసింది. ప్రజలను వారి భూములనుండి విస్థాపనకు గురిచేయటాన్ని వ్యతిరేకిస్తూ మోర్చా కార్యకర్తలు వివిధ జిల్లాల గుండా ప్రచారక్యాంపెయిన్ సాగిస్తూ రాంచీకి చేరుకున్నారు. రాంచీలో అమరవీరుడు బిర్సాముండా సమాధిస్థల్ వద్ద - ప్రభుత్వ విధ్వంసకర అభివృద్ధి విధానాలపై పోరాటాన్ని తుదికంటా సాగిస్తామని వారంతా ప్రతినబూనారు.

అనంతరం మోర్చా ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో తూర్పు, పశ్చిమ శింగ్‌భూమ్; పరాయికోల్, రాంచి, హజారీబాగ్, ధనబాద్, బొకారో, గిరిధ్, దుంకా, జమ్‌టలా, పలాము మరియు ఇతర జిల్లాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు. సదస్సులో మొదటగా దేశంలోని వివిధ ప్రాంతాలలో - కళింగనగర్, నందిగ్రామ్, కాటికుండ్, నగదిలలో నీరు - అడవి - భూమి - ఖనిజసంపదల రక్షణ కోసం పోరాడుతూ ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో విభజనలకు గల కారణాల గురించి; ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానం గురించి, చర్చించి, సదస్సులో కొన్ని తీర్మానాలను ఆమోదించారు. మదన మోహన్, జస్వకచ్చప్, మంధన్, కుమార్‌చంద్ మండి, బిర్సా హేంబ్రమ్, బాబూధాన్ ముర్ము, జేవియర్ కుజూర్, శియాచరణ్ శర్మ, చంద్రభూషణ్‌చౌదరి, రోబిన్ సమాజ్‌పాధి, వినయ్‌కుమార్, రాజ్‌కుమార్ గొరాయ్, దిలీప్ తదితరులు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

## భూసేకరణ, పునరావాసం చట్టం - 2011పై...

1. వలసవాదులు తమ దోపిడీ ప్రయోజనాల కోసం రూపొందించిన భూసేకరణ చట్టం - 1894కు సవరణల పేరున చేసిన ప్రతిపాదనలన్నీ భూసేకరణను సులభతరం చేసేవే. కనుక, ఈ సదస్సు ఆ ప్రతిపాదనలన్నింటినీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

2. 'ప్రజా ప్రయోజనం' పేరున పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టుల అవసరాలకోసం భూమి సేకరణకు అనుమతినిచ్చే ఒక సవరణను ఈ బిల్లులో ప్రతిపాదించారు. జాతీయరహదారులు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు మరియు ఇతర మౌలికరంగాలను ఈ 'ప్రజాప్రయోజనం' కిందకు చేర్చారు. 'ప్రజాప్రయోజనం' పేరున దొడ్డిదోవన ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చే ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా నిరసనను తీవ్రతరం చేయాలి.

3. ఇప్పటిదాకా విస్థాపనకు గురిచేసినవారందరికీ హుందాయైన, స్థిరమైన, శాశ్వత జీవన విధానాన్ని కల్పించేంతవరకూ కొత్తగా ఎలాంటి విస్థాపననూ అంగీకరించరాదు.

4. వివిధ పేర్లతో ఇప్పటికే అవసరానికి మించి సేకరించిన భూములు నిరుపయోగంగా పడివున్నాయి. అలాంటి భూములనన్నీ సంబంధిత రైతులకు తిరిగి ఇచ్చివేయటమో లేదా భూమిహీన రైతులకు పంపిణీ చేయటమో చేయాలి.

## ఐక్య నిరసనోద్యమాలకై.....

1. భూమి- అడవి- నీరు- ఖనిజసంపదల కోసం, కార్మిక, రైతాంగ ప్రయోజనాల కోసం నిలబడుతూ; పెద్దఎత్తున దోపిడీ సాగిస్తున్న కార్పొరేట్ల కంపెనీలతో కుమ్మక్కైన రాజకీయ నాయకులు, ముఠాలు, దళారులు మరియు పాలకవర్గాలకు వ్యతిరేకంగా నిలచి ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. పాలకవర్గాల విధ్వంసక అభివృద్ధి నమూనాను వెల్లడిచేస్తూ కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి వర్గాల నడుమ ఐక్యతతో ఉద్యమాలను అభివృద్ధి చేయాలి.

2. విస్థాపన వ్యతిరేక ఉద్యమాల మధ్య ఐక్యతను సాధించేందుకు సంబంధిత సంస్థలు, ప్రతినిధులు, నాయకత్వాల నడుమ సమన్వయం, నిరంతరం ఇచ్చి పుచ్చుకొనే విధంగా జరగాలి. కులతత్వం, మతతత్వం, స్థానికతత్వం మరియు వ్యక్తిగత తత్వంతో చేపట్టే అన్నివిధాలైన ప్రాయోజిత నిరసనలన్నింటినీ కలిసికట్టుగా వ్యతిరేకించాలి.

3. విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో సమిష్టి, ప్రజాస్వామిక నాయకత్వం ఏర్పడే దిశగా సంయుక్త ప్రయత్నాలు చేయాలి.

## ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానంపై...

1. భారతదేశం గ్రామీణప్రాంతం ప్రధానంగా గల వ్యవసాయకదేశం. ఝార్ఖండ్‌లోని 90శాతం ప్రజలు, ఆదివాసులు వ్యవసాయంపై, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని, రైతాంగం వ్యవసాయం అభివృద్ధిపైన; వ్యవసాయ, అటవీ ఉత్పత్తులపై హక్కుల కోసం దృష్టిసారించాలి. చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. బడాకంపెనీలు, బడా యంత్రాలు, సాంకేతికతపై ఆధారపడకుండా జాతీయ, ప్రజాస్వామిక, ప్రజా విజ్ఞానాన్ని, సాంప్రదాయ విత్తనాలను, వ్యవసాయ విధానాన్ని స్వీకరించి వాటిని మరింత అభివృద్ధి పరచాలి. యంత్రాలపై ఆధారపడే, లాభార్జన దృష్టితోకాక ఉద్యోగ కల్పన దృష్టితో పారిశ్రామిక అభివృద్ధి జరగాలి.

2. నీరు-అడవి-భూమి-ఖనిజసంపదలతో సహా సహజవనరులన్నింటినీ మనదేశం యొక్క ప్రజలయొక్క ప్రయోజనాల కోసం సక్రమమైన పద్ధతిలో వినియోగించాలి. ప్రస్తుత పాలకవ్యవస్థ సాధారణ ప్రజల ప్రయోజనాల్నిగాక, అమెరికా మరియు దాని కంపెనీల ప్రయోజనాలను నెరవేరుస్తోంది. సాధారణ ప్రజల ప్రయోజనాల కోసం ఒక వ్యవస్థ ఏర్పడేదాకా సహజ వనరులపై సమిష్టి హక్కులకోసం ప్రధానంగా గ్రామాలపై ఆధారపడి పోరాటాన్ని కొనసాగించాలి. ప్రజాస్వామికమైన, న్యాయమైన, సమానత్వ ప్రాతిపదికపై ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానం అమలు కావాలంటే ఒక ప్రజాస్వామికమైన, న్యాయబద్ధమైన సమానత్వ ప్రాతిపదికపైనున్న పాలనావ్యవస్థ తప్పనిసరి, కనుక దీనికోసం ప్రస్తుత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రజాస్వామిక పాలనా వ్యవస్థ సాధనకోసం ఒక విస్తృతమైన పోరాటాన్ని సాగించాలి. ✡

# ధాన్యానికి గిట్టుబాటు ధరకై రైతుల ఆందోళన

**వెంకటగిరి, 14-3-13 :**

ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన రైతుకి గిట్టుబాటుధర ఇవ్వకుండా ధరను దిగ్గోసి దళారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా దున్నపోతుపై వాన కురిసిన చందంగా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా రైతాంగం రోడ్డెక్కాల్సి వచ్చింది. వెంకటగిరి ప్రాంత రైతన్నలు 14-3-13న స్థానిక తహశీల్‌దారు కార్యాలయాన్ని ముట్టడించారు. ఇటీవల వరకూ 75 కిలోల బస్తా సాధారణ రకం (బుడ్డలు) రూ॥14వందలు, మేలురకం బస్తా 15వందల రూ॥ అమ్మగా ఒక్కసారిగా సాధారణరకం 8వందలకు, మేలురకం వెయ్యిరూ॥కి తగ్గించి వేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటాలుకి కనీసం రూ॥2 వేలైనా ఇవ్వాలని ఆందోళన చేస్తోన్న రైతులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥జి.సునీత మాట్లాడుతూ బయటమార్కెట్‌లో బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నా రైతుపండించిన ధాన్యానికి అందులో సగం కూడా ఇవ్వడంలేదని, దళారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రైతు ధాన్యం దాచుకోవడానికి అవకాశం లేకపోవడంతో పంటని కళ్ళాల్లోనే అమ్మాల్సి వచ్చినందున ధరలు దిగ్గోసి కొనుగోలుచేసి పెద్దఎత్తున నిల్వచేస్తున్నారనీ, ధర పడిపోకుండా మిల్లర్లను అదుపు చేయాల్సింది ప్రభుత్వ యంత్రాంగమేనని అన్నారు. ఎరువులపై ప్రభుత్వం సబ్సిడీ తగ్గించివేయడంతో రెండేళ్ళక్రితం రూ॥4వందలు వున్న డి.ఎ.పి. బస్తా నేడు రూ॥1250కి చేరిందని, డీజిల్ రేటు పెరగడంతో ట్రాక్టర్, వరికోత యంత్రాల ఛార్జీలు భారీగా పెరిగి రైతుకి వ్యవసాయ అవసరాల ఖర్చు అసాధారణంగా పెరిగిందనీ, ఈ స్థితిలో ధాన్యానికి పుట్టిపై రూ॥6వేలకు రేటు దిగ్గోయటంతో రైతాంగం అప్పులపాలు కావాల్సి వస్తోందని అన్నారు.

రైతునాయకులు గంగలపూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ వర్షాలు పడటంతో వరికోత యంత్రాలకు 10రోజుల్లోనే రూ॥14వందల నుండి రూ॥18 వందలకి అద్దె పెంచేశారనీ, అధికార యంత్రాంగం తక్షణమే అద్దెను నియంత్రించి రైతుపై భారం పడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥వి.వి.రమణయ్య, ఆర్. సుబ్బరాయుడుతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు. ✡






పూసపాటిరేగ–మేడే బహిరంగసభలో కా॥గణేష్ పండా; విజయనగరం–మేడే సభలో కా॥బెహరా శంకర్రావు; అనకాపల్లి మేడే సభలో కా॥పి.కోటిరెడ్డి; చోడవరం మేడే సభలో కా॥ఆడారి అప్పారావు

**భూస్వామ్య...** (చివరి పేజీ నుండి)

చేరుకొన్నారు. ఈ ర్యాలీకి రెండు యూనియన్ల నాయకులు కామ్రేడ్స్ ప్రసాద్, మోహనరావు, సురేష్, జి.అసిరినాయుడు, సత్యనారాయణలు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమాలన్నింటా ఏఐఎఫ్‌టియు (న్యూ), సిపిఐ(ఎం–ఎల్) రాష్ట్ర కమిటీలు ప్రచురించిన కరపత్రాలను విస్తృతంగా కార్మికుల మధ్య పంపిణీచేశారు.

### కొమరాడ మండలం :

కొమరాడ మండలం **విక్రంపురం**లో ఏఐఎఫ్‌టియు (న్యూ) అనుబంధ భవన నిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో 150 మంది కార్మికుల సమక్షంలో మేడే జెండాను యూనియన్ గౌరవాధ్యక్షుడు కా॥మరిశర్ల సోమినాయుడు ఆవిష్కరించారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ కా॥సిరిపురపు విశ్వేశ్వరావు అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ పాల్గొని ప్రసంగిస్తూ మేడే పండుగ దినమో, శలవు దినమో కాదని, పోరాట దీక్షాదినమని మేడే ప్రాముఖ్యతను వివరించి, ప్రజాసమస్యల పరిష్కారంకోసం, నూతన ప్రజాస్వామిక విప్లవంకోసం కార్మిక–రైతాంగ ఐక్యత ఆవశ్యకత గురించి వివరించారు.

ఇంకా ఈ సభలో యూనియన్ అధ్యక్షులు కా॥లక్ష్మీనారాయణ, డిసిఎమ్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కలింగ మల్లిబాబు; రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ శ్రీనునాయుడు, భాస్కరరావు, బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడమండలం **కోటిపాం**లో కా॥ఎజ్జు గుంపుస్వామి మేడే అరుణపతాకను ఎగురవేసి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని ప్రతిన బూనారు. ఈ కార్యక్రమంలో వందమంది పాల్గొన్నారు.

**పెదశాఖ** గ్రామంలో వందమంది ప్రజల సమక్షంలో రైతుకూలీసంఘం నాయకులు కా॥మండంగి సోములు ఎర్రజెండాను ఎగురవేసి మేడే మృతవీరులకు జోహార్లర్పించారు.

### పార్వతీపురం:

పార్వతీపురం పట్టణంలో వరహాలగెడ్డ బడ్డీ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥వర్మ మేడే జెండానెగురవేశారు. బడ్డీ వ్యాపారులు 70మంది, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోరాడందే ఏ సమస్యా పరిష్కారంకాదని, సంఘటిత పోరాటాల ఆవశ్యకతను వక్తలు వివరించారు. స్థానిక రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కార్యాలయంవద్ద సంఘం జిల్లా నాయకులు కా॥బి.నర్సింగరావు ఎర్రజెండాను ఆవిష్కరించి అమరులందరకూ జోహార్లు చెప్పారు.

### విజయనగరం :

ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో విజయనగరం పరిసర ప్రాంతాల్లో మేడే జెండా ఆవిష్కరణలు చేపట్టారు. పారిశ్రామిక కేంద్రంలోని నారాయణి స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ వద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో ఎర్రజెండాను కా॥పైడిరాజు; జూట్‌మిల్ ఆటోస్టాండ్ వద్ద కా॥బి.శంకర్రావు; పెదమజ్జిపాలెం ఆటోస్టాండు వద్ద కా॥బి.పాపారావు; మెసానిక్ టెంపుల్ ఆటోస్టాండ్ వద్ద కా॥ఎన్.అప్పలరాజు; ఉస్మానియా పవర్స్ ఆటోస్టాండ్ వద్ద కా॥సోమునారాయణరావు; ఎన్‌సిఎస్ మల్టీప్లెక్స్ సెంటర్‌లో కా॥రెడ్డినారాయణరావు; దోమల మందిరం సెంటర్‌లో, గూడ్స్ ఆటోస్టాండ్ వద్ద, ఉడాకాలనీ ఫేజ్–2 ఆటోస్టాండ్ వద్ద కా॥బి.పాపారావు; గంట స్థంభం వద్ద కా॥ఎస్.నారాయణరావు; ఐడిఎస్ఎమ్‌టి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కా॥ఎమ్.సన్యాసిరావు ఎర్రజెండాలను ఆవిష్కరించారు. కొండగుంపాం గ్రామంలో మేడే జెండాను మాజీ ఎంపిపి పి.అక్కనాయుడు ఎగురవేశారు.

### ప్రదర్శన – బహిరంగసభ :

విజయనగరం పట్టణంలోని ఎన్‌సిఎస్‌ప్లెక్స్ ప్రక్కన ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో సంస్థ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥రెడ్డినారాయణరావు అధ్యక్షతన మేడే బహిరంగసభ ఉదయం 11గంటలకు జరిగింది. ఈసభలో సంస్థ రాష్ట్రనాయకులు కా॥బి.శంకర్రావు మాట్లాడుతూ కార్మికవర్గం తమ జీవన పరిస్థితుల మెరుగుదల, హక్కుల సాధనతోపాటు, ప్రస్తుత దోపిడీ వ్యవస్థ స్థానంలో శ్రామికవర్గ రాజ్యస్థాపన లక్ష్యంగా తన మిత్రవర్గమైన రైతాంగంతో భుజం భుజం కలిపి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో కా॥కోరాడ పైడిరాజు, ఎన్.అప్పలరాజురెడ్డి, ఎమ్.సాంబమూర్తి, బి.పాపారావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

సభ అనంతరం లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డు వరకు జరిగిన కార్మికప్రదర్శనలో వివిధ రంగాల కార్మికులు పాల్గొని తమ డిమాండ్లను ఎలుగెత్తి నినదించారు.

## విశాఖ జిల్లా

### అనకాపల్లి మండలం :

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రనాయకులు, విశాఖజిల్లా క్వారీక్రషర్ కార్మికసంఘం గౌరవాధ్యక్షులు కా॥ఆడారి అప్పారావు **బవులవాడ** గ్రామంలో క్వారీకార్మికుల సమక్షంలో ఎర్రజెండాను ఎగురవేసి మేడే ప్రాముఖ్యతను వివరించారు. కా॥చవితిన రమణ, చొప్ప అప్పారావు, రమణాజీ, ఈశ్వరరావు, దాడి జగ్గారావు తదితర కార్మిక యూనియన్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని నాయకత్వం వహించారు.

**గుంకలలోవ**లో క్వారీకార్మికులు, మహిళలు, యువకులు పెద్దపెట్టున మేడే అమరులకు జోహార్లు చెపుతుండగా కా॥ఆడారి అప్పారావు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కా॥గడిసుబ్బారావు, అమ్మన్న, పాపారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**డ్రిల్లర్స్ కాలనీ**లోని క్వారీ, క్రషర్ కార్మికసంఘ ఆవరణలో కార్మిక నాయకులు, ప్రజాకళాకారులు కా॥కె.రామారావు ఎర్రజెండాను ఎగురవేశారు. మేడే ప్రతిన తీసుకున్నారు. కా॥సాలాపురవణ, సూరిశెట్టి పెదనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**మామిడిపాలెం సెంటర్**లో క్వారీ కార్మికులు జెండాను ఆవిష్కరించుకున్నారు. తమ సమస్యల పరిష్కారానికి మేడే అమరుల స్ఫూర్తిగా పోరాటాన్ని ముందుకు సాగిస్తామని ప్రతిన బూనారు. ఈ కార్యక్రమంలో కా॥పెంటారావు, కా॥బాగాది రాము, ఆళ్ళ విష్ణుమూర్తి, వొండాన లక్ష్మణ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### క్వారీకార్మికుల ప్రదర్శన – సభ

క్వారీ కార్మికులు గుండాల సెంటర్ నుండి అనకాపల్లి పట్టణంలో ప్రదర్శన నిర్వహించి సభాస్థలి వైఎంసిఏ హాలుకు చేరుకున్నారు. కార్మికశ్రేయోభిలాషి, సీనియర్ న్యాయవాది శ్రీ శివయ్యగారు, స్ఫూర్తి అధ్యయనవేదిక కన్వీనర్ శివాజీగారు. ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥పి.కోటిరెడ్డి, ప్రజాకళాకారులు కా॥కె.రామారావు తదితరులు మాట్లాడుతూ ప్రజాజీవన సంక్షోభాన్ని, దేశాన్ని విదేశీ దోపిడీదారులకు తాకట్టుపెట్టిన పాలకుల నైజాన్ని వివరించి, కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా అన్ని రంగాలపీడిత ప్రజానీకం ఈ దోపిడీ పీడన అణచివేతల రద్దుకై మేడేనాడు స్ఫూర్తి పొందాలని, ప్రతిన తీసుకోవాలని పిలుపునిచ్చారు.

### చోడవరం మండలం :

ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో చోడవరం జవహర్ క్లబ్బు నందు మేడే సభ నిర్వహించారు. సంస్థ స్థానిక నాయకులు కా॥అయితిరెడ్డి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ఆడారి అప్పారావు, గురజాడ స్టడీ సర్కిల్ కన్వీనర్ కె.గౌరీశంకర్, స్త్రీవిముక్తి సంఘటన ప్రతినిధి లక్ష్మీకుమారి–ఈ సభలో ప్రసంగిస్తూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ ఈ పాలకులు కాలరాచివేస్తున్నారని, 8 గంటల పనికి బదులుగా 14–16 గంటల పనిచేయవలసి వస్తున్నదని, కోల్పోతున్న హక్కులను నిలుపుకోవటానికి, కార్మిక–కర్షక రాజ్యస్థాపన కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఇంకా, లక్కవరం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కా॥నక్క రామకృష్ణ, గవ్వ బాలాజి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు చోడవరం, లక్కవరం, వీరవల్లి అగ్రహారంలనుండి హాజరయ్యారు.

### వీరవల్లి అగ్రహారం:

భూమిహీన దళిత కూలీసంఘం ఆధ్వర్యంలో వీరవల్లి అగ్రహారంలో మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కా॥గడ్డెం దశరధ, ఈశ్వరరావు, పినపల్లి అప్పారావు తదితరులు పాల్గొని గ్రామీణ ప్రాంతంలో రైతు, కూలీలు, గ్రామీణ పేదలు–కార్మికులు చేయి చేయి కలిపి పోరాటాలు చేసినప్పుడే సమస్యలన్నీ పరిష్కారమౌతాయని పేర్కొన్నారు.

## శ్రీకాకుళం

**శ్రీకాకుళం** పట్టణంలోని చౌదరి సత్యనారాయణ కాలనీ, పురుషోత్తంనగర్(పి.ఎన్)కాలనీలలో మేడే సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 200మంది కాలనీవాసులు, కష్టజీవులు, చేతివృత్తులవారు ప్రదర్శన నిర్వహించి చౌదరి సత్యనారాయణకాలనీ సెంటర్‌లో సంఘం జిల్లా నాయకులు కా॥టి.అరుణ అధ్యక్షతన జెండా ఆవిష్కరణ జరుపుకున్నారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కా॥భానుమూర్తి ఎర్రజెండాను ఆవిష్కరించి కార్మిక–కర్షక–ఉద్యోగ–ఉపాధ్యాయ–విద్యార్థి –మేధావి ఐక్యత ప్రాధాన్యతను వివరించారు. భారత నాస్తిక సమాజం నాయకులు బి.జగన్నాధరావు, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥తవిటమ్మ తదితరులు ఈ సందర్భంగా మేడే అమరులకు నివాళులర్పిస్తూ మాట్లాడారు.

## తూర్పు గోదావరిజిల్లా

మండల కేంద్రమైన **కాట్రేనికోన**లో భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, కొబ్బరిదింపు–ఒలుపు కార్మికులు 200మంది నడుమ అరుణ పతాకాన్ని సీనియర్ కమ్యూనిస్టు కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు ఆవిష్కరించారు.

కాట్రేనికోన మండలం **కందికప్పు**లో ఆటో వర్కర్స్, జట్టు కార్మికులు పాల్గొనగా కా॥వనచర్ల సుబ్బారావు మేడే పతాకాన్ని ఎగురవేశారు.

**యు.కొత్తపల్లి మండలం–వాకతిప్ప**లో వందమందికి పైగా వ్యవసాయకూలీలు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో మేడే నిర్వహించుకున్నారు. సంఘం జిల్లా నాయకులు కా॥బలరాం మేడే జెండాను ఆవిష్కరించారు.

**రంగంపేట మండలం–కోటపాడు**లో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో 80 మంది రైతు, కూలీల నడుమ కా॥బలరాం మేడే జెండాను ఆవిష్కరించారు.

**కపిలేశ్వర మండలం–నేలటూరు**లో అమరవీరుల స్థూపంవద్ద నిర్వహించిన మేడేలో రైతు, కూలీలు, చేనేత కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**మంగపేట మండలం–మారేడుబాక** శ్రామిక మహిళా నగర్‌లో, కామ్రేడ్ గుబ్బల సుబ్బారావు స్మారక స్థూపంవద్ద మేడే జెండా ఆవిష్కరణలో కార్మికులు, వ్యవసాయకూలీలు 80మంది పాల్గొన్నారు. నేలటూరు, మారేడుబాకలలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర)జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ అమ్మాజీ ఎర్రజెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.

## పశ్చిమ గోదావరిజిల్లా

### దేవరపల్లి మండలం:

**లక్ష్మీపురం**లోని కా॥పోలుమాటి నాగేశ్వరరావు జెండా దిమ్మెవద్ద కార్మిక నాయకులు కా॥పోలుమాటి మంగరాజు మేడే పతాకాన్ని ఆవిష్కరించారు.

**దుద్దుకూరులో** డ్రిల్లర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కా॥గొల్లపల్లి భీమరాజు అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మేడే మృతవీరులకు జోహార్లర్పించారు.

**అర్లమ్మబాట**లోని కా॥మండ్ల సుబ్బారెడ్డి స్మారక జెండా దిమ్మెవద్ద యూనియన్ అధ్యక్షులు కా॥పోలుమాటి పెంటయ్య ఎర్రజెండా నెగురవేశారు.

### కొవ్వూరు మండలం:

**పంగిడి** గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఏఐఎఫ్‌టియు(న్యూ) జెండా దిమ్మెవద్ద యూనియన్ గౌరవాధ్యక్షుడు కా॥ఎమ్.ఎస్.నాగరాజు ఎర్రజెండా నెగురవేశారు. కొవ్వూరు మండలం గౌరీపట్నం ఏరియాలో క్వారీలు ఏర్పడిన తర్వాత 28 మంది కార్మికులు 'ప్రమాదాల' బారిన పడి మరణించిన విషయాన్ని గుర్తుచేసి యాజమాన్యంతో ఎగ్రిమెంట్లు ఎన్ని జరిగినా కార్మికులు పొందాల్సిన హక్కులలో ఇంకా ఎంతో వెనకబడివున్నామని, పనిగ్యారంటీ, పనిభద్రత, బీమా, తదితరాలకోసం పోరాటం సాగించాలని, కార్మికులు రాజకీయంగా చైతన్యవంతులై తమ సమస్యల పరిష్కారంతోపాటు రాజకీయార్థిక సవాళ్ళపై పోరాటం సాగించాలని, ఈనాడు కార్మికులపై మరింత బాధ్యత వున్నదని గుర్తుచేశారు.

### గోపాలపురం మండలం:

**దొండపూడి**లో 'దొండపూడి గిరిజన దళిత పేదల ఇళ్ళస్థలాల సాధన కమిటి' ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో 150 మంది కాలనీవాసులు పాల్గొన్నారు. ఏజన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥కుంజం రామారావు మేడే జెండా ఆవిష్కరణ చేశారు. కామ్రేడ్స్ రాజారత్నం, పూలపల్లి సుబ్బారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

### పోలవరం మండలం:

**మనుగోపాల**లో కామ్రేడ్ కారం పార్వతి స్థూపంవద్ద; **జిల్లేళ్ళగూడెం**లో ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కా॥సవలం రాంబాబు; **పెండ్రాల**లో నవయువసమాఖ్య నాయకులు కామ్రేడ్ స్వామి మేడే జెండాలను ఆవిష్కరించారు. 150 మంది పైగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**గుంజవరం**లో సీనియర్ కామ్రేడ్ కన్నయ్య మేడే జెండాను ఆవిష్కరించగా, కా॥కుంజం రామారావు మేడే ప్రాధాన్యతను వివరిస్తూ మాట్లాడారు.

**వెంకటరెడ్డిగూడెం**లో గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ పద్దం కృష్ణమూర్తి మేడేజెండాను ఆవిష్కరించారు.

## కృష్ణాజిల్లా

### బందరు:

సిపిఐ(ఎం.ఎల్), ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)ల ఆధ్వర్యంలో బందరు ఏరియాలో మేడే కార్యక్రమాలు ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగాయి. సిపిఐ(ఎం.ఎల్) ఆధ్వర్యంలో మచిలీపట్నం దిమ్మల సెంటర్‌లో కా॥బొడ్డు వెంకన్న; అరుణోదయ కాలనీలో కా॥పామర్తి అంజమ్మ; పెదకరగ్రహారం తరిమెల నాగిరెడ్డి స్థూపంవద్ద, ఇంగ్లీషుపాలెంలోని కా॥బోగాదుల రామారావు స్మారక గ్రంథాలయంవద్ద కా॥జె.జగన్; ఆదర్శనగర్‌లో కా॥తాళ్ళూరి రాణి; సుత్తీకొడవలి జెండాలను ఆవిష్కరించి మేడే మృతవీరులకు జోహార్లర్పించారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో పెదయాదర ఆటోస్టాండువద్ద కా॥పుట్టి ఫాన్సిస్, ప్రభుత్వ ఆసుపత్రి ఆటోస్టాండువద్ద కా॥మేడికొండూరి మధుకర్; పరాసుపేట ఆటోస్టాండువద్ద కా॥సియ్యాద్రి వెంకట్రావు; చిలకలపూడి ఇండస్ట్రియల్ రైస్‌మిల్ వర్కర్సు యూనియన్ సెంటర్‌లో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥యద్దనపూడి సోని; చిలకలపూడి సిడబ్ల్యుసి గోడౌన్ ముఠా యూనియన్ సెంటర్‌లో యూనియన్ కార్యదర్శి కా॥పరసా శ్రీనివాసరావు; గిలకల దిండి ఆటోస్టాండువద్ద కా॥చింతా రాము; కోనేరు సెంటర్ వాణీస్వీట్ షాపువద్దగల ఆటోస్టాండ్ సెంటర్‌లో కా॥బచ్చుల హరీష్; కోనేరు సెంటర్ ఆటోస్టాండువద్ద కా॥మయూరి శ్రీను; కోటవారి తుళ్ళసెంటర్ ఆటోస్టాండువద్ద కా॥కోలపల్లి సురేష్; నాగపోతరావు సెంటర్ ఆటోస్టాండువద్ద కా॥గూడపాటి సురేంద్ర; రాజుపేట ఆంధ్రా హాస్పిటల్ ఆటోస్టాండ్‌వద్ద కా॥పాండ్యన్; అభ్యుదయ టాటా మేజిక్ వర్కర్స్ యూనియన్ సెంటర్‌లో, బస్టాండుసెంటర్‌లోని ఆటోస్టాండువద్ద కా॥యద్దనపూడి సోని; బేబీసెంటర్ ఆటోస్టాండువద్ద కా॥ఆవుల మధు; రైతుబజారు ముఠా యూనియన్ సెంటర్‌లో కా॥బెజవాడ శ్రీనివాసరావు; రైతుబజారు సంక్షేమసంఘం జెండాదిమ్మవద్ద కా॥ముచ్చు సుధాకరరావు; జడ్‌పి సెంటర్‌లోని టుటవున్ ముఠా యూనియన్ కార్యాలయంవద్ద కా॥కాగిత నాగేశ్వరరావు మేడే జెండాలు ఆవిష్కరించి అమరుల ఆశయాన్ని ముందుకు కొనసాగిస్తామని ప్రతిన బూనారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో **గరాల దిబ్బ**లో కా॥వడుగు శివనాగరాజు; **పెదయాదర దళితవాడ**లో కా॥లింగం ప్రభాకరరావు; **పెదయాదర కొత్తకాలనీ**లో కా॥సుబ్బారావు; **చిన్నాపురం** గుడిసెంటర్‌లో



మంగళగిరిలో జెండా ఆవిష్కరణ–జె.సుబ్బారావు; బందరులో జెండా ఆవిష్కరణ–కా॥వై.సోని; అనంతపురంలో జెండా ఆవిష్కరణ కా॥సి.పెద్దన్న; పిడుగురాళ్ళలో జెండా ఆవిష్కరణ–కా॥జి.విజయకుమార్

కా॥కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు; **చిన్నాపురం అంబేద్కర్ సెంటర్**లో కా॥గుమ్మడి కృష్ణ; **కృష్ణానగర్**లో కా॥ధనికొండ కోటేశ్వరమ్మ; **గుండుపాలెం**లో కా॥యార్లగడ్డ శ్రీనివాసరావు; **గుండుపాలెం దళితవాడ**లో కా॥ఓగిరాల శ్రీనివాసరావు; **వల్లెతుమ్మలపాలెం**లో కా॥మైలా పోతురాజు ఎర్రజెండాలు ఆవిష్కరించి అమరుల ఆశయ సాధనకు పోరాడుతామని ప్రతిన బూనారు.

ఈ సందర్భంగా కార్మికులు, కష్టజీవులనుద్దేశించి కా॥సోని ప్రసంగిస్తూ ఉపాధి అవకాశాలు నానాటికీ తరిగిపోతున్నాయని, కార్మికులకు కనీస పనిభద్రతలేదని, 8 గంటల పనిదినానికి బదులుగా రోజుకి 12–14 గంటలపైగా పని చేయాల్సిన స్థితిలో కార్మికులు దారుణమైన శ్రమదోపిడీకి గురౌతున్నారని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కూడా పాలకులు కాలరాచి వేస్తున్నారని; మరోవైపున వ్యవసాయ సంక్షోభం కారణంగా సన్న, చిన్నకారు – ముఖ్యంగా కౌలురైతాంగం, వ్యవసాయకూలీలు తీవ్ర సమస్యలనెదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో కార్మికులు, రైతాంగం, సమస్త పీడిత ప్రజానీకం దోపిడీ అణచివేతలపై సమరశంఖం పూరించటానికి ప్రతిన దీసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్మికవాడల్లో, కష్టజీవుల నివాస ప్రాంతాల్లో, ఆటోస్టాండులవద్ద, గ్రామాల్లో జెండాదిమ్మెలవద్ద ఎర్రజెండాలు, తోరణాలతో అలంకరించి; ప్రజా కళాకారులు, బాలకళాకారుల నృత్యాలు, పాటలతో మేడే కార్యక్రమాలను స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. మేడేకు ముందుగా మచిలీపట్నం ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించుకొని మేడే నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలను రూపొందించుకొని మేడే జెండా ఆవిష్కరణలను విజయవంతంగా నిర్వహించారు.

**చల్లపల్లి:**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)ఆధ్వర్యంలో చల్లపల్లిలో మేడే జెండా ఆవిష్కరణలు పలుకూడళ్ళలో జరిగాయి. **కోమలానగర్ సెంటర్**లో సంఘం నాయకులు కా॥రావి సుబ్బారావు; **చల్లపల్లి నారాయణరావు నగర్**లో కా॥కట్టా వెంకటేశ్వరరావు; **శివరామదుర్గాపురం సెంటర్**లో సనకా నారాయణరావు; **ఘంటసాల మండలం వి.రుద్రవరం దళితవాడ**లో కా॥చంద్ర రాఘవులు ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ఈపూరి రాంబాబు మాట్లాడుతూ ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి, పండిన పంటకు గిట్టుబాటు ధరలేక, చేసిన అప్పుతీర్చలేక నిస్సహాయస్థితిలో రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని; గ్రామాలలో ఉపాధి కరవై పట్టణాలకు వలసలు పెరిగిపోతోన్న ఈ పరిస్థితుల్లో మేడే స్ఫూర్తిగా రైతాంగం, కార్మికులు సమైక్య పోరాటాలను మరింత ముందుకు సాగించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కా॥మునిపల్లె శ్రీనివాసరావు, కుంభా రామకృష్ణ, పాగోలు రాజు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**నాగాయలంక:**

నాగాయలంక ఏటిఒడ్డున రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)కృష్ణాజిల్లా కోశాధికారి కా॥తలశిల లీలా మనోహర్; అంబేద్కర్‌నగర్ దళిత వాడలో కా॥శిరివెళ్ళ సుబ్బారావు; ఏడవవార్డు దళితవాడలో కా॥బట్టు రమేష్‌లు ఎర్రజెండాలను ఆవిష్కరించి మేడే అమరులకు నివాళు లర్పించారు. పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగి పోతున్న నేటి పరిస్థితుల్లో పెట్టుబడిదారీ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సమైక్య పోరాట ఆవశ్యకతను కా॥లీలా మనోహర్ వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కా॥బసవదేవుడు, తుఫానుబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు:**

కంకిపాడు మండలం, ప్రొద్దుటూరు గ్రామంలోని అమరుల స్థూపంవద్ద సీనియర్ కామ్రేడ్ కా॥డాకారపు నాగేశ్వరరావు మేడే జెండాను ఆవిష్కరించారు. కా॥ఈడా అక్కతాతయ్య అమరుల స్థూపానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామ మాజీ సర్పంచి, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కోశాధికారి కా॥భీమవరపు గురవారెడ్డి మేడే ప్రాధాన్యతను వివరిస్తూ, వివిధ ప్రపంచ దేశాలలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ఆయా దేశాలలోని సామ్రాజ్యవాద తొత్తులైన నిరంకుశ ప్రభుత్వాధినేతలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలను పేర్కొన్నారు. అనంతరం ప్రదర్శనగా గ్రామసెంటర్‌లోని జెండా దిమ్మెవద్దకు చేరుకున్నారు. కా॥ఈడా కోటయ్య ఇక్కడ జెండా ఆవిష్కరించగా కా॥చింతయ్య, శ్రీనివాసరావులు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత ఆవశ్యకతను గురించి మాట్లాడారు. గవళ్ళ బజారులో పాటిమీద కా॥నన్నాల తిరుపతయ్య ఎర్రజెండాను ఆవిష్కరించగా కామ్రేడ్స్ బొట్టా సాంబశివారెడ్డి, వంగారామిరెడ్డిలు మాట్లాడుతూ రైతాంగ సంక్షోభ నేపథ్యంలో ఐక్యఉద్యమావశ్యకతను గురించి ప్రసంగించారు. గ్రామంలోని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కార్యాలయం కమ్యూనిస్టు వెంకటరెడ్డి భవన్‌కు నినాదాలతో ఊరేగింపుగా చేరుకొన్నారు. ఈ కార్యక్రమానికి రైతుకూలీసంఘం నాయకులు కామ్రేడ్ యు. వీరబాబు; ఈడా క్రిష్ణమూర్తిలు నాయకత్వం వహించారు.

**నందిగామ:**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో నందిగామలో పలుసెంటర్లలో జెండాల ఆవిష్కరణలు నిర్వహించారు. **కమ్మవారిపాలెం**లో చంద్ర శివయ్య స్థూపంవద్ద సీనియర్ కమ్యూనిస్టు కామ్రేడ్ కా॥రావెళ్ళ కళింగరావు; **కాంద్రపాడు**లో రామిరెడ్డి; **పొక్కునూరు**లో కా॥అందుగుల పుల్లయ్య; **కొడవటిగల్లు**లో కా॥వాసిరెడ్డి నాగేశ్వరరావులు ఎర్రజెండాలను ఎగురవేసి నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకోసం పోరాటం సాగించాలన్నారు. ఈ కార్యక్రమాలలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ఎమ్.రాంబాబు; యాదల నాగేశ్వరరావు, అంగెల కాంతయ్య, ఆనందరావు, చిరుమామిళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**విజయవాడ:**

స్థానిక గిరిపురంలోని తరిమెల నాగిరెడ్డి భవనంవద్ద సీనియర్ కామ్రేడ్ కా॥మదార్ పార్టీ జెండాను ఆవిష్కరించగా కొత్తపేట, టైలర్‌పేటల్లో కా॥జి.ధర్మారావు; కృష్ణలంక సత్యంగారి హోటల్ సెంటర్‌లో, గాస్పిల్ హాల్‌సెంటర్‌లో కా॥జె.అబ్రహాం; అరుల్ నగర్ సెంటర్‌లో కా॥వై.శ్రీనివాసరావు; నిడమానూరు ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్ సెంటర్‌తో కా॥జీవరత్నంలు మేడా జెండాల నావిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ సెంటర్‌లలో జరిగిన గ్రూపు మీటింగ్‌లలో ఏఐఎఫ్‌టియు (న్యూ) నగర నాయకులు కా॥వి.లక్ష్మణరావు; ఓపిడిఆర్ రాష్ట్రఅధ్యక్షులు కామ్రేడ్ కె.ఏసు తదితరులు మాట్లాడుతూ ఉపాధికొరత ప్రధాన సమస్యకాగా, పనిచేస్తున్న వారికి కూడా కనీస వేతనాలు లభ్యంకాక, పనిభారాలు, పని ప్రదేశాల్లో ప్రమాదాలతో; నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారాలతో కార్మికులు, కష్టజీవులు సమస్యల సుడిగుండంలో చిక్కుకొని వున్నారని, ఈ సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమన్న మేడే స్ఫూర్తిని అందిస్తూ మాట్లాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ సహదేవుడు, శంకర్, నరసింహారావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రదర్శన – బహిరంగసభ :**

మేడేను పురస్కరించుకొని విజయవాడ వన్‌టౌన్ పాతబస్తీలోని టైలర్‌పేటలో సిపిఐ(ఎం.ఎల్) అమరుల స్థూపంవద్ద కా॥గోపిశెట్టి ధర్మారావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడనుండి ప్రదర్శనగా చిట్టినగర్, వాగుసెంటర్, శ్రీనివాసమహల్‌ల మీదుగా గణపతిరావువీధి, కృష్ణవేణి క్లాత్‌మార్కెట్ మీదుగా గొల్లపాలెం గట్టునుండి తిరిగి టైలర్‌పేట వరకు మేడే నినాదాలు, ఎర్రజెండాలతో వూరేగింపు జరిగింది.

మేడే నాడు సాయంత్రం 7 గం॥లకు గొల్లపాలెం గట్టు జోడుబొమ్మల వద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో బహిరంగసభ జరిగింది. ఈ బహిరంగసభకు కా॥గోపిశెట్టి ఆదిశేషు అధ్యక్షత వహించారు. ఈ సభలో జనసాహితి రాష్ట్రకార్యదర్శి కా॥దివికుమార్ మాట్లాడుతూ ఎర్రజెండా ఆవిర్భావాన్ని, సుత్తికొడవలి చిహ్నంయొక్క ప్రాధాన్యాన్ని వివరిస్తూ దేశాన్ని, దేశవనరులను సామ్రాజ్యవాద ప్రభువులకు తాకట్టుపెడ్తున్న దళారీ పాలకుల దోపిడీ విధానాలపై కార్మికులు, రైతాంగం, మేధావులు, విద్యార్థి యువత సమైక్యంగా పోరాడాలన్నారు. శక్తిసామర్థ్యాలు గల యువతను ప్రక్కదోవ పట్టించే పాలకవర్గ ఉద్దేశపూరిత కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సభలో ఇంకా ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కా॥ఏసు; కా॥అబ్రహాం, కా॥లక్ష్మణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# గుంటూరుజిల్లా

**పిడుగురాళ్ళ:**

పిడుగురాళ్ళ పట్టణంలో ప్రధానంగా సున్నంబట్టీలు, మిల్లులు, క్వారీలు తదితర పని ప్రదేశాలలో పదివేలమంది పైగా కార్మికులు ఏవిధమైన భద్రతా ప్రమాణాలూ పాటించబడకుండా, అనునిత్యం ప్రమాదాలనడుమ అత్యధిక పనిభారంతో, చాలీచాలని వేతనాలతో, అపరిశుభ్ర వాతావరణంలో, దుర్భర పరిస్థితుల నడుమ శ్రమదోపిడీకి గురిచేయబడుతున్నారు. 127 సం॥ల క్రితమే 8 గంటల పనిదినంకోసం పోరాటం చేయగా, పిడుగురాళ్ళ సున్నం మిల్లు కార్మికులకు ఈనాటికీ '24 గంటల పనిదినం' అమలుచేయబడుతోంది!

అంతర్జాతీయ శ్రామికవర్గ దీక్షాదినం మేడే సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)ల ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ పట్టణంలో వివిధ కార్మికుల కూడళ్ళలో అరుణపతాకావిష్కరణలు స్ఫూర్తిదాయకంగా జరిగాయి.

**ప్రదర్శన – బహిరంగసభ :**

పిడుగురాళ్ళ ఏడుకొట్ల సెంటర్‌లో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥రాంబాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ 127వ మేడే నిర్వహించుకుంటున్నామని చెపుతూ ఆనాడు పనిగంటల తగ్గింపుకోసం కార్మికవర్గం చేసిన వీరోచిత పోరాటాల ఫలితంగానే 8 గంటల పనిదినం సాధించు కోగలిగారని, అలాంటి ఎన్నో హక్కులను ఈనాడు దోపిడీపాలకులు హరించివేస్తూ మరింత పనిభారాన్ని పెంచి, శ్రమదోపిడీ సాగిస్తున్నారని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలతో వెట్టిచాకిరీ చేయించు కుంటున్నారని, ఈ నేపథ్యంలో కార్మికులు, రైతాంగం శ్రమజీవులంతా ఐక్యంగా దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పూనిక వహించాలని పిలుపునిచ్చారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి, కా॥పి.కోటేశ్వరరావు, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ఎం.నిర్మల ఇంకా ఇతర యూనియన్‌ల నాయకులు ఈ సభలో పాల్గొని ప్రసంగించారు.

మేడే నాడు తొలుత స్థానిక లెనిన్‌నగర్‌లో కా॥నీలాద్రి రాంబాబు; సున్నం బట్టీల వర్కర్స్ యూనియన్ సెంటర్‌లో కా॥నాయని వెంకటరావు; సున్నం మిల్లుల వర్కర్స్ యూనియన్ సెంటర్‌లో కా॥షేక్ మౌలాలి; కా॥తరిమెల నాగిరెడ్డి కాలనీలో కా॥ఎమ్. సత్యనారాయణ; కా॥ విశ్వమోహనరెడ్డినగర్‌లో కా॥మోహన్; పిడుగురాళ్ళ పట్టణ ముఠావర్కర్స్ యూనియన్ సెంటర్‌లో కా॥షేక్ హుస్సేన్; ఎరువుల కొట్ల హమాలీ యూనియన్‌సెంటర్‌లో కా॥మారెబోయిన శ్రీను; సిమెంటుకొట్ల హమాలీల యూనియన్ సెంటర్‌లో కా॥మస్తాన్‌వలి; బల్లరిక్షావర్కర్స్ యూనియన్ సెంటర్‌లో కా॥మౌలాలి; చైతన్య బాయిల్డ్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ సెంటర్‌లో కా॥ఎలిమయ్య; జానపాడు గేటువద్ద నున్న ఏఐఎఫ్‌టియు(న్యూ) కార్యాలయం సెంటర్‌లో కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి; పోలీసుస్టేషన్ కూడలిలో కా॥గుర్రం విజయకుమార్‌లు అరుణ పతాకాలను ఆవిష్కరించి మేడే పోరాట స్ఫూర్తిని చాటి చెప్పారు. ఒక ప్రదర్శనగా సాగిన ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలన్నింటా ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక సంఘాల బాధ్యులు, కార్యకర్తలు, రైతుకూలీలు; శ్రామిక ప్రజానీకంతో గొంతు కలుపుతూ ప్రజా కళాకారులు పాల్గొని ఉత్తేజపూరితంగా నిర్వహించారు.

**కోనంకి:**

పిడుగురాళ్ళ శివారు కోనంకి గ్రామంలోని యానాదుల కాలనీలో, కాలనీ అభివృద్ధికమిటి సభ్యులు కా॥కృష్ణారావు ఎర్రజెండాను ఆవిష్కరించగా హనుమంతరావు, శ్రీను తదితరులు పాల్గొని నిర్వహించారు. కాలనీ అభివృద్ధికోసం గుడిశెవాసులంతా ఐక్యంగా వుండి, సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

**బ్రాహ్మణపల్లి:**

మేడేని పురస్కరించుకొని మే 4వ తేదీన బ్రాహ్మణపల్లి శ్రామిక ప్రజల కాలనీలో అరుణపతాకాన్ని అభివృద్ధికమిటి నాయకులు కా॥ఎమ్.గోపి ఆవిష్కరించగా వెంకటేశ్వర్లు, గురవమ్మ తదితరులు పాల్గొని నిర్వహించారు. పోరాడందే ఏ సమస్యా పరిష్కారంకాదని, కాలనీలో మౌలిక వసతుల కల్పనకోసం అందరూ ఐక్యంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు.

**కారంపూడి:**

ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ల ఆధ్వర్యంలో కారంపూడి పోతురాజు గుట్టకాలనీలో, కాలనీ అభివృద్ధికమిటి నాయకులు కా॥జానీ; చైతన్య ఇటుక బట్టీల యూనియన్ సెంటర్‌లో కా॥కుంభా సుబ్బారావు; కారంపూడి బస్టాండు సెంటర్‌లో కా॥జక్కంపూడి పద్మ–ఎర్రజెండాలనావిష్కరించి మేడే మృతవీరులకు నివాళులర్పించారు. కా॥పద్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటుకబట్టీలు, రైసుమిల్లులలో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి తరిగిపోతూ, పెరుగుతున్న ధరలకు, వారి వేతనాలకు ఏమాత్రం పొంతన లేక, అత్యంత కష్టభరితమైన జీవితాలను వెళ్ళదీస్తున్నారని, కార్మికవర్గం–శ్రమజీవులంతా ఐక్యమై పోరాటాలను తీవ్రం చేసేందుకు మేడే నాడు దీక్ష వహించాలన్నారు.

**మంగళగిరి:**

సిపిఐ(ఎం.ఎల్), ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో మంగళగిరిలో పలుశ్రామిక వాడలలో ఎర్రజెండాల ఆవిష్కరణలు జరిగాయి. శ్రామికనగర్‌లో సిపిఐ(ఎం.ఎల్) దిమ్మెవద్ద మరియు పాతబస్టాండ్ సెంటర్‌లో సీనియర్ కామ్రేడ్ కా॥జగ్గారపు సుబ్బారావు; భగత్‌సింగ్‌నగర్‌లో కా॥టి. శివయ్య; లక్ష్మీనరసింహస్వామి కాలనీలో భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షులు కా॥కాశిన కొండలు; బ్రహ్మానందపురం సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికసంఘ నాయకులు కా॥ఓబులేసు అరుణపతాకాల నావిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥కొర్రపాటి ఆదినారాయణ మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలోని చేనేత కార్మికుల దురవస్థను, భవన నిర్మాణ కార్మికుల దుర్భర పనిపరిస్థితులను వివరిస్తూ వ్యవసాయకూలీలతో కలగలసి శ్రామికులు, రైతాంగం, కష్టజీవులంతా దోపిడీ పాలకులపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**ప్రదర్శన :**

అనంతరం 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' 'మేడే అమరులకు జోహార్లంటూ' నినదాలతో, ఎర్రజెండాలతో హుస్సేన్‌కట్టసెంటర్‌నుండి పాతబస్టాండు సెంటర్‌వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥అబ్రహాం, వెంకట్రావు, రాచకొండ సాంబశివరావు; ప్రజాతంత్ర ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, కృష్ణ; ఎన్‌వైయస్ జిల్లా నాయకులు దండా ప్రసాద్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**చెన్నుపల్లివారిపాలెం:**

రేపల్లె మండలం, చెన్నుపల్లివారిపాలెం బస్టాండు సెంటర్‌లో గ్రామ పెద్దలు కా॥ముత్తిరెడ్డి వెంకట్రామయ్య నిర్వహణలో సిపిఐ(ఎం.ఎల్) గుంటూరుజిల్లా కార్యదర్శి కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు అరుణపతాకాన్ని ఆవిష్కరించి మేడే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కా॥ధూళిపాళ్ళ నరసింహారావు, కా॥రాజేశ్వరి, కా॥నాగబసవయ్య కా॥కళ్యాణం సాంబయ్య, డా॥సిహెచ్ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

**రేపల్లె:**

రేపల్లె ఓల్డుటౌన్ అంకమ్మచెట్టు సెంటర్‌లో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥దొంతు శ్రీనివాసరావు ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు, కా॥రామభద్రరావు తదితరులు పాల్గొన్నారు.






రేపల్లెలో జెండా ఆవిష్కరణ-కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు, విజయవాడ మేడే బహిరంగసభలో కా॥కె.ఏసు; శ్రీకాకుళం మేడే జెండా ఆవిష్కరణ-ప్రసంగిస్తున్న బి.జగన్నాధరావు; కోటిపాంలో జెండా ఆవిష్కరణ ఎజ్జుగుంపు స్వామి

**పేటేరు:**

పేటేరు ఆంజనేయస్వామి కాలనీలో ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం నాయకులు కా॥వెంకట్రావు నిర్వహణలో కా॥ముత్తిరెడ్డి శ్రీరాములు ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కా॥జ్ఞానం భాస్కర్, కా॥రాజేశ్వరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొని చేనేత కార్మికుల స్థితిగతులు, పోరాట ఆవశ్యకతను వివరించారు.

**గుంటూరు:**

ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక యూనియన్‌ల ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో మేడే జెండా ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకంగా జరిగాయి. ఉదయం 6 గంటలకే లింగాయపాలెం శ్రామికనగర్‌నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రదర్శనగా సాగుతూ వివిధ కూడల్లో జెండా ఆవిష్కరణలు చేస్తూ ముందుకు సాగింది. లింగాయపాలెం అనంతరం చుట్టుగుంట సెంటర్‌లోని కా॥పున్నయ్య, శంకర్‌ల భవన్‌వద్ద; వైజాగ్‌స్టీల్స్, భారతస్టీల్స్, మిర్చియార్డు ముఠావర్కర్స్ యూనియన్, బల్లరిక్షా తోలకం ముఠావర్కర్స్ యూనియన్, నైటు దిగుమతి ముఠావర్కర్స్ యూనియన్, జూటుమిల్లు, సంగడిగుంట, యతిరాజనగర్, కెవిపికాలని, గోయల్‌కాలని, క్రిష్ణబాబు కాలని, కొత్తకాలనీ సెంటర్లలో శ్రామిక ప్రజల సమక్షంలో ఉత్తేజపూరిత వాతావరణంలో ఎర్రజెండాలు ఆవిష్కరించారు.

పల్నాడు బస్టాండు సెంటర్‌లోని 'ది గుంటూరు మిర్చియార్డు ఆటోడ్రైవర్స్ యూనియన్' అధ్యక్షులు కా॥అప్పారావు ఎర్రజెండాను ఆవిష్కరించగా, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥దేవరశెట్టి వెంకటస్వామి తదితరులు మాట్లాడారు. వక్తలు తమ ప్రసంగాల్లో అసంఘటిత రంగంలోనున్న వేలాది కార్మికుల జీవితాలు మరింత దుర్భరంగా వున్నాయని, మిర్చియార్డు కార్మికులు, ఆటోడ్రైవర్లు, వివిధ చేతివృత్తుల పనివారు, రిక్షా కార్మికులు తమ తమ జీవన పరిస్థితుల మెరుగుదలకోసం సంఘటిత పోరాటాలకు దీక్ష వహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడు యూనియన్ల నాయకులతోపాటు కామ్రేడ్స్ బి.రంగస్వామి, యు.కృష్ణ, చిన్న, శుక్ల, మల్లీశ్వరి, చంద్రం, మురళి, మల్లి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాకళాకారులు అమరులపై, ప్రజాసమస్యలపై పాటలు పాడారు.

**ప్రదర్శన – బహిరంగసభ :**

ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో మేడే బహిరంగసభ నిర్వహించారు. సభకు ముందుగా కష్టజీవులు, శ్రామిక మహిళలతో గుంటూరు మిర్చియార్డు నుండి చుట్టుగుంట వరకు ఎర్రజెండాలు, బ్యానర్లు, నినాదాలతో ఉత్తేజపూరితంగా ప్రదర్శన నిర్వహించారు.

ఈ మేడే బహిరంగసభకు సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కామ్రేడ్ దేవరశెట్టి వెంకటస్వామి అధ్యక్షత వహించగా, సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥పి. జస్వంతరావు; ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డివిఎన్ స్వామి; రైతుకూలీసంఘం(ఆం.ప్ర)జిల్లా కార్యదర్శి కా॥ఉల్లిగడ్డల నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

కా॥జస్వంతరావు తన ఉపన్యాసంలో మేడేను ఒక లాంఛనంగానూ, వేడుకగానూ దిగజారుస్తున్న పాలకవర్గ సంస్కృతిని వ్యతిరేకించారు. శ్రామికుల పోరాట దీక్షాదినంగా మేడే ప్రాముఖ్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో భూమిసమస్యపై, భూస్వామ్యదోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా వ్యవసాయకూలీలు, గ్రామీణ పేదలు, సన్న చిన్నకారు రైతులు, కౌలురైతాంగం తదితర సమస్త పీడిత ప్రజానీకానికి నాయకత్వం వహించి ముందుండి నడిపించవలసిన అగ్రగామిశక్తిగా కార్మికవర్గం తన వర్గ రాజకీయాలతో సాయుధం కావాలని కా॥జస్వంతరావు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥రాగి సుబ్బారావు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర)జిల్లా నాయకులు కా॥దానబోయిన భాస్కర్, కా॥ముసలయ్య, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥మల్లీశ్వరి; శ్రామికనగర్ ఇళ్ళ స్థలాల పోరాట కమిటి నాయకులు కా॥బి.రంగస్వామి, యు.కృష్ణ, ప్రజా కళాకారులు కామ్రేడ్ కాట్రగడ్డ హనుమంతరావు తదితరులు ప్రసంగిచారు. ఈ సభలో ప్రజాకళాకారుల నృత్యరూపకాలు, పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

**రెంటచింతల :**

ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ల ఆధ్వర్యంలో ఉత్సాహపూరిత వాతావరణంలో కార్మికులు, రైతుకూలీలు మేడే జెండా ఆవిష్కరణల కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రదర్శన – బహిరంగసభ :**

తొలుత **రెంటచింతల** గ్రామంలో 400 మందితో ఎర్రజెండాలు, బ్యానర్లు, మిన్నంటే నినాదాలతో ప్రదర్శన నిర్వహించిన అనంతరం స్థానిక రైతుకూలీ సంఘం కార్యాలయంవద్ద-రెంటచింతల రిటైర్డ్ టీచర్, వయోవృద్ధులు, సీనియర్ కమ్యూనిస్టు కా॥వి. నాగేశ్వరరావు ఎర్రజెండాను ఎగురవేశారు. నిజాయితీగా, విలువలతో కమ్యూనిస్టులు ప్రజాపక్షాన పనిచేయాలని, దోపిడీదారులకు అప్పుడే వెరపు వుంటుందని పేర్కొంటూ, ఈ జెండాను ఎగురవేస్తున్నందుకు గర్వపడుతున్నా నన్నారు.

అనంతరం కార్యాలయం వద్దనే జరిగిన సభలో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి; సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కా॥సురభి అమరలింగం; కా॥బుట్టి మరియదాసు, వరప్రసాద్, సత్తెయ్య, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥పాటిబండ్ల కోటేశ్వరరావు తదితరులు ప్రసంగిస్తూ రెంటచింతల ప్రాంతంలో నివాసస్థలాల కొరకు, వివిధ ప్రాంతాల్లో భూముల సాధన కొరకు సాగుతున్న పోరాటాలన్నీ సమైక్యంగా కార్మిక-కర్షక మైత్రితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

**తుమృకోట** గ్రామంలో మూడు సెంటర్లలో; **పాలువాయి జంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం, పాలువాయిగేటు** గ్రామాల సెంటర్లలోని జెండాదిమ్మల వద్ద తోరణాలతో అలంకరించి మేడే జెండాలను ఆవిష్కరించారు.

**మంచికల్లు** గ్రామంలో గత సం॥ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో నిర్మితమైన కా॥తరిమెల నాగిరెడ్డినగర్‌లో మేడేని 10-5-13న ఘనంగా నిర్వహించారు. కాలనీలోని ప్రతిఇంటిపై ఎర్రజెండాను ఎగురవేసి, కాలనీని ఎర్రతోరణాలతో ఎరుపుమయం చేశారు. కోలాటబృందాలు, బ్యాండువాయుద్యకారులు, డప్పుల కళాకారులు తమ కళారూపాలు, సాంస్కృతిక విన్యాసాలతో, పాటలతో వాతావరణాన్ని మరింత స్ఫూర్తిదాయకంగా మలిచారు. కా॥బుట్టి మరియదాసు, కా॥సురభి అమరలింగం రెండు సెంటర్లలో జెండా ఆవిష్కరణలు చేశారు. అనంతరం జరిగిన మేడే సభలో కామ్రేడ్స్ రాము, సుందర్రావు, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు ఉపన్యసించారు. ప్రజా కళాకారులు అమరులపై, ప్రజాసమస్యలపై పాటలు పాడారు.

**దుర్గి :**

**దుర్గి** మండల కేంద్రంలోనూ; **ఓబులేసునిపల్లి** గ్రామంలోనూ; **వనం**లోనూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఇటుకబట్టీ కార్మికులు ఏర్పరచుకున్న ఏఐఎఫ్‌టియు దిమ్మె వద్ద కా॥యస్.లక్ష్మారెడ్డి మేడే జెండాను ఎగురవేసిన అనంతరం దుర్గిలోని ఆంధ్రబ్యాంక్ సెంటర్ నుండి 200మందితో మేడే ప్రదర్శన ఉత్తేజకరంగా సాగింది. దుర్గి బస్టాండు సెంటర్‌లో మేడే జెండాను కా॥పాటిబండ్ల కోటేశ్వరరావు ఆవిష్కరించారు. పగిడిపల్లి శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పొన్నెకల్లు :**

తాటికొండ మండలం **పొన్నెకల్లు** గ్రామంలో అమరుడు కా॥గుర్రం కోటయ్య విగ్రహం వద్ద – కా॥గుర్రం కోటయ్య స్మారక కమిటి ప్రతినిధి కా॥ప్రసాదు ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టజీవులకు అన్నివిధాల అండదండైన ఎర్రజెండాను తాను ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు.

పొన్నెకల్లు గ్రామ పోరంబోకు స్థలంలో ఇండ్ల స్థలాలను నిలబెట్టుకొనేందుకు దీర్ఘకాలంగా ఆందోళన సాగిస్తున్న దళితులు, పేదలు తమ నివాసాల వద్ద ఎర్రజెండాను ఎగురవేసుకున్నారు. కా॥పొదిలి వెంకటరావు, అర్జున్, శ్రీను తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

**నిజాంపట్నం :**

మండల కేంద్రమైన నిజాంపట్నం బస్టాండు సెంటర్‌లో ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ బోటు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ జరిగింది. యూనియన్ అధ్యక్షుడు కామ్రేడ్ మోపిదేవి శ్రీరాములు జెండా ఆవిష్కరించగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు నాయకులు కామ్రేడ్స్ శోభ, నాగరాజు, ఈశ్వరరావు, పడవతయారీ కార్మికులు, ఆటోకార్మికులు పాల్గొన్నారు. తీరప్రాంతంలో సాంప్రదాయ మత్స్యకారుల జీవితాలపై ముంచుకొస్తున్న పెనుముప్పును, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను వక్తలు వివరించి పోరాట ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

## ప్రకాశం జిల్లా

**ఒంగోలు :**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలులో మేడే జెండా ఆవిష్కరణలు జరిపారు.

ఈమనిపాలెం సిపిఐ(ఎం-ఎల్) కార్యాలయం వద్ద పార్టీ జిల్లానాయకులు కా॥ఎన్.లలితకుమారి; చర్చిసెంటర్‌లో ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కా॥ఐ. విజయసారధి; ఆర్‌టిసి డిపోలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రనాయకులు కా॥ఎమ్.ఎన్.శాయి-అరుణ పతాకాలను ఆవిష్కరించి కార్మికవర్గం, పీడిత ప్రజానీకం ముందున్న కర్తవ్యాలను వివరించారు.

ఇంకా ఈ కార్యక్రమాలలో టెలికం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కా॥జె.విజయకుమార్; కా॥కత్తిపేరయ్య, కా॥కె.కోటేశ్వరరావు, కా॥పి. కోటేశ్వరరావు, కా॥శ్రీరాములు, ఉమామహేశ్వరరావు, కోడె వెంకట్రావు, జి.వెంకట్రావు పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వక్తలు తమ ప్రసంగాల్లో దున్నేవానికే భూమి నినాదంగా వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆర్‌టిసి తదితర ప్రభుత్వరంగాలన్నింటిలోనూ ఔట్ సోర్సింగ్ పెరుగుతున్నదని, శ్రమదోపిడి, పనిభారం తీవ్రమౌతున్నాయని, తమ హక్కుల సాధనకోసం కార్మికులు, రైతాంగంతో భుజం భుజం కలిపి పోరాడాల్సిందిగా నొక్కిచెప్పారు.

**ప్రదర్శన – బహిరంగ సభ :**

ప్రకాశంజిల్లా సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో మేడే రోజు సాయంత్రం స్థానిక ఈమనిపాలెంలోని పార్టీ కార్యాలయం వద్ద నుండి పోస్టాఫీస్, కలెక్టరేట్, మస్తాన్‌దర్గా, కర్నూలురోడ్ మీదుగా ఆర్‌టిసి డిపో వరకు ఎర్రజెండాలు, బ్యానర్లు, నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు.

ఒంగోలు ఆర్‌టిసి డిపో ఆవరణలో జరిగిన బహిరంగసభలో కా॥లలితకుమారి, కా॥ఎం.ఎస్.శాయి, కా॥పేరయ్య తదితరులు పాల్గొని కార్మికవర్గం ముందున్న కర్తవ్యాలను వివరించారు.

**కొత్తపట్నం మండలం :**

మే 2వ తేదీన కొత్తపట్నం మండలం, **వలసపాలెం** గ్రామంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥వాటంబేటి శ్రీరాములు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వలసపాలెం నుండి ఏఐఎఫ్‌టియు(న్యూ) కార్యకర్తలతో కలసి **రంగాయపాలెం, ముస్లింపేట, పోస్టాఫీసు సెంటర్, పల్లెపాలెం రోడ్, కొత్తపట్నం మెయిన్‌రోడ్డు** మీదుగా బస్టాండు సెంటర్ వరకు ఎర్రజెండాలు, బ్యానర్లతో ప్రదర్శన జరిగింది. బస్టాండ్ సెంటర్‌లో రైతుకూలీ సంఘం నాయకులు కా॥కోడూరి కోటేశ్వరరావు మేడే జెండాను ఆవిష్కరించారు. సముద్ర తీరప్రాంతాన్ని స్వదేశీ, విదేశీ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి పరిశ్రమలకు కట్టబెడ్తోన్న పాలకుల విధానాలపై తీరప్రాంత మత్స్యకారులు ఇతర పీడిత ప్రజానీక మందరితో కలసిపోరాడాలన్నారు.

**వేటపాలెం :**

సిపిఐ(ఎం-ఎల్) కార్యకర్తలు, చేనేత కార్మికులు, మేడే సందర్భంగా ప్రదర్శనగా వేటపాలెం సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్నారు. కా॥ఎన్.కుటుంబరావు అరుణపతాకాన్ని ఆవిష్కరించి మేడే అమరులకు జోహార్లు చెప్పారు. 127ఏళ్ళ మేడే పోరాట చరిత్రను గుర్తుచేయటంతోపాటు వేటపాలెం ప్రాంతంలో ప్రధానంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆ సమస్యలను తీవ్రతరం చేస్తున్న పాలకుల విధానాలను ఆయన తన ఉపన్యాసంలో ఎండగడుతూ రైతాంగం, కార్మికులు, గ్రామీణపేదలంతా ఐక్యపోరాటాలు సాగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో కా॥పి.భూషణబాబు, జగన్మోహనరావు, చంద్రమౌళి, దేవేందర్, షేక్‌జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ ప్రజాతంత్ర చేనేత






అనకాపల్లిలో క్వారీకార్మికుల ప్రదర్శన; రెంటచింతల వ్యవసాయకూలీ, గ్రామీణపేదల ప్రదర్శన; ఒంగోలులో మేడే ప్రదర్శన; విక్రంపురం మేడే బహిరంగసభలో కా॥వర్మ

# 'భూస్వామ్య-సామ్రాజ్యవాద దోపిడీని అంతం చేయటానికి కార్మిక, రైతాంగ ఐక్యపోరాటాలను తీవ్రం చేయాలి'

## - స్ఫూర్తిదాయకంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మేడే పతాకావిష్కరణలు -



అనంతపురం మేడే సభలో ప్రసంగిస్తున్న కా॥సి.పెద్దన్న; గుంటూరు మేడే సభలో ప్రసంగిస్తున్న కా॥జస్వంతరావు; కరీంనగర్ మేడే సభలో ప్రసంగిస్తున్న కా॥కోటయ్య; పిడుగురాళ్ళ మేడే సభలో ప్రసంగిస్తున్న కా॥ విజయకుమార్

*'భారతదేశ కార్మిక, కర్షకులారా ఏకంకండి! సంఘటిత, అసంఘటిత కార్మికులు, గ్రామీణ రైతుకూలీలు, గ్రామీణ వృత్తిదారులు ఐక్యమవ్వండి! పేదకులాలమధ్య, దళిత కులాల మధ్య తగవులు పెట్టే పాలకుల కుట్రలకు బలికాకండి!' అని పిలుపునిస్తూ సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి 'మేడే' సందర్భంగా కరపత్రాన్ని ప్రచురించింది. 'ఐక్యమవటానికీ, సంఘటితపడటానికీ, వర్గదృష్టిని పెంపొందించటానికీ, ధృడదీక్షతో వర్గపోరాటాలు సాగించటానికి కార్మికులంతా దీక్షబూనండి' అని ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యవర్గం పిలుపునిస్తూ కరపత్రాన్ని ప్రచురించింది. ఈ కరపత్రాలతో రాష్ట్రవ్యాపితంగా గ్రామీణ, పట్టణ, పేదలవాడలలో, కార్మిక-కర్షక ప్రజానీకం నడుమ విస్తృత ప్రచారం నిర్వహించి, 'అంతర్జాతీయ శ్రామికవర్గ దీక్షాదినం' మేడేని ఒక పండుగలాగా, వేడుకలాగా లేదా లాంఛనంగా దిగజారుస్తున్న పాలకుల సంస్కృతికి భిన్నంగా కార్మిక కేంద్రాలన్నింటా ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), ఎన్‌వైయస్ తదితర ప్రజాసంఘాలన్నీ భాగస్వాములై మేడేని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు.*

**- సంపాదకుడు**

# అనంతపురం జిల్లా

### అనంతపురం :

స్థానిక మండ్ల సుబ్బారెడ్డినగర్‌లో మేడే రోజు ఉదయాన్నే ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥సి.ఆర్.ఖాన్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అమరులందరికీ జోహార్లర్పించారు. కాలనీలో మరిన్ని మౌలిక వసతుల సాధనకోసం ఐక్యపోరాటానికి వక్తలు పిలుపునిచ్చారు.

స్థానిక రజకనగర్‌లో సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో జరిగిన మేడే పతాకావిష్కరణ కార్యక్రమంలో కా॥ చంద్రశేఖర్ జెండాను ఎగురవేశారు.

ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ వద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కా॥లక్ష్మీనారాయణ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు.

పార్టీ కార్యాలయం వద్ద కా॥పెద్దన్న మేడే పతాకావిష్కరణ చేసిన అనంతరం పట్టణంలోని 13ఆటోస్టాండ్ సెంటర్లలో ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కార్మికుల ఆధ్వర్యంలో ఉత్సాహపూరిత వాతావరణంలో మేడే జెండా ఆవిష్కరణలు జరిగాయి.

### ప్రదర్శన - బహిరంగసభ :

మేడే నాడు సా॥5 గం॥లకు స్థానిక ఎన్‌జివో భవనం వద్ద నుండి కోలాహలంగా జెండాలు, బ్యానర్లు, డప్పునృత్యాలు, జనం పాటలతో, నినాదాలతో ప్రదర్శన బయలుదేరి బహిరంగసభాస్థలి లలితకళాపరిషత్ వద్దకు చేరుకుంది.

ఈ మేడే బహిరంగసభకు కా॥సి.ఆర్.ఖాన్ అధ్యక్షత వహించగా ఎన్‌జివో జిల్లా నాయకులు కా॥దేవరాజ్, కా॥నర్సయ్య; కా॥పెద్దన్న; రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥బి.తిమ్మారెడ్డి తదితరులు ప్రసంగిస్తూ ఈనాడు కార్మికులు, ఉద్యోగులు పొందుతున్న కనీసపాటి హక్కులు సాధించుకోవటం వెనుక కూడా కార్మికుల బలిదానాలు, వీరోచిత పోరాట చరిత్ర ఉన్నదనే విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి త్యాగాలతో సాధించుకొన్న కనీసపాటి హక్కులను సైతం గుంజివేసుకుంటున్న దోపిడీ పాలకులు-పోరాడుతున్న ప్రజలపై క్రూర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని, ఈ దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా సమైక్య పోరాట శంఖారావం పూరించాలని పిలుపునిచ్చారు.

ప్రజాకళాకారిణిల నృత్యం, జనం పాటలు సభకు హాజరైన ప్రజానీకాన్ని ఆకట్టుకొన్నాయి.

### రాయదుర్గం :

స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో మేడే జెండాను కా॥పి.రామలింగారెడ్డి ఎగురవేయగా, కా॥బి.తిమ్మారెడ్డి మేడే ప్రాధాన్యతను వివరించారు. కాలనీవాసులు సిసిరోడ్డు, వ్యక్తిగత మరుగుదొడ్లు తదితర వసతుల సాధనకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

బొడ్డురాయి సెంటర్‌లో ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కా॥సి.ఎన్.మూర్తి మేడే జెండాను ఆవిష్కరించి, చేనేత కార్మికుల దయనీయ పరిస్థితులలో మార్పుకోసం పోరాటం మినహా మరో పరిష్కారంలేదని నొక్కి చెప్పారు.

రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో లక్ష్మీబజారులోని వారి కార్యాలయం వద్ద మేడే జెండాను సంఘం కార్యదర్శి కా॥జి.నర్సింహులు ఎగురవేశారు. స్థానికంగా మునిసిపల్ సిబ్బంది, పోలీసుల నుండి తమకు ఎదురౌతున్న వేధింపులను పేర్కొని ఐకమత్యంగా వీటిని ఎదిరించాలని పిలుపునిచ్చారు.

**ఆర్.ఉడేగోళం** గ్రామంలోని ఆటోస్టాండు వద్ద మేడే జెండాను కా॥బి.తిమ్మారెడ్డి ఎగురవేయగా, ఓపిడిఆర్ కార్యకర్తలు కామ్రేడ్స్ పి.రామలింగారెడ్డి, విజయకుమార్; గ్రామపెద్దలు నాగప్ప, తిప్పయ్య, కామ్రేడ్స్ హనుమంతు, భీమేషు, రవి, తదితరులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కణేకల్లు మండలం :

**గోపాలపురం** గ్రామంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥వన్నూరప్ప ఎర్రజెండా ఎగురవేశారు. కామ్రేడ్స్ జయణ్ణ, గంగన్న, ఖాసిం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాము అనుభవిస్తున్న దేవాలయ భూములకు పట్టాలు సాధించటానికి ఆందోళన తీవ్రం చేయాలని తీర్మానించుకున్నారు.

**ఆదిగానిపల్లి** గ్రామంలో కామ్రేడ్ బి.తిమ్మారెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ గుక్కెడు నీళ్ళకోసం ఈ గ్రామ ప్రజలు పరితపించిపోతున్నారని, 66సం॥రాల స్వతంత్ర భారతదేశంలో ఇది సిగ్గుచేటైన విషయమని పేర్కొంటూ, నీళ్ళసాధనకు ఉపక్రమించాలని పిలుపునిచ్చారు.

**కె.కొత్తపల్లి** గ్రామంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥లక్ష్మణ ఎర్రజెండాను ఎగురవేసి, అన్నిరకాల విచ్ఛిన్నాలను అధిగమించి ఉద్యమం ముందుకు సాగుతోందన్నారు.

**మాల్యంలో** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ఓబులేసు మేడే జెండాను ఆవిష్కరించి, ఆ గ్రామంలో మిగులుభూమి సమస్య చాలాకాలంగా అపరిష్కృతంగా వుందనీ, దానిపై సత్వరం కదలాలని పిలుపునిచ్చారు.

**కణేకల్లు** పట్టణంలో మే 2వ తేదీన రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) కార్యాలయం వద్ద కా॥బి.తిమ్మారెడ్డి, ఆర్టీసీ బస్టాండు ముందున్న ప్రధానరహదారి వద్ద; మోటారు వర్కర్స్ ఆటోస్టాండు వద్ద ఆటోవర్కర్స్ యూనియన్ కార్యదర్శి కా॥నాగరాజు, కా॥పెద్దన్న మేడే జెండాలను ఆవిష్కరణలు జరిపారు.

### ప్రదర్శన - బహిరంగసభ :

ఉదయం 11గంటలకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) కార్యాలయం నుండి మేడే ప్రదర్శన బయలుదేరి బస్టాండు మీదుగా కణేకల్లు బ్యాంకు వరకు, తిరిగి బస్టాండు నుండి బిక్కణ్ణేశ్వర దేవాలయంలోని కళ్యాణమంటపం వరకు ఉత్తేజపూరిత వాతావరణంలో సాగింది. మేడే నినాదాలు, ప్రదర్శనకు ముందు ప్రజాకళాకారుల కోలాటం, పాటలతో పట్టణ ప్రజల్ని విశేషంగా ఆకట్టుకున్నారు.

మేడే బహిరంగసభకు కణేకల్ మండల ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కా॥కె.నాగరాజు అధ్యక్షత వహించగా, కామ్రేడ్స్ పెద్దన్న, తిమ్మారెడ్డి, బి.ఓబులేసు, దాదాఫీర్, ఓబులేసులు ఈ సభలో మాట్లాడారు. కా॥పెద్దన్న మాట్లాడుతూ కణేకల్లు ప్రాంతం ఎడారిగా మారుతున్నదని శాస్త్రవేత్తలు చెప్తున్నా, వాస్తవంలో తీవ్రత అర్ధమౌతున్నా పాలకుల నిర్లక్ష్యవైఖరిని తీవ్రంగా నిరసించి, తెగించి పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కణేకల్లుతో పాటు గోపాలపురం, కె.కొత్తపల్లి, పులచెర్ల, మాల్యం గ్రామాల నుండి రైతుకూలీలు, హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కణేకల్లు నుండి ముస్లిం మహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విజయనగరంజిల్లా

### పూసపాటిరేగ మండలం :

పూసపాటిరేగ మండలం **కొత్త కావర్ల**వద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ విజయనగర్ బయోటెక్ కాంట్రాక్టు వర్కర్స్ ఆధ్వర్యంలో మేడే అరుణ పతాకను యూనియన్ ఉపాధ్యక్షుడు కా॥టి.అక్కునాయుడు ఆవిష్కరించారు. ఆ తర్వాత జరిగిన మేడే బహిరంగసభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర సహాయకార్యదర్శి మరియు విజయనగర్ బయోటెక్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కా॥గణేష్‌పండా ప్రసంగిస్తూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో కార్మికులను, రైతాంగాన్ని, సమస్త ప్రజానీకాన్ని పాలకులు ఏవిధంగా దోపిడీ చేస్తున్నారో వివరించారు. కార్మికులు-రైతాంగం ఐక్య ఆందోళనలకు పూనుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం వందమంది కార్మికులు సైకిల్ ర్యాలీగా నాడిపల్లి, ఎరుకొండ, కొప్పర్ల, కొనాడ జంక్షన్ మీదుగా పూసపాటిరేగ మైలాన్ కంపెనీవద్దకు చేరుకుని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కా॥ఏ.తౌడు, కోశాధికారి కా॥సంఘం రాంబాబు; ఇంకా కా॥వెంకట్రావు, బంగార్రాజు, రమేష్, చలం తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### జి.చోడవరం:

పూసపాటిరేగ మండలం, **జి.చోడవరం** వద్దనున్న మైలాన్ లేబొరేటరీస్ పరిశ్రమవద్ద 'పూసపాటిరేగ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్' ఉపాధ్యక్షుడు కా॥రవణ; మరియు శ్రీ మేట్రిక్స్ లేబొరేటరీస్ స్టాఫ్ యూనియన్ ప్రధానకార్యదర్శి కా॥వి.గోవిందరావుల ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణలు జరిగాయి.

అనంతరం జరిగిన బహిరంగసభకు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ కా॥ఎమ్.రామచంద్రరావు, స్టాఫ్‌యూనియన్ ఉపాధ్యక్షుడు కా॥ఆర్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కా॥గణేష్‌పండా ఈ సభలో మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, కనీస అవసరాలను పరిగణలోకి తీసుకొని 12,500 రూ॥కనీస వేతనమివ్వవలసివుండగా దానిని ఏమాత్రం ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవటం లేదన్నారు. వేతన పెంపు డిమాండుతోపాటు పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగంతో కలిసి పోరాటాలు నిర్వహించేందుకు మేడే దినాన ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. ఇతర యూనియన్ నాయకులు ఈ సభలో మాట్లాడారు.

అనంతరం సభాస్థలంవద్ద నుండి 300 మోటారు సైకిళ్ళతో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కలసి ప్రదర్శనగా యస్ఎమ్‌యస్‌హెచ్, అరబిందో, డా॥రెడ్డీస్, ఆంధ్రా ఆర్గానిక్, యస్ఇజెడ్, మెగ్రేట్, సిరేకి, ఎకొలాజిక్, సి.పి.తదితర కంపెనీల మీదుగా పూసపాటిరేగ

**(తరువాయి 8వ పేజీలో)**



విజయనగరంజిల్లా-మైలాన్ పరిశ్రమ వద్ద మేడే సభకు హాజరైన ఉద్యోగులు, కార్మికులు; వరంగల్ జిల్లా-నర్సంపేటలో మేడే ప్రదర్శన; కరీంనగర్‌జిల్లా-బావుపేట మేడే సభకు హాజరైన కార్మికులు

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010